

మనం

సంక్రాంతి శుభాకాంక్షలు

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 45 • పేజీలు:12+16 • వెల: రూ.5 సోమవారం • 15-1-2018 www.manamnews.com /manamnews



ఇంటర్‌లో ప్రయోగమేదీ?

మార్కుల కోసం మామూళ్లు

ప్రాక్టికల్స్ పేరిట వసూళ్లు

యాజమాన్యాల జిమ్మిక్కులు

కాలేజీల్లో అరకొర వసతులే

1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

వివరాలు 2లో..



'చచ్చి'.. బతికిన హవాయి!

అణు క్షిపణి పడబోతోందని అలర్ట్

కాసేపటికి పొరబాటని ప్రకటన

భయంతో వణికిన జనం

కొత్త పురపాలికలు

నెలాఖరులోగా మరో 40 సంస్థలు

మునిసిపాలిటీలు.. నగర పంచాయతీలు



కలెక్టర్ల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

మంత్రివర్గ ఉపసంఘమూ సానుకూలమే

కొన్ని పంచాయతీలలో సర్పంచుల వ్యతిరేకత

కోర్టు కేసులతో విలీనాన్ని అడ్డుకునే యత్నం

హైదరాబాద్, జనవరి 14:

తెలంగాణలో ఈ నెలాఖరులోగా కొత్తగా 40 పురపాలికలు ఏర్పాటయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొత్త మునిసిపాలిటీలు, నగర పంచాయతీలను ఏర్పాటుచేసేందుకు రంగం సిద్ధమైంది. జిల్లా కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్లు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. దాంతో 20 వేలకు పైగా జనాభా కలిగిన మేజర్ గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలుగా మార్చేందుకు రంగం సిద్ధమవుతోంది. పంచాయతీరాజ్ చట్టంలో సంస్కరణలు తెచ్చేందుకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం కూడా ఈ ప్రతిపాదనలకు సానుకూలంగానే ఉండటంతో కొత్త మునిసిపాలిటీల ఏర్పాటు శరవేగంగా



సాగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పంచాయతీల పదవీ కాలం ఈ సంవత్సరం జూలైతో ముగిసిపోతుండటంతో ఈలోపుగానే వీలైనంత త్వరగా కొత్త మునిసిపాలిటీలు, నగర పంచాయతీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు మిగతా 6లో..

సెలవు..



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులందరికీ సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు. సంక్రాంతి సందర్భంగా సోమవారం 'మనం' కార్యాలయాలకు సెలవు. అందువల్ల మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

ధనిక ఢిల్లీ.. బీద బిహార్

పంజాబ్‌లోనూ ధనికుల సంఖ్య ఎక్కువే

గ్రామీణ భారతంలో అత్యధిక పేదరికం

పట్టణాల్లో పేదల సంఖ్య చాలా తక్కువ

జైనులలో 70 శాతం స్థితిమంతులే

హిందూ-ముస్లింల మధ్య అంతరం తక్కువ

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వెల్లడి



6లో..

ఇదీలోకం!



ఎవరేం చెప్పినా గంగిరెద్దులా తలూపడమేనా అని డాడీని అంటుంటావ్‌గా.. ఆ గంగిరెద్దు ఇదేనా మమ్మీ..!

సిటీలోనూ కొక్కొరో..కో!

హైదరాబాద్ మార్కెట్లో పుంజులు

జోరుగా పందెంకోళ్ల అమ్మకాలు

రహస్యంగా బరుల్లో కోడిపందేలు

ఒక్కరోజే 1500 కోళ్ల అమ్మకం

హైదరాబాద్, జనవరి 14:

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో కోడి పందేలు వేసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే హైదరాబాద్ నగరంలోనూ కోడిపుంజుల కూతలు మిగతా 6లో..



వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో సోమవారం వాతావరణం చాలావరకు పొడిగా ఉంటుంది. అక్కడక్కడా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలో మార్పు ఉండదు. చలి తీవ్రత తగ్గుతుంది. గంటకు 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 66 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి తె.5.12 తదుపరి అమావాస్య; నక్షత్రం: మూల సా. 4.17 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: రా.1.18-3.06; దుర్ముహూర్తం: మ.12.03-12.48, మ.3.01-3.45; రాహుకాలం: ఉ.8.16-9.39; అమతఘడియలు: ఉ.9.06-10.54; శుభసమయం: ఉ.6.00-7.00.

సూర్యోదయం: 6.53

సూర్యాస్తమయం: 5.58

ఇచ్చేది గోరంత.. చూపేది కొండంత!

రికార్డుల్లోనే నిబంధనల అమలు



విద్యార్థులకే కాదు.. ఉద్యోగులకూ తిప్పలే

వేలల్లో వేతనాలు చెల్లిస్తున్నట్లు రికార్డులు

వాస్తవంగా అందులో సగమూ దక్కదు

ఖాతాల్లో వేసి.. కార్డుతో తీసుకుంటూ

ప్రైవేటు కాలేజీల నయా దోపిడీ

హైదరాబాద్, జనవరి 14 (మనం ప్రతినిధి):

నగర శివార్లలోని ఓ ఇంజనీరింగ్ కాలేజి.. అందులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నాలుగేళ్లుగా పనిచేస్తున్న శారదకు యాజమాన్యం నెలకు రూ.38 వేల వేతనం చెల్లిస్తోంది. నెలనెలా ఆమె ఖాతాలో



ఆ మొత్తం నేరుగా పడుతుంది. అంతాబాగానే ఉందనిపిస్తోంది కదూ? అయితే, శారద మాత్రం తన జీతం కేవలం రూ.16 వేలు మాత్రమేనని చెబుతోంది. నెల నెలా ఆమె చేతికందుతోంది కూడా అంతే మొత్తం.. మరి ఆమె ఖాతాలో ఆ మిగతా 6లో..




స్వీట్ ఫెస్టివల్‌లో ఓ చిన్నారి


హైదరాబాద్‌లో సంక్రాంతి పండగ సందడి



అంతర్జాతీయ కైట్స్ ఫెస్టివల్‌లో భారీ పతంగులను ఎగురవేస్తున్న ఔత్సాహికులు



ప్రకృతి ఒడిలో ఏకాగ్రత పెంపు

- క్లాస్‌రూంకన్నా చెట్ల కిందే మేలు

న్యూయార్క్, జనవరి 14: తరగతి గదిలో చెప్పే పాఠాలకన్నా పచ్చని చెట్ల మధ్య కూర్చోబెట్టి చెప్పిన పాఠాలే విద్యార్థుల మనసులో నాటుకుపోతాయని తాజా అధ్యయనంలో తేలింది. చుట్టూ ఉన్న పచ్చని చెట్లను చూసి విద్యార్థులలో ఏకాగ్రత పెరుగుతుందని, దాని ఫలితంగానే టీచరు చెప్పే పాఠాలు తేలిగ్గా గుర్తుండిపోతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇలా పకృతి ఒడిలో నేర్చుకునే పాఠాలు దీర్ఘకాలంపాటు గుర్తుండిపోవడంతో పాటు పలు ఇతర ఉపయోగాలు ఉన్నాయని యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ పరిశోధకులు పేర్కొన్నారు. చెట్లు విడుదల చేసే ఆక్సీజన్‌తో ఊపిరితిత్తులకు మేలు జరుగుతుందని, అదేవిధంగా స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడం వల్ల ఒత్తిడి తగ్గి శారీరక, మానసికంగా ఉత్సాహంగా ఉంటారని చెప్పారు. మరీ అడవులలోకి వెళ్లి చదువు చెప్పడం ఎలా కుదురుతుందని అంటున్నారా..? మరేం పర్వాలేదు.. తరగతి కిటికీల్లోంచి పచ్చని చెట్లు కనిపించినా చాలు విద్యార్థుల ఏకాగ్రత పెరుగుతుందని వారు తెలిపారు. స్కూలు భవనం చుట్టూ పచ్చని చెట్లు ఉంటే ఇటు ఆరోగ్యంతో పాటు అటు పిల్లల చదువులూ చలాగ్గా సాగుతాయని వివరించారు.



'మెదడు' అనుకరించే కొత్త కణాలు

లండన్, జనవరి 14: నిర్మాణంలో.. పనితీరులో మెదడులోని కణజాలాన్ని పోలిన కొత్త కణాలను త్రీడీలో ప్రింట్ చేసే సరికొత్త విధానాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కణాలతో మెదడు, ఊపిరితిత్తుల సజీవ నమూనాలను సిద్ధం చేయవచ్చని ఇంపీరియల్ కాలేజ్ లండన్ పరిశోధకులు పేర్కొన్నారు. మన శరీరంలోని కణజాలాన్ని పోలి ఉండడం వల్ల వీటిని వైద్య చికిత్సల్లో ఉపయోగించవచ్చని చెప్పారు. అదేవిధంగా దెబ్బతిన్న అవయవాలను సరిచేసేందుకూ ఈ కణజాలం ఉపయోగపడుతుందని వివరించారు. అవయవంలోని దెబ్బతిన్న ప్రాంతంలో ఈ కణజాలాన్ని ఉపయోగించి కొత్త కణాలు పుట్టేలా చేయవచ్చని తెలిపారు. ఈ విధానంలో కణజాలాన్ని రీప్లేస్ చేయడం ద్వారా గాయాలను వాటికవే మానిపోయేలా చేయొచ్చని పేర్కొన్నారు. దెబ్బతిన్న కణాల స్థానంలో కొత్త కణాల ఆవిర్భావానికి ఇవి తోడ్పడతాయని వివరించారు.



త్రీడీ ప్రింటర్‌తో..
ఇంట్లోనే డైనోసార్ శిలాజం

జోహెన్నస్‌బర్గ్, జనవరి 14: అప్పు డెప్పు డో అంతరిం చిపోయిన డైనోసార్ శిలాజాన్ని ఇంట్లోనే త్రీడీ ప్రింట్ చేసుకునే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతు న్నారు. పురావ స్తు శాఖ జరిపి న తవ్వకాలలో దొరికిన 200 మిలియన్ సంవత్సరాల నాటి డైనోసార్ పుర్రెను అచ్చంగా ప్రింట్ చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం డైనోసార్ పుర్రెను త్రీడీలో రీకన్‌స్ట్రక్ట్ చేశామని తెలిపారు. పుర్రెను సీటీ స్కాన్ చేసి త్రీడీ ప్రింట్‌కు అనుకూలంగా మార్పులు చేసి అందుబాటులో ఉంచామని వివరించారు. ఔత్సాహిక శాస్త్రవేత్తలు, సామాన్యుల కోసం ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు సౌతాఫ్రికా విట్‌వాటర్ స్రాండ్ పరిశోధకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా ఈ డైనోసార్ పుర్రెను త్రీడీలో ప్రింట్ చేసుకోవచ్చని అన్నారు.

ఇంటర్‌లో ప్రయోగమేదీ..?

మార్కుల కోసం మామూళ్లు.. ప్రాక్టికల్స్ పేరిట వసూళ్లు

- యాజమాన్యాల జిమ్మిక్కులు
- కాలేజీల్లో అరకొర వసతులే
- ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



హైదరాబాద్, జనవరి 14(మనం ప్రతినిధి): ఉన్నత చదువుకు.. విద్యార్థుల భవిష్యత్తుకు అత్యంత కీలకమైన ఇంటర్ విద్యలో ప్రమాణాలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసే ఇంటర్మీడియెట్‌లో ప్రమాణాలు తగ్గడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అందులోనూ ప్రాక్టికల్స్ నిర్వహణ విషయంలో అటు ప్రభుత్వం.. ఇటు ప్రైవేటు యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రతీ కాలేజీలో ల్యాబ్, అవసరమైన రసాయనాలు అందుబాటులో ఉండాలి.. వాస్తవంలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఏటా ప్రాక్టికల్స్‌పై పెద్దఎత్తున గందరగోళం నెలకొంటున్నా.. పరిష్కారం దిశగా అడుగులు పడడంలేదు. ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది.

రాష్ట్రవ్యాప్తంగా ..

రాష్ట్రవ్యాప్తంగా 404 ప్రభుత్వ కాలేజీలు ఉండగా.. ప్రైవేటు, కార్పొరేట్ కలిసి మరో 1500 వరకు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో ల్యాబ్ పరికరాల కొనుగోలుకు ఈ ఏడాది నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జిల్లాకు ఒక కాలేజీలో, బాలికల జూనియర్ కళాశాలల్లో పూర్తిస్థాయిలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. మిగతా కాలేజీల్లో అధ్యాపకులు, వసతులు సరిగా లేక అరకొరగా నిర్వహిస్తున్నారు. ప్రాక్టికల్స్ మొత్తం 30 మార్కులు కాగా.. ప్రభుత్వ కాలేజీల్లో 15 నుంచి 26 మార్కుల వరకు వేస్తున్నారు. అయితే, ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో మాత్రం ఎలాంటి ల్యాబ్‌లు, పరికరాలు లేకున్నా.. విద్యార్థులకు 30 మార్కులకు 30 మార్కులు వేస్తుండడం గమనార్హం.

ప్రాక్టికల్ మార్కులు కీలకం..

ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు 25% వెయిటేజీ ఉన్న నేపథ్యంలో బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్ మా ర్కులు ఎంతో కీలకం.. అయితే, మార్కులు వేసేది తామే కదా అనే భావనతో ప్రాక్టికల్స్‌పై నిర్లక్ష్యం ప్రదర్శిస్తు న్నారు. దీంతో చాలా కాలేజీల్లో అసలు ల్యాబ్‌లే లేవు.. ఉన్న వాటిలో పరికరాలు, రసాయనాలు లేవు. ఈ వి షయంలో ప్రభుత్వ కాలేజీలే మెరుగనే అభిప్రాయం ఉంది. అక్కడ చదివే విద్యార్థులకు కాస్తో కూస్తో అవగాహన ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ అనే వ్యవహారం ఓ ఇంద్రజాల ప్రదర్శన లాంటిదనే చెప్పాలి. ఆ కాలేజీల్లో విద్యను అభ్యసించే అభ్యర్థులకు కనీసం ల్యాబ్‌లో ఉండే పరికరాల పేర్లు తెలియడం లేదంటే అతిశయోక్తి కాదు. వారు కేవలం థియరీ పార్ట్‌కే పరిమితం అవుతున్నారు. ప్రాక్టికల్స్ తతంగమంతా యాజమాన్యం చూసుకుంటుంది.

సీసీ నిఘాలో పరీక్షలు

ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు పూర్తిగా సీసీ నిఘాలో జరగనున్నాయి. పరీక్ష జరిగే రోజు సీసీ కెమెరాలు ఉన్న గదిలో సిబ్బంది ఆధ్వర్యంలో ప్రశ్నపత్రాల సీల్‌ను తెరుస్తారు. అనంతరం విద్యార్థులకు ప్రశ్నపత్రాలను అందజేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా.. ప్రైవేటులో కొంత మాస్‌కాపీయింగ్‌కు పాల్పడే ఆస్కారం ఉందనే ఆలోచనతో ఇంటర్మీడియెట్ అధికారులు ఆ పరీక్ష కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్టు తెలుస్తోంది. ప్రైవేట్ కాలేజీల్లో ప్రయోగ పరీక్షలు జరుగుతున్న సమయంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో పాటు అనుభవం ఉన్న అధ్యాపకులను పర్యవేక్షకులుగా నియమించనున్నారు. వీరితో పాటు ఆయా జిల్లాల పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, హైపవర్ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.


జంబ్లింగ్ విధానంపై విముఖత

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఏళ్ల తరబడి నుంచి విద్యావేత్తలు, మేధావులు కోరుతున్నారు. ఉమ్మడి ప్రభుత్వ పాలనా కాలం నుంచి నేటి వరకు జంబ్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం అపసోపాలు పడుతోంది. జంబ్లిగ్ విధానంలో ఇంటర్ ప్రాక్టికల్స్‌ను నిర్వహిస్తే.. అసలు ప్రయోగాత్మకంగా ల్యాబ్‌ల్లో పరీక్షలు జరిపిన వారికే మార్కులు వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల అన్ని కాలేజీల్లో తప్పనిసరిగా విద్యార్థులను ప్రాక్టికల్స్ చేయించాల్సి వస్తుంది. ఫలితంగా విద్యలో నాణ్యత పెరగడానికి ఇది కొంతవరకైనా దోహదం చేస్తుందని భావించవచ్చు. ఈ దశలో జంబ్లింగ్ విధానంతో ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉంది. దీంతో యాజమాన్యాలు, కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రతి ఏటా జంబ్లింగ్ విధానాన్ని అడ్డుకుంటూనే ఉన్నారు. ఈసారి ప్రభుత్వ విద్య బలోపేతానికి కృతనిశ్చయంతో ఉన్న సీఎం కేసీఆర్ జంబ్లింగ్ విధానాన్ని ప్రవేశపెడతారని భావించారు. అయితే ప్రభుత్వం మాత్రం ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

'చచ్చి'.. బతికిన హవాయి!

- అణు క్షిపణి పడబోతోందని అలర్ట్
- కొద్ది నిమిషాల తర్వాత పొరబాటని ప్రకటన
- గుండె అరచేతిలో పెట్టుకుని బతికిన జనం

వాషింగ్టన్/హొనొలులు, జనవరి 14: ఒక్క చిన్న పొరబాటు.. లక్షల మంది ప్రజలకు చివరి క్షణాలను రుచి చూపించింది! చావుదాకా తీసుకెళ్లినంత పనిచేసింది. అమెరికాలోని హవాయి రాష్ట్రం మొత్తాన్ని కొద్ది నిమిషాల పాటు గుండెను అరచేతిలో పట్టుకుని బిక్కుబిక్కుమని బతికేలా చేసింది. హవాయి అత్యవసర నిర్వహణ సంస్థ నుంచి ప్రజలందరి ఫోన్లకు ఉదయం 8.07 గంటలకు ఒక మెసేజ్ వచ్చింది. ''హవాయిపైకి ఏక్షణంలోనైనా బాలిస్టిక్ అణు క్షిపణి దూసుకువస్తోంది. అంతా అప్రమత్తంకండి. దీన్ని డ్రిల్ అనుకొని తేలిగ్గా తీసి పారేయకండి. సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి''... ఇదీ ఆ సందేశం సారాంశం. దాంతో వెనుకాముందు ఆలోచించకుండా జనాలు తమ ఉరుకులు పరుగులు పెట్టారు. ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో తెలియక బెంబేలెత్తిపోయారు. అడమ్ కుర్జ్ అనే వ్యక్తి తన అనుభవాన్ని చెబుతూ 'నేను మిసైల్ అలర్ట్ వచ్చిన నాలుగు నిమిషాల తర్వాత నిద్ర లేచాను. అంతా పరుగులు పెడుతున్నారు. మాకు ఏం చేయాలో తోచలేదు. మా పెట్స్‌ని వెంటబెట్టుకుని వెళ్లి బాత్ రూంలో భద్రంగా ఉండొచ్చిని దాక్కున్నాము' అని చెప్పుకొచ్చాడు. హవాయిలోని దాదాపు 14 లక్షల మంది ప్రజలతో పాటు వేలాది పర్యాటకులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని గడిపారు. పది నిమిషాలు గడిచిన తర్వాత అది పొరబాటుగా వచ్చిన అలర్ట్ అని హవాయి ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ట్వీట్ చేసింది. మళ్లీ 8.45 గంటలకు ప్రజలందరికీ మరో మెసేజ్ అందింది. 'ఎటువంటి క్షిపణి దాడి జరగలేదు. ఓ ఉద్యోగి షిఫ్టు మారే సమయంలో పొరబాటుగా ఒక బటన్ నొక్కబోయి మరో బటన్ నొక్కడంతో మొదటి మెసేజ్ వచ్చింది' అని సందేశం పంపారు. ఈ సమాచారాన్ని హవాయి గవర్నర్ డేవిడ్ ఐజ్ ధ్రువీకరించారు. మున్ముందు ఇటువంటి పొరబాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా హవాయి పరిస్థితిపై ఆరా తీశారు. పొరబాటుకు కారణాలపై దర్యాప్తునకు ఆదేశించారు.



ఇప్పటికైనా అప్రమత్తం కావాలి

ఉత్తర కొరియాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పటికైనా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అప్రమత్తం కావాలని డెమొక్రటిక్ కాంగ్రెస్ సభ్యురాలు తులసీ గబ్బార్డ్ అన్నారు. నిజంగా అణు బాంబు పడితే హవాయికి ఎటువంటి రక్షణ ఉండదన్న విషయాన్ని ప్రజలు ప్రత్యక్షంగా చూశారన్నారు. ఉత్తరకొరియా క్షిపణి దాడి చేస్తే కేవలం 20 నిమిషాల్లోనే హవాయి మొత్తం తుడుచుకుపెట్టుకుపోతుందన్నారు. దీనిని గుర్తించి ఇకనైనా ట్రంప్ ఒట్టి మాటలను పక్కనపెట్టి... కొరియాతో శాంతి చర్చలకు సిద్ధం కావాలని సూచించారు.

పెరూ తీరంలో భూకంపం

- 7.3 తీవ్రత నమోదు
- సునామీ హెచ్చరికలు జారీ

లిమా, జనవరి 14: పెరూలో ఆదివారం భూకంపం సంభవించింది. తెల్లవారు జామున 4.18 గంటల సమయంలో పుక్వియో నగరానికి 124 కిలోమీటర్ల దూరంలోని తీర ప్రాంతంలో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై 7.3 తీవ్రతతో ప్రకంపనలు నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. తెల్లవారు జామున ఒక్కసారిగా భూమి కంపించడంతో నిద్రలో ఉన్న ప్రజలు లేచి భయంతో పరుగులు పెట్టారు. పలు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. స్వల్ప ఆస్తి నష్టం తప్ప ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. కాగా, భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధి సునామీ హెచ్చరికలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. పెరూతో పాటు చిలీ తీరంలో కూడా సునామీ విరుచుకుపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఐరాస భారత ప్రతినిధి
ట్విటర్ హ్యాక్


- పాక్ జెండా, అధ్యక్షుడి ఫొటోలు పోస్ట్

న్యూఢిల్లీ, జనవరి 14: ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ ట్విటర్ అధికారిక ఖాతా ఆదివారం ఉదయం హ్యాకింగ్‌కు గురైంది. ఆయన ట్విటర్ హోం పేజీలో హ్యాకర్లు రెండు ఫొటోలు పోస్ట్ చేశారు. పాకిస్థాన్ జాతీయ జెండా, ఆ దేశాధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్ ఫొటోలను ట్వీట్ చేశారు. దీనిని గుర్తించి ఫిర్యాదు చేయడంతో ట్విటర్ ఇండియా కొద్దిసేపటి తర్వాత ఆయన ఖాతాను పునరుద్ధరించింది. కాగా, హ్యాక్ చేసింది ఎవరనే విషయం తెలియరాలేదు.

భార్య.. కొడుకు హత్య


- భర్తను అరెస్టుచేసిన హాంకాంగ్ పోలీసులు
- దక్షిణకొరియా నుంచి వచ్చి మరీ దారుణం
- హత్యకు కొద్దిసేపటి ముందే పోలీసులకు ఫోన్

హాంకాంగ్, జనవరి 14: దక్షిణ కొరియాకు చెందిన ఓ వ్యక్తి తన భార్య, కొడుకును హాంకాంగ్‌లోని అత్యంత లగ్జరీ హోటళ్లలో ఒకటైన రిట్జ్-కార్ల్టన్‌లో హతమార్చాడన్న అనుమానంతో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ వ్యక్తి, మరో మహిళ గొడవ పడుతున్నట్లు ఫిర్యాదు రావడంతో పోలీసులు హుటాహుటిన హోటల్ వద్దకు వెళ్లారు. అయితే అక్కడ మహిళతో పాటు మరో చిన్న కుర్రాడు కూడా మరణించి కనిపించారు. దాంతో వాళ్లను అతడే హతమార్చి ఉంటాడన్న అనుమానంతో పోలీసులు అతడిని అరెస్టుచేసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వాళ్లంతా ఒకే కుటుంబసభ్యులా.. కాదా అన్న విషయాన్ని పోలీసులు ఇంకా నిర్ధరించలేదు. కానీ హాంకాంగ్‌లోని దక్షిణకొరియా రాయబార కార్యాలయం వాళ్లు మాత్రం ఆ ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందిన కొరియన్లని చెప్పారు. కొద్ది రోజుల క్రితమే ఆ ముగ్గురూ హోటల్లో దిగారు. హత్య జరగడానికి కొద్ది సేపటి ముందు వాళ్లకు తెలిసిన వ్యక్తి అక్కడేదో జరగబోతోందని దక్షిణ కొరియాలో ఉన్న అధికారులను హెచ్చరించాడని అంటున్నారు.



సముద్రంలో మునగబోయి..

ఇదేదో పిల్లలు ఆడుకునే బొమ్మ అని అనుకుంటున్నారా? అదేం కాదు.. నిజమైన విమానమే!! టర్కీలోని ట్రాబ్జన్‌లోని విమానాశ్రయం రన్‌వేపై దిగాల్సిన పెగాసస్ ఎయిర్‌లైన్స్ విమానం ఒక్కసారి జారిపోయి ఇలా సముద్రపు ఒడ్డున నిలిచిపోయింది. ఆ సమయంలో విమానంలో 162 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ఈ ప్రమాదంలో వారంతా సురక్షితంగా బయటపడటం విశేషం


హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్ర పటాలతో కూడిన పతంగులను ఎగురవేస్తున్న బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ ఖావీ అబ్బాసీ

ప్రభుత్వం, ప్రజల మధ్య వారధి 'మనం'

- క్యాలెండర్ ఆవిష్కరణలో ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, జనవరి 14(మనం న్యూస్): 'మనం' దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని ప్రభుత్వ చీఫ్ విప్, ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య 'మనం' వారధిగా పని చేస్తూ అనతి కాలంలోనే ప్రజా దరణ పొందిందని అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ 'మనం' దినపత్రిక క్యాలెండర్‌ను ఆ విష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త పత్రికే అయినప్పటికీ ప్రధాన పత్రికలతో సమానంగా అన్ని వార్తలను సమగ్రంగా అందిస్తోందని కొనియాడారు. ప్రజా సమస్యలను వెలికితీయడంలో 'మనం' ఎంతో ముందుందని ప్రశంసిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీఆర్ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులు, 'మనం' పత్రిక విలేకరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అంబరాన్నంటిన భోగి సందడి

హైదరాబాద్, జనవరి 14: రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి సందడి అంబరాన్నంటుతోంది. ఆదివారం భోగి పండుగ సందర్భంగా గ్రామాలు, పట్టణాలు, నగరాలు అన్న తేడా లేకుండా ఉదయమే భోగి మంటలు వేశారు. చిన్నా, పెద్దా అందరూ భోగి మంటల వద్ద చలి కాచుకుని ముచ్చట్లు చెప్పుకున్నారు. నగరాల్లో ఉంటున్న వారు పండుగకు స్వగ్రామాలకు చేరుకోవడంతో పల్లెల్లో నెలకొన్న సందడి అంతాఇంతా కాదు. ఉదయం చిన్నారులు స్నానం చేసి కొత్త బట్టలు కట్టుకుని భోగి దండలు మంటల్లో వేసి మురిసిపోయారు.



శబరిమలలో మకరజ్యోతి దర్శనం



శబరిమల, జనవరి 14: అయ్యప్ప స్వామి కొలువై ఉన్న శబరిమలలో పవిత్ర మకర జ్యోతి దర్శనమిచ్చింది. జ్యోతిని దర్శించుకున్న భక్తజనం భక్తి పారవశ్యంతో పొంగిపోయారు. మకరజ్యోతి దర్శనానికి లక్షల సంఖ్యలో భక్తులు శబరిమలకు పోటెత్తారు. ఆదివారం సాయంత్రం 6:45 గంటలకు మకర జ్యోతి మూడుసార్లు భక్తులకు దర్శనమిచ్చింది. స్వామియే శరణం అయ్యప్ప శరణు ఘోషతో శబరిగిరులు మార్మోగిపోయాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయ సన్నిధానంతో పాటు పంబా నది వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. మకరజ్యోతి దర్శనం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అయ్యప్ప నామస్మరణతో శబరిగిరులు మార్మోగాయి.

ఎంసెట్ కుంభకోణం.. జేఎన్‌టీయూకు ఉచ్చు

- అధికారులకు సీఐడీ నోటీసులు
- వివరణ రాగానే అభియోగాల నమోదు?!

హైదరాబాద్, జనవరి 14 (మనం ప్రతినిధి): రెండేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎంసెట్-2 ప్రశ్నాపత్రం లీకేజీ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కుంభకోణాన్ని చేధించడానికి ఇప్పటికే సీఐడీ రంగంలోకి దిగగా.. త్వరలో 19 మంది నిందితులను అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ కేసులో ఇప్పటి వరకు 67 మంది నిందితులను అరెస్టు చేశారు. కాగా, ఈ కుంభకోణం ఉచ్చులో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు ఉన్నట్లు సమాచారం. మొత్తంగా ఈ వ్యవహారమంతా జెన్‌టీయూ అధికారులకే చుట్టుకోనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వాస్తవానికి ఈ కేసులో గతంలోనే అభియోగాలు దాఖలు చేయాలని భావించిన సీఐడీ అధికారులు చివరి నిమిషంలో ఆ యోచనను విరమించుకున్నారు. కొందరు జేఎన్‌టీయూ అధికారులకు సీఐడీ నోటీసులు జారీ చేసిందని, వారి వివరణ అందిన తర్వాతే ముందడుగు వేయాలని భావిస్తున్నారు. అలాగే, పరారీలో ఉన్న 19 మంది నిందితులను అరెస్టు చేయకుండా అభియోగపత్రాలు నమోదు చేస్తే తదుపరి దర్యాప్తునకు ఆటంకాలు వచ్చే అవకాశముందని కూడా అనుకుంటున్నారు. అలాగే, జేఎన్టీయూ ప్రశ్నాపత్రం రూపొందించి పరీక్షలు నిర్వహించే ప్రక్రియలో ఏమైనా లోపాలు ఉన్నాయేమోననే అంశంపై సీఐడీ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు వర్సిటీకి ఓ ప్రశ్నావళి సైతం పంపారు.



ఆటోను ఢీకొన్న లారీ

- భద్రాద్రి కొత్తగూడెంలో నలుగురి మృతి

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 14 (మనం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. జిల్లాలోని టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతి పరిధిలోని తంగెల తండా వద్ద ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయానిన దర్శించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా ఆటోను.. వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. లారీ అత్యధిక వేగంతో రావడంతో.. ఆటోపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారి పరిస్థితి కూడా విషమంగా ఉంది. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. రోడ్డు పక్కన ఆటోను నిలిపి ఉంచినప్పుడు ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. కంటైనర్ కింద ఆటో ఇరుక్కుపోవడంతో మృత దేహాలను అతి కష్టంమీద వెలికితీశారు.

పంచాయతీ ఎన్నికల్లో పరోక్ష పద్ధతి వద్దు

- బీసీలకు తీరని అన్యాయం: జాజుల

హైదరాబాద్ సిటీ, జనవరి 14(మనం న్యూస్): వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నిల్లో గ్రామ సర్పంచ్‌లను వార్డు మెంబర్ల ద్వారా పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నుకోవాలనే రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసులను బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా వ్యతిరికిస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన పంచాయతీ ఎన్నికల తీరుపై ఒక ప్రకటన విడుదల చేశారు. పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి పరోక్ష పద్ధతిని తీసుకువస్తే బీసీలకు రాజకీయంగా తీరని అన్యాయం జరుగుతుందని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 8,684 గ్రామ పంచాయతీలు ఉంటే బీసీలకు జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు 50 శాతం లేకపోవడంతో అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. బీసీలకు ప్రస్తుతం 34 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నందున వార్డుమెంబర్ల ద్వారా సర్పంచ్‌ను ఎన్నుకోవాలనే నిబంధనతో జనరల్ స్థానాలు కలిగిన సుమారు 3,500 గ్రామాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అగ్రకుల ధనవంతులు డబ్బున్న కులాలవారే వార్డుమెంబర్లతో క్యాంపు రాజకీయాలు చేసి కైవసం చేసుకుంటారని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మంత్రి వర్గ ఉపసంఘం సిఫార్సులను పరిగణలోకి తీసుకోవద్దని శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. బంగారు తెలంగాణలో మళ్లీ బాంచెన్ దొర తెలంగాణ వస్తుందని దీనిని అందుకే వ్యతిరేకిస్తున్నామని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

సమరానికి పార్టీలు సై

ముందస్తు వ్యూహంలో టీఆర్ఎస్.. జోరు పెంచుతున్న కాంగ్రెస్

- కొత్త పార్టీ దిశగా కోదండరామ్
- బరిలో 'బహుజన లెఫ్ట్‌ఫ్రంట్'
- బలోపేతానికి బీజేపీ ఆరాటం
- ఉనికి కోసం టీడీపీ పోరాటం

హైదరాబాద్, జనవరి 14 (మనం ప్రతినిధి): సార్వత్రిక ఎన్నికల సమరానికి పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. 2019లో ఎన్నికలు జరుగనున్నాయి. కాగా ముందస్తుగా ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయనే ఓవైపు ప్రచారం సాగుతుంది. ఈ నేపథ్యంలో అధికార టీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా శరవేగంగా పావులు కదుపుతోంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ జోరు పెంచింది. ఇక సీపీఎం, ప్రజా సంఘాలతో కలిసి బహుజన లెఫ్ట్‌ఫ్రంట్‌కు శ్రీకారం చుట్టంది. బీజేపీతో పాటు టీడీపీ రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదిగేందుకు తమదైన శైలిలో పావులు కదుపుతున్నాయి. ఉనికిని కాపాడేందుకు టీడీపీ పోరాటం ప్రారంభించింది.

వ్యూహ రచనలో టీఆర్ఎస్ తలమునకలు..

వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అధికార టీఆర్ఎస్ పార్టీ రంగం సిద్ధం చేస్తుంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై ఇప్పటికే మూడు సర్వేలు నిర్వహించింది. ముందస్తు ఎన్నికల జరిగే అవకాశం ఉందనే ప్రచారంతో ప్రత్యేకంగా ప్రయివేటు ఏజెన్సీలతో పాటు ఇంటిలిజెన్స్ విభాగంతో సీఎం కేసీఆర్ సర్వేలను చేయించినట్టుగా సమాచారం. ఇందులో భాగంగా కేవలం 30లోపు మందికి మాత్రమే పక్కాగా గెలిచే అవకాశాలున్నట్టు సర్వేలో గుర్తించారు. దాదాపు 60 నుంచి 70 మంది వరకు ద్విముఖ పోటీ, మిగిలిన స్థానాల్లో త్రిముఖ పోటీ ఉన్నట్టుగా గుర్తించినట్టుగా తెలిసింది. ఈ క్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో ఈ నెలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే ఆలోచనలో సీఎం కేసీఆర్ ఉన్నట్టుగా సమాచారం. అంతే కాకుండా 2018లో పెద్ద ఎత్తున సంక్షేమకార్యక్రమాలను అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందులో భాగంగానే బడ్జెట్‌లోనూ కులాల వారీగా సంక్షేమ పథకాలకు ప్రత్యేక నిధులను కేటాయించే ఆలోచనలో సీఎం కేసీఆర్ ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. ఎన్నికల్లో విజయం సాధించేందుకు అన్నీ తానై అయి కేసీఆర్ ఎన్నికల ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నట్టుగా తెలుస్తుంది. ప్రజల్లో మీరుండండి, గెలుపు విషయం నేను చూసుకుంటానని ఇదివరకే కేసీఆర్ ప్రజాప్రతినిధులతో పేర్కొన్న దాఖలాలున్నాయి. ఆకర్ష్‌తో ఇతర పార్టీల్లో కీలకమైన నేతలను తమ పార్టీలోకి చేర్చుకునే అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు.

జోష్‌లో కాంగ్రెస్..

కాంగ్రెస్ పార్టీ నేతలు కొద్ది రోజులుగా జోష్‌లో ఉన్నారు. ప్రధానంగా రాహూల్ గాంధీ ఏఐసీసీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టడం, గుజరాత్ ఎన్నికల్లో అనుకూల ఫలితాలు రావటంతో ఆ పార్టీ రాష్ట్ర నేతలు దూకుడుగా ముందుకు సాగుతున్నారు. రైతులకు అండగా మేమున్నామంటూ ఆర్మూర్ డిక్లరేషన్‌ను ఇటీవలే టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. విద్యుత్ కొనుగోళ్లు, ఒప్పందాల విషయంలో ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడిందంటూ టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు రేవంత్‌రెడ్డి, దాసోజు శ్రావణ్‌కుమార్, షబ్బీర్ అలీ, కోమిటిరెడ్డి వెంకటరెడ్డి, డీకే అరుణ విమర్శలు గుప్పిస్తున్నారు. మరో వైపు బస్సు, పాదయాత్రలు, దళిత యాత్రలు చేపట్టేందుకు సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, వీహెచ్, రేవంత్‌రెడ్డితో పాటు ప లువురు అధిష్టానానికి సూచించారు. రైతు సమస్యలపై ఉద్యమాలను ఉధృతం చేసేలా ఆ పార్టీ అనుబంధ సంఘమైన కిసాన్ సంఘ్‌ను బలోపేతం చేసే పనికి పార్టీ శ్రీకారం చుట్టింది. పాదయాత్ర ఒకరికి ఇస్తే మరొకరి కోపం వస్తుందని భావించిన అధిష్టానం వ్యూహాత్మకంగా బస్సు యాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలుస్తుంది. బస్సు యాత్రతో ప్రజల వద్దకు పోయే విధంగా ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు సమచారం. కేసీఆర్ ఆడుతున్న ఆకర్ష్ మైండ్‌గేమ్‌ను ఉత్తమ్‌కుమార్ ఆడుతున్నారనే ప్రచారం సాగుతోంది. తమ పార్టీలోకి టీఆర్ఎస్‌కు చెందిన ముఖ్యులు రానున్నారని పలు సందర్భాల్లో ఉత్తమ్ పేర్కొన్న దాఖలాలున్నాయి.




28 పార్టీలతో ప్రత్యామ్నాయ వేదిక..

తెలంగాణలో కొత్త ప్రత్యామ్నాయ రాజకీయ వేధికకు సీపీఎం, ప్రజా సంఘాలు శ్రీకారం చుట్టాయి. 28 పార్టీలతో బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్)ను గురువారం ఏర్పాటు చేశాయి. దీనికి అధ్యక్షుడిగా నల్లా సూర్యప్రకాశ్, కన్వీనర్‌గా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వ్యవహరించనున్నారు. జ్యోతిరావ్‌పూలే, అంబేద్కర్, కారల్ మార్క్స్ ఆలోచనలతో ఈ ఫ్రంట్ ఏర్పాటు చేసినట్టుగా వారు పేర్కొంటున్నారు.

ఇతర వామపక్షాలను ఈ ఫ్రంట్‌లోకి ఆహ్వానిస్తున్నట్టుగా నేతలు పేర్కొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో 119 స్థానాల్లో పోటీ చేయనున్నట్టు ప్రకటించారు.

కోదండరామ్ పార్టీపై ఉత్కంఠ..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ప్రొఫెసర్ కోదండరామ్ కొత్తగా పార్టీ పెట్టనున్నట్టు ఇదివరకే ప్రకటించారు. పార్టీ ఏర్పాటుపై పలువురు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నిరుద్యోగ, రైతు సమస్యలపై దశలవారీ ఆందోళనలను కోదండరామ్ చేపట్టారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందంటూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.



బలోపేతం కోసం బీజేపీ..

రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే పనిలో బీజేపీ నేతలు దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ హవా కొనసాగుతుండటంతో రాష్ట్రంలోనూ బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు ఆ పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. ఇదే క్రమంలో టీడీపీ తమ ఉనికిని కాపాడేందుకు చర్యలు చేపట్టింది. రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. మరోవైపు, టీడీపీ కూడా తన ఉనికి కాపాడుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తోంది. పార్టీ కార్యకర్తల శిక్షణా తరగతుల్లో ఇదే విషయాన్ని స్పష్టం చేసింది.

బీసీలపై కాంగ్రెస్ కపటప్రేమ

- ఎన్నికలప్పుడు ప్రేమ.. ఆ పార్టీకి అలవాటే
- ఆ పార్టీలో ఒక్క బీసీ ఎమ్మెల్యేనైనా ఉన్నారా?
- పీసీసీ రేసులో బీసీల పేరు వినిపిస్తుందా?
- అప్పుడు కల్లుపై హైదరాబాద్‌లో నిషేధం
- జిల్లాల్లోనూ నిషేధానికి ఆ పార్టీ యత్నాలు
- ఇప్పడేమో గీత కార్మికులపై సానుభూతి
- కాంగ్రెస్‌పై ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం

హైదరాబాద్, జనవరి 14 (మనం ప్రతినిధి): ఎన్నికలు దగ్గరకు రాగానే అన్ని వర్గాల మీద ఎనలేని ప్రేమ ఒలకబోయడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని ఎమ్మెల్యే వి.శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రత్యేకించి గౌడ కులస్తులపై మొసలి కన్నీళ్లు కారుస్తోందని ధ్వజమెత్తారు. ఆదివారం టీఆర్ఎస్ఎల్పీలో మీడియాతో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఒక్క బీసీ ఎమ్మెల్యే అయినా ఉన్నాడా? ఇని నీలదీశారు. కనీసం పీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఒక్క బీసీ నేత పేరయినా వినిపిస్తుందా? ప్రశ్నించారు. కుల వృత్తులను నాశనం చేసిందే కాంగ్రెస్సేనని అన్నారు. ఇపుడు గౌడ కులస్తులపై ప్రేమను ఒలకబోసి వారిని అదుకున్నట్లు...తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అందరికి ఎదో నష్టం జరిగినట్లు గొప్పగా నటిస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా హైదరాబాద్ లో కల్లు దుకాణాలపై నిషేధం విధించింది నిజం కాదా? అని ప్రశ్నించారు. మిగతా జిల్లాల్లో కూడా కల్లు దుకాణాలపై నిషేధానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ప్రయత్నించిందన్నారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కు తన ఊరు తాటి పాముల అని ఇపుడు గుర్తొచ్చిందా ? అని నీలదీశారు. ప్రస్తుతం తాటి చెట్ల ఉనికే ప్రశ్నార్థకమైనపుడు ఉత్తమ్ ఎక్కడికి వెళ్లారన్నారు? ఒక కుల వృత్తినే నిషేధించే ప్రయత్నం జరిగినపుడు... ఇపుడు మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు ఎక్కడ ఉన్నారన్నారు. ఈత ,తాటి చెట్లకు సంబంధించి హైబ్రిడ్ విత్తనాలను తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇలాంటి ప్రయత్నం జరిగిందా ? అన్నారు.నీరా పరిశోధనలపై కాంగ్రెస్ నేతలు అధికారంలో ఉండగా ఏనాడయినా ఆలోచించారా? అని అన్నారు. బీసీలకు, ఎంబీసీలకు తమ ప్రభుత్వ హయాంలో జరిగినంత మేలు ఏ ప్రభుత్వంలోనూ జరగలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ లు మొత్తానికి కేటాయించిన బడ్జెట్ కన్నా తెలంగాణ చేనేత వర్గాలకు కేటాయించిన బడ్జెట్ కన్నా తక్కువ అన్నారు. రాబోయే రోజుల్లో బీసీలకు మరిన్ని పథకాలు రానున్నాయని స్పష్టం చేశారు. నీరాపై అధ్యయనానికి త్వరలోనే కేరళ వెళ్తున్నామని ప్రకటించారు.



కేటీఆర్‌వి ప్రగల్భాలు

- చర్చకు రమ్మని తోక ముడిచారు : మల్లు రవి

హైదరాబాద్, జనవరి 14: విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని అన్ని రకాల ఆధారాలతో రేవంత్ రెడ్డి నిరూపించడంతో మంత్రి కేటీఆర్ కు మతి పోయిందని, దాంతో ఆయన ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి ఎద్దేవా చేశారు. ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేశారు. రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చిప్ప కూడు తిన్నాడని కేటీఆర్ అనడం ఆయన అవివేకానికి నిదర్శనమని అన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై నేరుగా సమాధానం ఇవ్వకుండా విషయాన్ని పక్కదారి పట్టించే యత్నం చేశారని అన్నారు. విద్యుత్ కొనుగోళ్లు అక్రమాలపై బహిరంగ చర్చకు ఎంపీ బాల్క సుమన్ సవాలు విసిరారని, అందుకు రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నామని చెప్పడంతో తేలు కుట్టిన దొంగలా టీఆర్ఎస్ నేతలు ఈ అంశం నుంచి తప్పించుకునేందుకు అనవసర అంశాలను ముందుకు పెడుతున్నారని పేర్కొన్నారు.

ట్యాంకర్ పేలుడు ఘటనలో ఇద్దరు అరెస్టు

- రూ.7.49 లక్షల నగదు స్వాధీనం
- పరారీలో మరో ముగ్గురు అక్రమార్కులు
- అక్రమదందాపై అధికారుల ఆగ్రహం
- కఠినంగా వ్యహరిస్తున్న పోలీసులు

మేడిపల్లి, జనవరి 14(మనం ప్రతినిధి): మేడిపల్లి-చెంగిచెర్ల రహదారి వద్ద ఈ నెల 12న జరిగిన భారీ అగ్నిప్రమాదం ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆయిల్ ట్యాంకర్లలోని డీజిల్‌ను తస్కరించే క్రమంలో నిప్పంటుకుని ట్యాంకర్ పేలిపోయిన విషయం తెలిసిందే! ఈ క్రమంలో అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. కొంతకాలంగా నిరాటంకంగా కొనసాగిస్తున్న దందా నిర్వాహకులు ఎవరనే కోణంలో విచారణ చేస్తున్నారు. ఇందులో భాగంగా స్థానికంగా కార్ఖానా నడుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.7.49 లక్షల నగదుతోపాటు రెండు బైకులు సీజ్ చేశారు. అక్రమ దందాతో భాగస్వామ్యం ఉన్న 12 ఆయిల్ ట్యాంకర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

పేలుడుకు దారితీసిన చోరీ..

చర్లపల్లిలో ఉన్న చమురు సంస్థల గోడౌన్ల నుంచి ఆయిల్ నింపుకుని ట్యాంకర్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు బయలుదేరుతాయి. ఈ క్రమంలో కొంతమంది డ్రైవర్లు అక్రమార్కులకు సహకరించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్యాంకర్‌లోని డీజిల్, పెట్రోల్‌లో కొంత తీసి అమ్ముకుంటారు. ఇలాంటి ఘటనలు చెంగిచెర్ల రహదారి పక్కన సర్వసాధారణమే! ఈ అక్రమాలకు సంబంధించి ఇక్కడ పెద్ద నెట్‌వర్కే ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్యాంకర్ల నుంచి పెట్రోల్, డీజిల్ చోరీచేసి అక్రమ దందాలకు పాల్పడుతున్న ముఠాలు పదేళ్లుగా తిష్టవేశాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 12న కూడా ఇలా డీజిల్ చోరీ చేసే ప్రయత్నంలోనే ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. ట్యాంకర్ల నుంచి డ్రమ్ముల్లోకి ఆయిల్ దంపు చేస్తుండగా, ఆ పక్కనే వెల్డింగ్ చేస్తుండటంతో నిప్పురవ్వలు పడి ఒక్కసారిగా ట్యాంకర్‌కు మంటలంటుకున్నాయి. దీంతో ఆయిల్ ట్యాంకర్ ఒక్కసారిగా మంటల ధాటికి పేలిపోయిందన్నారు. ఈ పేలుడు ధాటికి మరో ఆయిల్ ట్యాంకర్ 50 అడుగుల దూరంలో పడి దగ్ధమైందని స్థానికులు చెప్పారు. అక్రమార్కుల చోరీ దందాపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో.. అధికారుల నిర్లక్ష్యానికి తాము భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొన్నారు. అయితే, తాజా ప్రమాదం నేపథ్యంలో ఆయిల్ అక్రమదందాను రూపుమాపేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మన సాహితి



బౌద్ధసాహిత్యంలో జాతక కథలకు ఎనలేని ప్రాముఖ్యత ఉంది. ప్రపంచ కథా సాహిత్యంపై ఈ జాతక కథల ప్రభావం చాలా బలంగా ఉంది. దేశీయంగా రామాయణ, భారతాలు, నీతికథలైన పంచతంత్రం, బీర్బల్ కథలకు జాతక కథలు ప్రేరణగా నిలిచాయి. ఈ కథలు చాలా ప్రాచీనమైనవి. ఒక మాటలో చెప్పాలంటే విశ్వవ్యాప్తంగా పలుభాషల్లోని కథా ప్రక్రియలకు ఇవి మార్గదాతలుగా నిలిచాయి. బౌద్ధ మూల గ్రంథాలను తెలుగులోకి తేవాలనే సత్సంకల్పంతో తెలుగు త్రిపీటక గ్రంథమాల ఏర్పడింది. ఇది ఒక బృహత్తర కార్యక్రమం. ఇప్పటికే కొన్ని గ్రంథాలు వచ్చాయి. బౌద్ధ పాళీ గ్రంథమైన ఖుద్ధకనికాయంలో 547 జాతక కథలు ఉన్నాయి. పెద్దలు చెన్నూరు ఆంజనేయరెడ్డి సహకారం, సూచనలతో వీటిని తెలుగులోకి అనువదించే పనికి బొర్రా గోవర్ధన్ పూనుకున్నారు.


జాతక కథల పరమార్థం–భిక్షువులను సరైన మార్గంలో

వెన్నముద్దలు జున్ను ముక్కలు

నడిపించటానికి బుద్ధుడు చెప్పిన కథలు ఇవి. సమాజంలోని మానవ విరుద్ధ పోకడలను నివారించి భిక్షువులే కాక, అన్ని వర్గాల ప్రజల్ని సవ్యమైన మార్గంలో నడిపించే సందేశాత్మకమైన ధమ్మకథలు ఇవి. ఈ కథల్లో – వర్తమాన కథ, అతీత(పూర్వ) కథ రెండూ ఉంటాయి. ఈ రెండింటిలో సారూప్యతలు ఉంటాయి. వాటి మంచిచెడులను విశ్లేషించి, ఎవరు ఎలా నడుచుకోవాలో వివరిస్తూ–బుద్ధుని ధమ్మోపదేశం ముగింపుగా ఉంటుంది. పాళీ భాషలో ఉన్న జాతక కథలను అనువదించి తెలుగమ్మ ఒడిలోకి చేర్చటం ఒక విశిష్టమైన గొప్ప కార్యం. ఈ క్రమంలో రచయిత గోవర్ధన్, నానమ్మ చెప్పిన జాతక కథలు తెలుగువారి సొంతం చేయటం మరింత విశేషం.

ఈ నానమ్మ చెప్పిన జాతక కథలలోనూ రెండు భాగాలు ఉంటాయి. సమకాలీన సమాజంలో మన కళ్ల ఎదుట జరిగే అంశాలతో–నానమ్మ, మనవడు తేజ, మనమరాలు అమ్ములు పాత్రతో వర్తమాన కథ ఉంటుంది. వర్తమానంలోని సమస్యలను ఒక సన్నివేశంగా మలిచి, అలాంటి సారూప్యత కల్గిన జాతక కథను తీసుకుని పిల్లలకు వినసొంపుగా లాలనగా నానమ్మ పాత్ర చెబుతుంది. ఇది ఒక వినూత్న ప్రయోగం. ఈ పుస్తకంలో 20 జాతక కథలు ఉన్నాయి. ఈ జాతక కథలు ముందుగా వర్తమాన కథతో ప్రారంభమవుతాయి. జాతక కథలోని హితబోధకు తగినటువంటి సామాజిక సమస్యను ఎన్నుకొని వర్తమాన కథ చెప్పటం ఈ రచనలోని అసలైన నేర్పు. గంభీరమైన బౌద్ధధర్మ సారాన్ని నీతికథలుగా చేసి– పిల్లలకు తేనెధారలుగా, జున్ను ముక్కలుగా, వెన్నముద్దలుగా, వెన్నెల సుద్దులుగా చెప్పడం ఈ ''నానమ్మ చెప్పిన జాతక కథలు'' లోని విశేషం.

తెలుగు కుటుంబాల్లో నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలే పెద్ద దిక్కు. వారంటే పిల్లలకు ఎంతో గౌరవం ఉంటుంది. వీళ్లకు బోలెడు జీవితానుభవాలు ఉంటాయి. సహజంగా మనవళ్లు, మనవరాళ్లకు తెలియని విషయాలు ఎన్నో వీరు చెబుతుంటారు. పురాణ ఇతివృత్తాలతో ''తాతయ్య చెప్పిన కథలు''గా గతంలో కొన్ని పుస్తకాలు వచ్చాయి. కానీ దీనికి భిన్నంగా గోవర్ధన్ ... నానమ్మ పాత్ర ద్వారా జాతక కథలు చెప్పించటంలో వస్తువులో వైవిధ్యం, భావజాలంలో సామాజిక చైతన్యం ఉన్నాయి. గతంలో గోవర్ధన్ ''బుద్ధభూమి'' మాస పత్రికలో సంఘమిత్ర కథలు రాశారు. ఈ సంఘమిత్ర ఆధునిక భావాలు గల యువతి. పలు



సామాజిక సమస్యల మూలాల్లోని వైదిక సంప్రదాయ ఛాందస వాదాలను, మూఢ విశ్వాసాలను నిరసిస్తూ– బౌద్ధ దృక్పథంతో సరిపోల్చిశాస్త్ర సమ్మతంగా సంఘమిత్ర ద్వారా చెప్పి మెప్పించారు.

అలాగే ఈ కథల్లోనూ సమన్వయకర్త నానమ్మ. నానమ్మ పాత్ర ఈ జాతక కథలకు బాగా సరిపోయింది. వాస్తవానికి తాతయ్య దగ్గర కంటే నానమ్మ దగ్గరే పిల్లలు సన్నిహితంగా ఉంటారు. ఈ సూక్ష్మాన్ని పసిగట్టి ఈ కథల్లో ఆసక్తికరమైన సన్నివేశాలు, సంభాషణలతో చిన్నారులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు గోవర్ధన్. ఈ కథలు పిల్లలు, పెద్దలు అందరినీ అలరిస్తాయి. బాలలను ఆనంద పరవశులను చేస్తాయి. ఎందుకంటే – ఈ కథలను చదివే పిల్లలు తేజ, అమ్ములు పాత్రల్లో తమను తాము అద్దంలో చూసుకుంటున్నట్లుగా సంబరపడిపోతారు. అంతటి ఆహ్లాదం, ఆనందం కలిగించే వాతావరణం ఈ కథల నిండా ఉంది.

పిల్లల మనసు గ్రహించటం చాలా కష్టం. ఆ పసిమనసుల్లోని ఆలోచనలను పట్టుకుని, వారి మాటలు సహజత్వం ఉట్టిపడేలా రాయటం చిన్న విషయం కాదు. ఈ సంక్లిష్టమైన రచనను గోవర్ధన్ తేలికగానే రాయగలిగారు. కారణం ఆయన హేతువాద భావాలు కలిగిన మంచి పిల్లల టీచర్ కావడమే.

ఈ కథలకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తించి, గోవర్ధన్ రచనల పట్ల పాఠకుల ఆదరణను గమనించి ధర్మదీపం ఫౌండేషన్ వారు ఈ ''నానమ్మ చెప్పిన జాతక కథలు'' పుస్తకాన్ని మల్టీకలర్‌లో ముద్రించటం ఎంతో ముదావహం.

ఇక్కడొక విషయం చెప్పాలి.

సమాజాన్ని ప్రగతిపథాన నడిపించటంలో యువకులదే ప్రధాన పాత్ర. వీరిలో సమాజ పురోగతిని కాంక్షించే వారు, సమాజాన్ని యథాతథంగా ఉంచాలనుకునే వారు ఇద్దరూ ఉంటారు. వీరిని ఉద్దేశించి మహాకవి శ్రీశ్రీ రాసిన ఒక గీతంలో–

''కొంతమంది యువకులు–పుట్టుకతో వృద్ధులు
పేర్లకీ, ఫకీర్లకీ, పుకార్లకు నిబద్ధులు
తాతగారి బామ్మగారి భావాలకు దాసులు
నేటినిజం చూడలేని కీటక సన్యాసులు'' అన్నాడు.


శ్రీశ్రీ ఎద్దేవా చేసిన బామ్మ కాదు ఈ జాతక కథల్లో నానమ్మ. పాత చింతకాయ పచ్చడి భావాలతో నిండిన నానమ్మ కాదు ఈ నానమ్మ. కాలం పరిణామాన్ని, స్వభావాన్ని ఆకళింపు చేసుకున్న బౌద్ధాభిమాని ఈ నానమ్మ. మాక్సిమ్ గోర్కీ ''అమ్మ''ను పోలిన అమ్మ ఈ తెలుగు నానమ్మ. లోకరీతి తెలిసిన వ్యవహర్తగానే కాక సార్వజనీనమైన బౌద్ధ ధర్మ సారం తెలిసిన వివేకవతి ఈ నానమ్మ.

ప్రచురణ: ధర్మదీపం ఫౌండేషన్
ప్రతులకు : ఆర్ట్స్ అండ్ లెటర్స్
హైద్రాబాద్ స్టడీ సర్కిల్
1-2-365/25/ ఇందిరా పార్క్ క్రాస్ రోడ్స్
దోమల్‌గూడ. హైదరాబాద్ - 500029
ఫోన్: 04027635654, సెల్ : 9704640273

రచయిత గోవర్ధన్ కూడా ఊహ తెలిసిన నాటి నుంచి కమ్యూనిస్టు భావాలతో ఎదిగారు. వాళ్ల నాన్న సత్యంలో ఒక కమ్యూనిస్టు సత్యవ్రతుడ్ని చూశారు. ప్రజా చైతన్యం కోసం పాటలు రాశారు, పాడారు, ఆడారు. ఈయన శ్రీశ్రీ వీరాభిమాని. జనసాహితీ సాంస్కృతిక సంస్థ కార్యకర్త. కాలంలో వచ్చిన మార్పుల్ని గుర్తించి డా॥అంబేడ్కర్ భావజాలంతో మమేకమయ్యాడు. ఆయన చూపిన బౌద్ధధమ్మ మార్గంలో నడుస్తున్నాడు. ఆయన ఇప్పటికే పలు మైలురాళ్లను నాటారు. ఈయన అనువాదం చేసిన ''భగవాన్ బుద్ధ'' గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ అనువాద గ్రంథంగా పురస్కారం లభించింది.గోవర్ధన్ విస్తృత బౌద్ధసాహిత్య కృషికి గుర్తింపుగా ఐరాస అనుబంధ సంస్థ గ్లోబల్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది.

కుటుంబసంబంధాలకు నైతికపునాదిగా నిలచి, ఇంట్లో పిల్లల పెంపకానికి శాస్త్రీయ ధార్మిక మార్గాన్ని చూపించే ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలి. చదివించాలి.

◆ **బొర్రా గోవర్ధన్**
9390600157



రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం

రంగినేని సుజాత మోహన్ రావు ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు రంగినేని మోహన్‌రావు తన తల్లి కీ॥శే॥ రంగినేని ఎల్లమ్మ పేర జాతీయ స్థాయిలో ప్రతి సంవత్సరం సాహిత్య పురస్కారం ప్రదానం చేస్తున్న విషయం సాహితీ లోకానికి తెలిసిందే. 2017 సంవత్సరానికి గాను కవితా పురస్కారం కోసం వచ్చిన కవితా సంపుటాలను పరిశీలించిన న్యాయ నిర్ణేతల తీర్పు మేరకు సుంకిరెడ్డి నారాయణ రెడ్డి కవితా సంపుటి 'తావు' 'రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం – 2017' కోసం ఎంపిక చేయడమైనది. వచ్చే ఫిబ్రవరి మాసంలో సిరిసిల్లలోని రంగినేని చారిటబుల్ ట్రస్టులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేయడం జరుగుతుంది.

- మద్దికుంట లక్ష్మణ్
కన్వీనర్, రంగినేని ఎల్లమ్మ పురస్కార కమిటి
9441677373

డాక్టర్ పత్తిపాక మోహన్‌కు 'జానుడి సాహిత్య పురస్కారం'

సిరిసిల్లకు చెందిన కవి, రచయిత, సభా వ్యాఖ్యాత, బాల సాహితీవేత్త డా.పత్తిపాక మోహన్‌కు సుప్రసిద్ధ పద్యకవి, సాహితీవేత్త డా.పత్తిపాక మోహన్‌కు సుప్రసిద్ధ పద్యకవి, సాహితీవేత్త కీర్తిశేషులు మల్లవరపు జానుకవి జయంతి పురస్కారం 'జానుడి సాహిత్య పురస్కారం'ను ప్రకటించారు. జానుడి సాహిత్య సంస్థ స్ఫూర్తి ప్రదాత మల్లవరపు జానుకవి జన్మదినోత్సవం జనవరి 22వ తేదీన ప్రతియేడు ప్రదానం చేసి ఈ పురస్కారానికి ఈ 2017 సంవత్సరానికిగాను డా.పత్తిపాక మోహన్‌ను ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. జనవరి 22, 2018న ఒంగోలులో జరిగే జానుకవి జయంతి సభలో ఈ పురస్కారాన్ని అందచేస్తారు.


- ఎలగొండ రవి, జిందం అశోక్
నిర్వాహక కార్యదర్శులు, మారసం

సంక్రాంతి కవితలు

నేటి సంక్రాంతి

జంగమయ్యల పలుకులు
మన ఆచారాలకు మేలుకొలుపులు
హరిదాసుల కీర్తనలు మన ధర్మ సంకీర్తనలు
స్వచ్ఛతకు మనమిచ్చే గౌరవానికి
అగ్నిసాక్షి భోగిమంటలు / గంగిరెద్దుల గడుసు ఆటలు
మన సంప్రదాయానికి మకుటాయమానాలు
ముంగిట పూసిన ముగ్గులు / భోగిపళ్ళ పేరంటాలు
ఆరోగ్యపు విలువలు దాగిన విశ్వాసాలు
లోకానికి మనమందించిన సాంస్కృతిక కానుకలు
వినువీధిన ఎగిరే పంతంగాలు / మన విధానాలకు
పతాకాలు / గొబ్బి కన్నెల గొనబు పాటలు
మన జానపద ప్రాభవానికి జయగీతికలు
బుడబుక్కల ఢమరు ధ్వనులు
పులివేషపు డప్పుల చప్పుళ్ళు
మన గ్రామీణ కళా వైభవానికి ఢంకా ధ్వానాలు
పాలపిట్ట దర్శనం పారువేట వీక్షణం
మన పెద్దలు పరచిన నమ్మకాల బాటలు
అర్థాలు తెలియక అంతా వ్యర్థమని
విలువైన విశ్వాసాలకు తిలోదకాలిచ్చేస్తే
ఆచార వ్యవహారాలను అటకెక్కించేస్తే
పండుగ పరమార్థాలకు పాడికట్టేస్తే
సంస్కృతికి అద్దం పడుతుండగా సంక్రాంతి
పేరు నిలుపుకుంటుందా పెద్ద పండుగ

- చిరమన వెంకట రమణయ్య
9441380336



సంక్రాంతి సందేశం

మునగతీసుకుంటున్న
బద్ధకానికి
చురక పెడుతూ
పాత, రోతలను
తనలో
దగ్ధం చేసుకుంటూ
భగభగమండే
భానువల్లే
కొత్తకాంతిరేఖలను
వెదజల్లమంటుంది
భోగిమంటల జవ్వని

పోటీపడితేనే
ధీటైన భవిత
సొంతమౌతుందంటూ
కోడిపందాలలోని
మర్మంతో
కొత్తపాఠం నేర్పుతూ
రాశులెన్నున్నా మకర
''రాశిలోవాసి''కెక్కమంట
తలరాతను
తిరగరాస్కోమంటుంది
సంక్రాంతి ఇంతి

చేయిచేయి
కలిపితేనే
చేవచిక్కుతుందని
పరుల కష్టసుఖాలను
పంచుకుంటేనే
పండగవుద్దని
నిత్యరణంతోనే
రంగవల్లి జీవితం
సొంతమౌతుందని
శక్తికొద్దీ రుచులను
చవిచూడమంటుంది
కనుమ కన్య

కష్టజీవుల కర్మజలంతో
పులకరించిపోతూ
శ్రమైక జీవన
సౌందర్యానికి
పట్టంకడుతూ
అన్నపూర్ణయై
అన్నార్తుల
ఆశలను
నెరవేర్చేందుకు
సంక్రాంతి సందేశంతో
తరలివస్తున్న
ప్రకృతిమాతకు
స్వాగతం సుస్వాగతం

- డాక్టర్ పెంకి విజయ కుమార్
9553392949

మకర సంక్రమణం

చల్లని మంచు పొత్తిళ్ళలో
ఎర్రని భోగిమంటలు పెట్టి
ఆకురాలు కాలానికి
ఆరంభగీతాల్ని విరచిస్తూ..

లిప్తపాటు కాలంలో
ఆయనాల్ని దాటేస్తూ
ఆనందాలు వెంట తెచ్చే
రంగురంగుల హరివిల్లు
మకర రవి సంక్రమణం.

గొబ్బెమ్మలు, గరికపోసలు
పిండికూర, నవధాన్యాలు
పతంగులు, గంగిరెద్దుల
సందోహాల సంబరాలే
ఈ సమ్మోహన సంక్రమణం.

ప్రతి ఇంటా, ప్రతి కంటా
భోగభాగ్యాల్ని మోసుకొస్తూ
ఆశల్ని విహంగమై ఎగరేస్తూ
కలల సస్యాన్ని పండిస్తూ
మధుకరమై,మాధుర్యమై
ఏతెంచె ఏతెంచె ఓ కాంతి
మనోహర క్రాంతి సంక్రాంతి.


- అశోక్ అవారి
9000576581.

సంక్రాంతి లక్ష్మి

హరిలో రంగ హరీ!
అది ఒక శ్రావ్య రాగాల ఝరి
హృదయ తంత్రుల్ని మీటే చిడుతల సవ్వడి
'వేకువ' ఉలిక్కిపడి ఒళ్ళు విరుచుకుంది
వెలుగుపూలు చిమ్ముకుంటూ భళ్ళున తెల్లారింది
'ఇంద్రధనస్సు' ఇంటి ముంగిట రంగవల్లికై కులికింది
గొబ్బిళ్ళ సిగలో గుమ్మడిపూలు సిగ్గుసిగ్గుగా గునుస్తున్నాయి
పక్షులు కిలకిలా రావాలతో నవధాన్యాలను
ముక్కున కరచుకుని పండుగ చేసుకుంటున్నాయి
కొత్త అల్లుడి కొంటె చూపులు అల్లరి తుమ్మెదలై
అందాల భరిణె అధరాలపై చుంబనాల సంతకాలు చేస్తున్నాయ్
పులకించిన ప్రకృతి ప్రణయ రాగం ఆలపిస్తున్నది
ముసలి అవ్వ మురిపెంగా నవ్వుకున్నది
మురిపాలు మూట గట్టుకుని
సరదాలు చంకన పెట్టుకుని
సంబరాల దుప్పటి కప్పుకుని
ఆనందభైరవి రాగంతో అరుదెంచే
సంక్రాంతి లక్ష్మీ! స్వాగతం ! సుస్వాగతం!

- కాసర లక్ష్మీ సరోజారెడ్డి

దాహార్తులకు కవిత్వం ఒక చెలిమె


వారాల ఆనంద్ 'అక్షరాల చెలిమె' ఆవిష్కరణలో వరవరరావు


'తాత్వికత' కవిత్వంలో ఇమిడిపోయినప్పుడు అది ఉత్తమ కవిత్వమవుతుందని, అదే కలకాలం గుర్తుండిపోతుందని ప్రసిద్ధ కవి వరవరరావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని జవహర్ నగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రముఖ, కవి సినీ విమర్శకుడు వారాల ఆనంద్ రచించిన 'అక్షరాల చెలిమె' కవితా సంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్తమాన కవులనేకమంది ఆర్థికం, అధికారం, వ్యాపార కార్పొరేట్ రంగాల్లో తమ తమ దాహాల్ని తీర్చుకుంటూ వుంటే వారాల ఆనంద్ అక్షరాల చెలిమెలో తన దాహాన్ని తీర్చుకుంటున్నాడని అన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో అన్ని విలువలూ విచ్ఛిన్నమయి పోయిన కాలంలో ఉత్తమ కవిత్వం గొప్ప చెలిమే అని ఆయన అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జె. మనోహర రావు మాట్లాడుతూ సాహిత్యమూ, ఫిల్మ్ సొసైటి ఉద్యమమూ తదితర విషయాల్లో తమ అనుభవాల్ని, అనుబంధాలనీ వివరించారు. కవి వారాల ఆనంద్ మాట్లాడుతూ, వ్యక్తిగతంగానూ, సామాజికంగానూ తాను అనుభవించిన భావనల్నీ, ఎదుర్కొన్న సందర్భాల్నీ అక్షరీకరించానని, తాన 'అక్షరాల చెలిమె' తానెంతో అభిమానించే వరవరరావు చేతులమీదుగా ఆవిష్కరించబడడం గౌరవాన్ని ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి దర్భశయనం శ్రీనివాసాచార్య, కోడూరి విజయ కుమార్, తెలుగు యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ ఉషాదేవి, డాక్టర్ దివాకరాచారి, అనుబొడ్ల, అన్వేష్ వారాల, బాల రాజు తదితరులు పాల్గొన్నారు.

- వారాల ఆనంద్
9440501281

సరళి

లాటిన్ అమెరికన్ సాహిత్యానికి పెన్నిధి

మేరియో బెనెడేట్టి



మేరియో బెనెడేట్టి ఉరుగ్వే దేశపు ప్రముఖ రచయిత, కవి, కథకుడు, నాటక రచయిత, విశ్లేషకుడు, జర్నలిస్ట్. పైగా జనరేసియన్ డెల్ 45 అనే ఉరుగ్వే దేశపు మేధావుల, రచయితల ప్రక్రియలలో గ్రంథాలు ప్రకటించిన తిరుగులేని రచయిత. 20కి దాటిన పలు భాషలలో ఆయన రచనలు అనువాదానికి నోచుకొని పేరు తెచ్చుకున్నాయి. లాటిన్ అమెరికన్ దేశాలలో గొప్ప స్పానిష్ రచయితగా కీర్తి గడించాడు. కానీ ఆంగ్ల భాషాప్రియులకు అంతగా దగ్గర కాలేకపోయాడు. 20వ శతాబ్దపు లాటిన్ అమెరికన్ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన రచయితగా బెనెడేట్టి తనకంటూ ఓ గొప్ప స్థానాన్ని నిలుపుకున్నాడని విమర్శకులు అంగీకరించారు.

బెనెడేట్టి తండ్రి బ్రెన్నో బెనెడేట్టి రసాయనిక వైన్ తయారీదారుడు. తల్లి మాటిల్డ్ ఫారూజియా ఇటాలియన్ సంతతికి చెందింది. 14 సెప్టెంబర్ 1920లో పాసోడి లాస్ టొరోస్‌లో మేరియో బెనెడేట్టి జన్మించాడు. చిన్నప్పుడు ఆరేళ్ళపాటు ప్రాథమిక విద్యతో పాటు జర్మనీ భాషనూ చక్కగా నేర్చుకున్నాడు. ఆ పరిజ్ఞానంతోనే ఫ్రాంజ్ కాఫ్కా నవలలను ఉరుగ్వే భాషలోకి తర్జుమా చేశాడు. ఉన్నత పాఠశాలల్లో నాజీయిజం బోధన చేయటంతో బ్రెన్నో తన కుమారుడిని హైస్కూలు చదువు మాన్పించాడు. విధిలేక షార్టుహాండ్ నేర్చుకున్నాడు. అదే ఆయనకి చాలాకాలం పాటు జీవనోపాధికి సహకరించింది. 14వ యేటనించే స్టెనోగా, పబ్లిక్ ఆఫీసర్‌గా, అకౌంటెంట్‌గా, జర్నలిస్టుగా, అనువాదకుడిగా పలు ప్రసార మాధ్యమాల్లోనూ పనిచేశాడు. 1946లో లజ్ లోపెజ్‌ని వివాహమాడి, 2006లో ఆమె చనిపోయేదాకా వైవాహిక బంధాన్ని కొనసాగించాడు.



ఉరుగ్వే దేశపు ప్రముఖ మార్చా దినపత్రికలో 1945 నుంచి రచనలు చేస్తూ, మిలటరీ నియంతృత్వ ప్రభుత్వం 1973లో ఆ పత్రికను బలవంతంగా మూసివేయించేంత వరకూ అందులో ఆయన రచనలు చేశాడు. ముఖ్యంగా 1954 నుంచి ఆ పత్రికలో సాహిత్య పేజీకి డైరెక్టర్‌గా పనిచేశాడు. 1973 నుంచి 1985 దాకా ఉరుగ్వేలో మిలటరీ నియంతృత్వ పాలనాకాలంలో ఆయన రహస్య జీవితం గడిపి బ్యూనాస్ ఎయిర్స్‌కి ప్రవాసం వెళ్ళాడు. ఆ తర్వాత పెరూ దేశంలోని లిమా నగరంలోకి అడుగు పెట్టటం తడవు ఆయన్ని అరెస్ట్‌చేసి దేశ బహిష్కారం విధించారు. ఆ తర్వాత క్షమాభిక్ష ప్రసాదిస్తే 1976లో క్యూబాకు ఆ మరుసటి యేడాది స్పెయిన్ దేశం మాడ్రిడ్ నగరంలో కాలం గడిపాడు. ఆయన ప్రవాస కాలంలో ఆయన భార్య ఉరుగ్వేలోనే వుండి తన తల్లి, అత్తగార్ల సేవలో వుండిపోయింది. బెనెడేట్టీ 1983 మార్చి నెలలో ఉరుగ్వే దేశంలో ప్రజాస్వామ్యం పాదుకున్నాక స్వదేశానికి వచ్చి తన సమయాన్ని మోన్‌టేవిడియోలోనూ, కొన్నాళ్లు మాడ్రిడ్‌లోను గడిపాడు.

ఇంక ఆయనకు అవార్డులు యివ్వటానికి లాటిన్ అమెరికన్ దేశాలు వరుసకట్టాయి. ఉరుగ్వే, స్పెయిన్ దేశాలు ఆయనను సన్మానించి తమ దేశ రుణం తీర్చుకున్నాయి. ఇంక ఆయన కవిత్వానికి, నవలలకు ఎన్ని అంతర్జాతీయ అవార్డులు వచ్చాయో లెక్కలేదు. లాట్రెగువా నవల 1960లో మొదటగా ప్రచురణ జరిగాక 20 భాషలలోకి, ఆంగ్లంతో సహా అనువాదానికి నోచుకొని ఆయనకి గొప్ప కీర్తిని తెచ్చిపెట్టింది. 1974లో ఆ నవల ఆధారంగానే ద్రిటూస్ అనే సినిమా తీశారు. కవిత్వపరంగా ఇన్ డెలిబుల్ ఈవ్ (1945) మొదటి పుస్తకంగా చెప్పచ్చు. ఆఫీస్ పొయమ్స్ (1956) ఇన్‌వెంటరీ పొయమ్స్, పొయమ్స్ ఆఫ్ టుడే (1963), ది హౌస్ అండ్ ది బ్రిక్ (1977), ఎయిర్ ఫ్రమ్ ఎక్సైల్ (1981) చెప్పుకోదగ్గవి. మూడుకు పైగా కథా సంపుటాలు వచ్చాయి. ఎనిమిదికిపైగా నవలలు రాశాడు. గ్రేసియస్ ఫర్ యల్ పూగో నవల ఆధారంగా 1984లో అదే పేరుతో అర్జెంటినాలో సినిమా తీశారు. 1996లో ఆయన రచనలన్నీ కలిపి 28 సంపుటాలుగా అర్జెంటినాలో ప్రచురించారు.

ఆయన చివరి రోజులలో అస్తమా వ్యాధితో బాధపడ్డాడు. శీతాకాలంలో వెచ్చగా వుండే మాడ్రిడ్‌లోనూ, మిగతా నెలలు మానటోవిడియోలోనూ గడిపి 2006లో భార్య మరణంతో కుంగిపోయాడు. అక్కడే 17 మే నెల 2009 సాయంకాల సమయంలో శ్వాసకోశ వ్యాధితోనూ, ఉదరకోశ యిబ్బందులతోనూ మరణించాడు. ఆయన అస్తికలు మోనటోవిడియోలోని జాతీయ స్మారక ప్రదేశంలో దాచిపెట్టారు. ఆయన చివరి కవితా చరణాలు కొన్ని...

నా జీవితం ఓ వింత నాటకం లాంటిది / కాని నా రచనలు అశాశ్వతాలు కావు / ఇది ఎవరూ బహుశ గమనించక పోయి వుండొచ్చు / ఈ ముసలి వయస్సులో నేనో సమవర్తిని / ఆ బూడిద మెరుపుల సమాధి ఫలకాలు / నా చర్మం ఒలిచి పరిచినవి మాత్రం కావు...

◆ **సాగర్ శ్రీరామకవచం**
9885473934



వన్యసంరక్షణ
ఆవరణం

పమేలా, అనిల్‌ది ప్రేమ వివాహం. పమేలా న్యూజెర్సీలో ఒక ఫార్మస్యూటికల్ కంపెనీలో సేల్స్ ఉమన్‌గా పనిచేస్తుండగా, అనిల్ ఇండియన్ హోటల్‌ను నిర్వహిస్తున్నాడు. అనంతరం ఒకసారి ఆ జంట కొలొరాడకు విహారానికి వెళ్లినపుడు అక్కడ చెట్లను నరికివేయడం చూశారు. యురేనియం కోసం అక్కడి అటవీప్రాంతాన్ని కాంట్రాక్టర్ నరికివేయడంతో చుట్టుపక్కల ఉన్న నీటి మడుగులన్నీ సీసం, ఆర్సెనిక్‌లు కలిసి జలమంతా కలుషితమవడం గమనించారు. పరిసరాల వాతావరణం కలుషితం కావడంతో అక్కడి ప్రజలు తరచూ ఏదో ఒక జబ్బుతో సతమతమయ్యేవారు. ఆ ప్రభావం జంతుజాలాలపై కూడా పడడంతో జీవవైవిధ్యం దెబ్బతినడం మొదలైంది. మైనింగ్ పేరులో అడ్డదిడ్డంగా అడవులను నరికివేయడం వల్ల జీవాలతో పాటు జంతుజాలాల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని వారు ఆవేదన చెందారు. మానవులతో పాటు సకల జీవజాం మనుగడ ప్రశ్నార్థకంగా మారడాన్ని నివారించేందుకు 'బ్యాక్ టు నేచర్' ఉద్యమాన్ని చేపట్టారు. సేవ్ యానిమల్స్ ఇనీషియేటివ్ పేరుతో సొంతంగా అడవిని ఏర్పర చేందుకు సంకల్పించారు.

పర్యావరణ పరిరక్షణ అనేది ఏ ఒక్కరికో సంబంధించినది కాదు; నేడు అది ప్రపంచ ప్రజలు, పర్యావరణవేత్తల ఆకాంక్ష. పర్యావరణ విధ్వంసం ప్రభావం వ్యవసాయోత్పత్తి, ప్రజల ఆరోగ్య పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో ఇదొక సమకాలీన సమస్యగా పరిణమించింది. ప్రపంచ వారసత్వ సంపదగా, మహాజీవ వైవిధ్య ప్రాంతంగా ఐక్యరాజ్యసమతి (యునెస్కో) గుర్తిం చిన పశ్చి మ కనుమల (సహ్యాద్రి పర్వత శ్రేణులు) పరిరక్షణ ఇప్పుడు సవాలుగా నిలిచింది. ఇందుకోసం ప్రభుత్వం రెండు



కమిటీలను (గాడ్గిల్, కస్తూరిరంగన్) నియమించింది. ఈ రెండు కమిటీలు పరస్పర విరుద్ధమైన నివేదికలు సమర్పించాయి. లక్షా అరవైవేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని 1600 కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించిన పశ్చిమ కనుమల్లో 39 సంరక్షణ కేంద్రాలను ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో క్వారీలు ఎక్కువగా ఉన్నాయి. ఇలా క్వారీల్లో తవ్వకాలు జరపడానికి రెండున్నర ఎకరాలకు ప్రభుత్వ అనుమతి అవసరం లేదు. దీన్ని అవకాశంగా మలుచుకుని ప్రైవేట్ కాంట్రాక్టర్లు విచ్చలవిడిగా గనుల తవ్వకాలకు పాల్పడుతూ పర్యావరణ విధ్వంసానికి కారకులవుతున్నారు. పంటలపై, మనుషుల ప్రాణాలకుముప్పు ఉందని తెలిసినా కేవలం లాభార్జనకోసం ఈ విధ్వంసానికి పాల్పడడంతో అనేక రకాల పక్షులు, జంతువులు కనుమరగయ్యే ప్రమాదం ఏర్పడుతోంది.

పర్యావరణాన్ని పట్టించుకోని ప్రభుత్వాల రాజకీయ విధానాల కారణంగా జీవవైవిధ్యం నాశనం కావడం చూసి అనేక మంది పర్యావరణ వాదులు వ్యక్తిగతంగా స్పందించారు. అలా జీవవైవిధ్యాన్ని కాపడుతున్న సంరక్షణశాలలో ఒకటి సేవ్ యానిమల్స్ ఇనీషియేటివ్! అమెరికాలో మంచి ఆదాయాన్ని వదులుకుని డాక్టర్ ఎ.కె.మల్హోత్రా, పమీలా మల్హోత్రా దంపతుల జంట ఈ ఎస్ఏఐని నిర్వహిస్తున్నారు. ఎవరి ప్రమేయం లేకుండా, ఎవరి సాయాన్ని ఆపేక్షించకుండా వారద్దరికీ గల జంతుప్రేమ వారిని ఎన్నో ప్రయాసలకు గురిచేసినా వెనకడుగు వేయకుం డా తమ లక్ష్యాన్ని కొనసాగిస్తున్నారు.

కర్ణాటకలోని కొడగు జిల్లాలో ఉన్న 'జంతువుల పరిరక్షణ చర్యల' (సేవ్ యానిమల్స్ ఇనీషియేటివ్ - ఎస్ఏఐ) ప్రాంతాన్ని చూస్తే ఈ జంటకున్న దీక్ష విశిష్టత అర్థమవుతుంది. అమెరికా నుంచి భారత్ వచ్చిన తరువాత ఈ జంటకు పర్యావరణంపై మక్కువ కలిగి దేశమంతా విస్తృతంగా పర్యటించారు. మొదట వారిద్దరూ హిమాలయ పర్వత ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే, అక్కడ భూ పరిమితి చట్టం అమలులో ఉండి, ఒక్కొక్క వ్యక్తికి 12 ఎకరాలకు మించి భూమి ఉండకూడదనే పరిమితి ఉండడంతో వారి దృష్టి దక్షిణ భారతదేశంపై పడింది. తమ కలలైన పర్యావరణ పరిరక్షణ, ప్రకృతిని కాపాడడం, వన్యప్రాణులకు పరిరక్షణ కల్పించడం వంటివాటికి పశ్చిమ కనుమల ప్రాంతం అనువుగాఉంటుందని వారికి విశ్వాసం కలిగింది.


అందుకు ఎవరూ కలిసిరాకపోవడంతో తమ కలల ప్రపంచాన్ని నిర్మించుకునేందుకు వారిద్దరూ నడుం బిగించారు. ఎవరు కలిసివచ్చినా రాకపోయినా తమ కలల ప్రపంచాన్ని తామే సృష్టించుకోవాలనే పట్టుదలతో అమెరికాలో ఉన్న తమ యావదాస్తిని విక్రయించి కర్ణాటకలోని కొడగు జిల్లాను కార్యస్థానంగా ఎంపికచేసుకున్నారు. ఆ ప్రాం తంలో అతివృష్టి కారణంగా నిరుపయోగంగా పడివున్న 55 ఎకరాల ప్రైవేట్ భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. జీవవైవిధ్యానికి సూక్ష్మ కేంద్రంగా భావించి ఆ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నామని పమేల చెప్పారు. చుట్టుపక్కల రైతుల నుంచి భూమిని కొనుగోలు చేయడం ప్రారంభిం చారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి, నిరుపయోగంగా ఉన్న భూ మికి అనూహ్య ధరకు కొనుగోలు చేసేందుకు ఆ జంట ముందుకు రావ డం రైతులకు ఉత్సాహాన్నిచ్చింది. 55 ఎకరాలతో మొదలైన వారి ప్రయాణం 300 ఎకరాలకు చేరుకుంది.

అలా 300 ఎకరాల స్థాయికి చేరిన ఆ అడవిలో సంప్రదాయిక చెట్లు అనేకం ఉన్నాయి. ఆ చెట్లను అలాగే ఉంచి మూడు నిర్ణయాలు- ఏ చెట్టునూ నరకరాదు, మానవ జోక్యం ఉండకూడదు, వేటగాళ్లను అనుమతించకూడదు - ఈ మూడు సూత్రాలను తుచ తప్పకుండా గత 26 ఏళ్లుగా పాటిస్తున్నారు. ఈ విధంగా 1991లో వారు వన్యప్రాణుల సంరక్షణాలయాన్ని ప్రారంభించారు. ఆ సంరక్షణాలయంలో ఉన్నజంతువుల అవసరాలను తీర్చడానికి అటవీ మధ్యభాగంలో నది కూడా పారుతూ నీటి గలగలల సంగీతం వినిపిస్తూ ఉంటుంది. అప్పటి నుంచి వారి కృషికి చిహ్నంగా విస్తరించిన ఈ ఎస్ఏఐ దేశంలోనే తొలి ప్రైవేట్ వన్యప్రాణుల సంరక్షణాలయంగా ప్రఖ్యాతి గాంచింది. దట్టంగా చెట్లతో అలముకున్న చిట్టడవి కావడంతో అనేక రకాల పక్షులకు ఆలవాలంగా మా రింది. నిత్యం ఈ అడవిని దాదాపు 305 రకాల పక్షు లు సందర్శిస్తుంటాయి. నదిలో రకరకాల చేపలు, నాగుపాములు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. 'ఈ జం తువుల సంచారానికి మేము ఏవిధంగాను అడ్డంకులు కల్పించం. వివిధ రకాల మొక్కల విత్తనాలను స్వీకరిస్తాయి కాబట్టి అడవుల పునరుత్పత్తికి ఏనుగులు ఎంతో కీలకప్రాత పోషిస్తాయి.





◆ తాడేపల్లి శివరామకృష్ణారావు
7396955147



మథనం

విఫల విప్లవం

దేశ వ్యవసాయ క్షేత్రాలు వేగంగా భూసారాన్ని కోల్పోతుండడం ఆందోళన కలిగిస్తోంది. హరిత విప్లవం విలసిల్లిన ప్రాంతాల్లో అనాలోచిత, విచక్షణారహితమైన ఎరువుల వాడకం వల్ల భూసారం దెబ్బతినడంపై ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ త్రిలోచన్ మహాపాత్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాలలోని భూసారంలో సేంద్రీయ పోషకాలు పునరుద్ధరించలేని విధంగా హరించుకుపోయాయి. 'భూసారం (సాయిల్) సేంద్రీయ కర్బన' పరిమాణం 5 శాతం ఉంటే ఆ ప్రాంత నేలలు సారవంతమైనవి పరిగణిస్తారు. అయితే హరిత విప్లవ సాగు నడిచిన పంజాబ్‌లో భూసార కర్బనం ఒక్క శాతానికి క్షీణించడం ఘోరం. దానికితోడు హెక్టారుకు 16.4 టన్నుల చొప్పున ఏడాదిలో దాదాపు 53 లక్షల టన్నుల భూసారం కోతకు గురయిందనే గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. హరిత విప్లవ సాగు కారణంగా ఎరువుల అతి వినియోగం వల్ల యూరియాతో నైట్రోజన్ (ఎన్), ఫాస్ఫేటిక్ రసాయనాలతో పొటాషియం (పి), పొటాసిక్ ఎరువుతో పొటాషియం (కె) తదితర భూసారంలోని పోషకాల సమతుల్యత దెబ్బతింటోంది. ఎన్-పి-కె ఎరువులను 4:2:1 నిష్పత్తి వాడాల్సి వుండగా పంట దిగుబడి పెరుగుతుందనే ఆత్యాశతో 6.7:4:1 నిష్పత్తిలో రైతాంగం అధికంగా వినియోగిస్తుండడం, తప్పుడు సమ్మేళనాలను వాడుతుండడంతో భూసారం దెబ్బతింటోందని, దానికి తోడు భూసారం పునరుద్ధరణ స్వయం ప్రక్రియ కుంటుపడింది. దాంతో ఉత్పాదకాల వినియోగం పెరడంతో ఖర్చు విపరీతంగా పెరిగిపోయిందని ప్రభుత్వం, వ్యవసాయ నిపుణులు ప్రచారం చేయడం దురదృష్టకరం. దానికితోడు భూసారపు నీటి ధారణ శక్తి క్షీణించడంతో భూగర్భ జలాల వినియోగం గణనీయంగా పెరిగింది.


దేశవ్యాప్తంగా భూసారం క్షీణించిన నేపథ్యంలో భూసార స్వస్థత (సాయిల్ హెల్త్) కార్డులను మోదీ ప్రభుత్వం 2015లో ప్రవేశపెట్టింది. దీని ద్వారా వ్యవసాయ నిపుణులు ఎన్‌పీకే వినియోగ స్థాయిలను అంచనా వేసి తగిన సలహాలు ఇస్తారు. ఈ పథకం కింద ఇప్పటిదాకా 2.5 కోట్ల భూసార పరీక్షలు జరిగాయి. రసాయినిక ఎరువుల వాడకంలో మెలకువలు రైతాంగానికి సూచిస్తారు. అదే సమయంలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను చేపట్టాలని రైతాంగానికి సూచిస్తారు. భారత్ క్రమంగా భూసారం, సాగునీటి సంక్షోభంలోకి జారిపోతోంది. ఎడారీకరణ లేదా భూసార పోషకాలు పూర్తిగా క్షీణించడం వంటి పరిణామాలు దేశంలో అనేక ప్రాంతాల్లో వేగవంతం కావడం ఆందోళన కలిగిస్తోంది. హరిత విప్లవం ద్వారా సంభవిం చిన తాత్కాలిక ఫలసాయానికి, ఫలితాలకు ఆశపడి సాగించిన వ్యవసాయ కార్యకలాపాలు ఆ తర్వాత విధ్వంసకర పరిణామాలకు దారితీశాయి. మొదటి హరిత విప్లవం విధ్వంసకర పరిణామాల నుంచి గుణపాఠం తీసుకొని రెండవ హరిత విప్లవం వైపు ప్రభుత్వాలు ఆచితూచి అడుగువేయవలసి ఉంటుంది. మానవ సమాజం ప్రకృతి వనరులను వినియోగించుకొని తన అవసరాలను తీర్చుకుంటుంది. మానవులు తమ ఆహారం కోసం వ్యవసాయం ద్వారా భూమిలోని పోషకాలను వినియోగించుకొని వ్యవసాయోత్పత్తులు సృష్టిస్తున్నారు. అదే సమయంలో వినియోగవస్తువుల తయారీ కోసం భూగర్భంలోని ఖనిజాలను పారిశ్రామిక ఉత్పత్తులను తయారీ కోసం వినియోగించుకుంటున్నారు. భూసారం రూపంలోని పోషకాలు కానీ, వినిమయ వస్తువుల కోసం భూగర్భ ఖనిజాలను మనిషి వినియోగించుకుంటున్నాడు. వినియోగానంతరం మానవ మల, మూత్రాల ద్వారా ఆ భూసార పోషకాలు ప్రకృతిలోకి చేరితే, వినిమయ వస్తువులు వ్యర్థాల రూపంలో తిరిగి భూమికే చేరుతుంటాయి. ఇలా ఒక ఉత్పత్తి- వినిమయం- పునరుత్పత్తి వలయం సజావుగా సాగుతుంటే సమాజం-ప్రకృతిల మధ్య ఇచ్చిపుచ్చుకునే (ఆదానప్రదానాల) ప్రక్రియ (మెటాబాలిజం బిట్వీన్ సొసైటీ అండ్ నేచర్) నిరంతరాయంగా కొనసాగుతుంటే భూగోళం సమతుల్యంతో మనుగడ సాగిస్తుంది. అలాకాక సమాజపు వ్యవసాయ, వినిమయ వస్తు వినియోగం పెరిగే కొద్దీ మనుషులు ప్రకృతి నుంచి స్వీకరించి వినియోగించే భూసార పోషకాలు, భూగర్భ ఖనిజాలు తిరిగి భూమిని చేరకుండా విషపూరిత వ్యర్థాలుగా మారుతున్నాయి. పారిశ్రామిక విప్లవం తర్వాత పరిశ్రమలకు భారీ లాభాలు కావాలంటే చౌక శ్రమ శక్తి అవసరం. దానికితోడు విడివిడి మడిచెక్కల్లో సేద్యం చిన్న రైతాంగం నుంచి భూమిని బలవంతం/కొనుగోలు పద్ధతుల ద్వారా భూమిని సేకరించి పెద్దపెద్ద కమతాల్లో సాగుచేయడం కొందరు వాణిజ్యవేత్తలు ప్రారంభించడంతో రైతాంగం పనుల కోసం పట్టణాలకు వలస పోయింది. దాంతో పట్టణాలు వేగంగా విస్తరించాయి. పర్యవసానంగా రెండు పరిణామాలు సంభవించాయి. ఒకటి జనాభా పట్టణ ప్రాంతాల్లో కేంద్రీకరణ, రెండు- భారీ కమతాల్లో సేద్యం. పట్టణ జనాభా కోసం తరలివస్తున్న వ్యవసాయోత్పత్తుల వినియోగం తర్వాత మల, మూత్ర విసర్జన ద్వారా తిరిగి భూమిని చేరాల్సిన పోషకాలు.. పట్టణాల డ్రైనేజీలలో దుర్భరమైన కాలుష్యకారక వ్యర్థాలుగా మారుతున్నాయి. అదే సమయంలో భూగర్భ ఖనిజాలు పట్టణ ప్రాంతాల్లో భారీ వినియోగం తర్వాత చెత్త రూపంలోని వ్యర్థాలుగా మారుతున్నాయి. ఈ రెండు రకాల వ్యర్థాలు సమాజ వినియోగం తర్వాత ప్రకృతిలోకి తిరిగి చేరవలసిన పదార్థాలు. అయితే అలా చేరకపోవడంతో ఒకటి అవి విషపూరిత వ్యర్థాలుగా మారి పర్యావరణ విధ్వంసానికి కారకమవుతున్నాయి. వ్యవసాయ పోషకాలు తిరిగి భూమి చేరకపోవడం, పెద్దపెద్ద కమతాల్లో భారీసాగు పద్ధతుల వలన భూమి సహజ భూసారం పూర్తిగా కొల్లగొట్టబడుతోంది. ఇలా భూసారం క్షీణింపును భర్తీ చేసుకునేందుకు రసాయనిక ఎరువులను మనిషి కనుగొన్నాడు. భూసారంలోని ఏవో కొన్ని పోషకాలను రసాయనిక ఎరువుల ద్వారా పూరించగలమే గానీ, దానికి సహజత్వాన్ని తీసుకురాలేము. సుదీర్ఘకాలంగా ఈ రసాయనిక ఎరువుల వినియోగం భూసార క్షీణతకు దారితీస్తుంది. ఈ నేపథ్యంలో శతాబ్దాలుగా తాను కోల్పోతున్న సహజ పోషకాలు, ఖనిజాలు తిరిగి ప్రకృతికే చేరే విధంగా సమాజం-ప్రకృతి సమాజాల మధ్య ఆదానప్రదాన ప్రక్రియకు ఏర్పడిన గండిని పూడ్చాలి. అందుకు పట్టణీకరణ ద్వారా మానవ జనాభా కేంద్రీకరణ జరగకుండా, వికేంద్రీకృత జనావాసాల నిర్మాణం తప్ప వేరే మార్గం లేదు. పర్యావరణానికి, మానవ ఆవాసాల మధ్య సమతుల్యత షరతుగా ఉన్న వ్యవసాయ, పారిశ్రామిక విధానాలు అమలులోకి వస్తేనే సాధ్యం. కార్పొరేట్ శక్తుల లాభాపేక్ష పునాదిగా సాగే హరిత విప్లవాలు కాలక్రమంలో పర్యావరణ హరణ విధ్వంసాలుగా పరిణమిస్తాయి.

ఢిల్లీ విషానికి కారకులెవరు?


ఎవరి వాటా ఎంత?



58 శాతం



24.1 శాతం



12 శాతం



9.7 శాతం



3.7 శాతం




0.18శాతం

పరిశ్రమల పాత్ర ఎంత?

విద్యుత్‌ప్లాంట్/ భారీ పరిశ్రమలు -15 శాతం
డీజిల్ జనరేటర్లు -16 శాతం । వంటగ్యాస్ 13 శాతం
వాహనాల కాలుష్యం - 25 శాతం
నిర్మాణ రంగ కాలుష్యం -31 శాతం.

వాయుకాలుష్య కోరల్లో చిక్కుకుపోయి ఉక్కిరిబిక్కిరి అయిన తరువాత ఈ కాలుష్యానికి కారణాలను ఢిల్లీ ప్రభుత్వం అన్వేషించడం మొదలుపెట్టింది. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్టుగా ఉంది ప్రభుత్వ వైఖరి. భూమి గుండ్రంగానే ఉన్నదన్నట్టు మళ్లీ వాహనాలకు ఆడ్ అండ్ ఈవెన్ నెంబర్ల విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఈ సమస్యకు దీర్ఘకాల పరిష్కారాన్ని ఇవ్వజాలదని అనేకమంది పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలో కాలుష్యం 2.5 పీఎం స్థాయి ఉందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో 15 శాతం విద్యుత్ కేంద్రాలు/ భారీపరిశ్రమలు కారణంగా నిలుస్తున్నాయి. 16 శాతం డీజిల్ జనరేటర్లు, 13 శాతం వంటగ్యాస్, 25 శాతం వాహనాలు వెదజల్లుతున్న కాలుష్యం, 31 శాతం నిర్మాణరంగం నుంచి వెలువడుతున్న దుమ్ముధూళి తదితరమైనవి ఆక్రమిస్తున్నాయని ఒక సర్వేలో తేలింది. వీటికి అదనంగా టెంపోలు 58 శాతం వాయుకాలుష్య కారకాలకుగా ఉన్నాయి. ట్రక్కులు 24.1 శాతం, బస్సులు 12 శాతం, కార్లు/టాక్సీలు 9.7 శాతం, చిన్న ట్రక్కులు 3.7 శాతం, ట్రాక్టర్లు/ట్రెయిలర్స్ 0.18 శాతం వాయుకాలుష్యానికి బాధ్యత వహిస్తున్నాయి.



నిత్యం లక్షకు పైగా ట్రక్కులు రోడ్డుపైకి...

ఢిల్లీ రోడ్డుపైకి నిత్యం తిరిగే వాహనాలెన్నో తెలుసుకుంటే గుండె ఝల్లుమంటుంది. రోజుకు 1,15945 ట్రక్కులు ఢిల్లీ రోడ్లపై దర్శనమిస్తాయి. ఇందులో హెవీ ట్రక్కులు సుమారు 85,799 ఉండగా, ఇందులో 52 శాతం 15 ఏళ్లుదాటిన ట్రక్కులున్నాయి. ఈ ట్రక్కులన్నీ కేవలం ఢిల్లీకే పరిమితం కావు. వీటితో 42 శాతం నుంచి 63 శాతం వరకు ఢిల్లీ మీదుగా ప్రయాణం చేస్తాయి. వాయు కాలుష్యం విడుదల చేయడంలో కూడా ట్రక్కులు ఎక్కువ పాత్రనే పోషిస్తున్నాయి. మొత్తం వాహనాలు విడుదల చేసే వాయుకాలుష్యంలో 46 శాతం ట్రక్కుల ద్వారానే విడులవుతాయి. వీటి కి రెండుచ్రకాల వాహనాలు ఆజ్యంపోస్తున్నాయి. ఢిల్లీలో 56.81 లక్షల దిచక్ర వాహనాలు రిజిస్టరై ఉన్నాయి. ప్రతిరోజూ అదనంగా 1400 మోటారు సైకిళ్లు కొత్తగా కొనగోళ్లు జరుగుతుంటాయి. ఈ ద్విచక్ర వాహనాలు 33 శాతం కాలుష్యానికి కారకాలుగా ఉన్నాయి. కాగా, 27.91 లక్షల ప్రైవేట్ కార్లు ఢిల్లీ రోడ్లపై తిరుగుతుంటాయి.

◆ మహి డెస్క్

ఉద్యమంతోనే మమేకం

జనచేతన మంచ్ వ్యవస్థాపకుడు రమేశ్ అగర్వాల్‌ది విలక్షణమైన జీవితం. జీవనోపాధి కోసం రాయ్‌గఢ్‌లో ఇంటర్‌నెట్ కేఫ్‌ను నిర్వహిస్తున్నారు. విచక్షణారహితమైన పారిశ్రామికీకరణ వల్ల పర్యావరణ సమతుల్యత ధ్వంసం కావడం, ప్రజాహక్కుల పరిరక్షణ కోసం ఆయన ఉద్యమబాట పట్టారు. చత్తీస్‌గఢ్‌లోని గరే గ్రామం వద్ద బొగ్గుగనిని, రాయగఢ్ జిల్లాలో విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తున్న జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (జీఎస్‌పీఎల్)పై శాంతియుత, చట్టబద్ధమైన పోరాటం కోసం జనచేతన సంస్థ ద్వారా ఉద్యమ మార్గంలోకి అడుగుపెట్టారు. అమెరికా సంస్థ అందజేసే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'హరిత నోబెల్' పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఆయన పోరాట ఫలితంగా ఇండియన్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చారిత్రాత్మక తీర్పు చెప్పింది. ప్రజలతో చర్చించిన తరువాతే జిందాల్ కంపెనీకి విద్యుత్ కేంద్రం నిర్మాణానికి అనుమతులిచ్చామని చెప్పడాన్ని ట్రిబ్యునల్ ఎద్దేవా చేసింది. ఆయన నిర్వహిస్తున్న సైబర్ కేఫ్‌లోనే పట్టపగలు ఆయనపై 2012 జూలై ఏడోతేదీన ఇద్దరు ఆగంతకులు దాడిచేసి జరిపిన కాల్పుల్లో ఆయన ఎడమకాలు దెబ్బతిన్నది.

ప్ర: దాడిగురించి ఊహించారా?

జ: ఉద్యమం ప్రారంభించినపుడు దాడులు జరిగే అవకాశా లున్నాయని ఊహించాను. దాడి అనంతరం భయపడలేదు.

ప్ర: ఈ పురస్కారం నగదును ఏంచేస్తారు?

జ: ఈ నగదుతో నా కార్యక్రమాలను విస్తృతం చేస్తాను. అందుకు అవసరమైన సాయం తీసుకుంటాను.


ప్ర: మీతో కలిసి పనిచేసిన వారి గురించి...?

జ: ఈ విజయానికి నేనొక్కడినే కారణం కాదు. ఎందరో ఉన్నారు.

ప్ర: ఈ అవార్డు అందుకున్నప్పుడు మీ అనుభూతి...?

జ: ఈ పురస్కారాన్ని అందుకునేందుకు అమెరికా వెళ్లినప్పు డు ఎందరో పర్యావరణ మిత్రులను కలుసుకున్నాను. భవిష్యత్తులో నేను చేపట్టే ఉద్యమాలకు సహకరిస్తామని వాళ్లంతా హామీ ఇచ్చారు.

◆ మహి డెస్క్



రమేశ్ అగర్వాల్

కొత్త పురపాలికలు

(మొదటి పేజీ తరువాయి)



సమాచారం. ఎన్నికల కమిషన్ ఎన్నికల ప్రక్రియ మొదలు పెట్టేలోపే గ్రామపంచాతీలను డీనోటిఫై చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద రెండు రకాల ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటి కొన్ని మేజర్ పంచాయతీలను నగర పంచాయతీలుగా చేయాలని. రెండోది, కొన్ని పంచాయతీలలో చుట్టుపక్కల గ్రామాలను విలీనం చేసి వాటిని మునిసిపాలిటీలుగా మార్చడం. బాన్సువాడ, నర్సాపూర్, మేడ్చల్ నగర పంచాయ తీలను మునిసిపాలిటీలుగా మార్చాలని ప్రతిపాదన వచ్చింది. అలాగే నాగర్‌కర్నూలు నగర పంచాయతీలో నాగనూలు, ఉయ్యాల వాడ, దేశిక్యాల్, ఎండబెట్ల గ్రామాలను కలిపి దాన్ని మునిసి పాలిటీగా మార్చాలనుకుంటున్నారు. కొన్ని గ్రామ పంచాయతీలను నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజాప్రతినిధుల నుంచి తమపై తీవ్ర ఒత్తిడి ఉందని మనిసిపాల్ పాలనా శాఖ అధికారులు అంటున్నారు. అలా చేయడం వల్ల తమకు మరిన్ని నిధులు అందుబాటులోకి వచ్చి అభివృద్ధి చేసుకోడానికి వీలుం టుందన్నది సర్పంచుల వాదన. మునిసిపాలిటీలలో సదుపాయాలు పెంచడానికి కేంద్రప్రభుత్వం కూడా 'అమృత్' లాంటి పథకాలు ప్రవేవపెట్టడమే ఇందుకు కారణం.

కొందరి ఆందోళన..

అయితే కొంతమంది సర్పంచులు మాత్రం తమ పంచాయతీ ఉనికిని యథాతథంగా ఉంచాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలను వేరే సంస్థలలో కలిపిస్తే అసలు ఊరి ఉనికి అన్నదే లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం అవసరమైతే కోర్టు కేసులతోనైనా విలీనాన్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచులుగా ఊళ్లో తమకుండే అధికారాన్ని కోల్పోవడానికి వాళ్లు ఇష్టపడటం లేదు. దీంతో ఈ ప్రక్రియ సజావుగా ముందుకు సాగుతుందా.. లేక బ్రేకులు పడుతుందా అనేది అనుమానంగానే కనిపిస్తోంది.

ఇచ్చేది గోరంత.. చూపేది కొండంత!

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం నేరుగా పడుతుంది. అంతాబాగానే ఉందనిపిస్తోంది కదూ? అయితే, శారద మాత్రం తన జీతం కేవలం రూ.16 వేలు మాత్రమేనని చెబుతోంది. నెలనెలా ఆమె చేతికందుతోంది కూడా అంతే మొత్తం.. మరి ఆమె ఖాతాలో పడిన మిగతా సొమ్ము ఏమైనట్టు..? ఇక్కడే ప్రైవేటు ఇంజనీరింగ్ యాజమాన్యాలు అటు ప్రభుత్వాన్ని.. ఇటు ఉద్యోగులనూ మోసం చేస్తూ నయా దోపిడీకి తెరలేపాయి. ప్రైవేటు కాలేజీల్లో సకల సౌకర్యాలు.. ఉద్యోగులకు వేలకు వేల జీతాలు.. ఇదంతా కేవలం రికార్డులకే పరిమితం. ప్రభుత్వానికి ఆదాయ వ్యయాల లెక్కలు చూపించడానికి రికార్డుల్లో చేస్తున్న మాయాజాలం ఇది. వాస్తవానికి ఆ కాలేజీల్లో జరిగే దోపిడీ అంతా ఇంతా కాదు. విద్యార్థులతో పాటు అందులో పనిచేసే ఉద్యోగులనూ దోచుకుంటున్నాయి.

వేసినట్టే వేసి.. వెనక్కు లాగేసి..

కాలేజీలో విద్యార్థులకు పాఠాలు బోధించే అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేలల్లో జీతాలు ఇస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తున్న యాజమాన్యాలు వాస్తవంగా అందులో సగం జీతం కూడా ఇవ్వడంలేదు. బ్యాంకర్లతో లాలూచి పడి ఉద్యోగులకు సాలరీ అకౌంట్‌లను తీస్తున్నాయి. ఆ ఖాతాల్లో నెల నెలా పెద్ద మొత్తంలో జీతాల సొమ్ము వేస్తున్నాయి. అయితే, సదరు ఖాతాలకు సంబంధించిన ఏటీఎం కార్డులను తమ ఆధీనంలో ఉంచుకుంటున్నాయి. జీతం వేసిన వెంటనే కార్డులతో ఆ మొత్తాన్ని తీసి సదరు ఉద్యోగికి చెల్లించాల్సిన అసలు మొత్తాన్ని చేతిలో పెడుతున్నాయి. వేలకు వేల జీతం చెల్లిస్తున్నట్లు చూపిస్తూ ఖాతాలో వేసిన జీతాన్ని వేసినట్లే వెనక్కు తీసుకుంటున్నాయి. శారద ఉదంతంలోనూ జరుగుతోంది ఇదే! రూ.38 వేలలో 16 వేలు ఖాతాలో ఉంచి మిగతా సొమ్మును యాజమాన్యమే తీసుకుంటోంది. హైదరాబాద్‌లో దాదాపు వందకు పైగా ప్రైవేటు కాలేజీలు ఉండగా.. దాదాపు అన్నింట్లోనూ ఈ తంతు సాధారణమేనని తెలిసింది.


ఎందుకిలా..?

ఉన్నత విద్యలో నాణ్యతను పెంచేందుకు.. విద్యార్థులకు కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించేందుకు యూజీసీ ప్రత్యేకంగా నిబంధనలను రూపొందించింది. అందుకు తగ్గట్టుగానే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలను చేపట్టాలి. వాస్తవానికి ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల స్థాయి ఉద్యోగాలకు కేవలం.. పీహెచ్‌డీ పూర్తిచేసిన వారిని మాత్రమే నియమించుకోవాలి. కానీ పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి తక్కువలో తక్కువ రూ.50 వేలన్నా చెల్లించాలి. అంతకన్నా తగ్గితే ఎవరూ ముందుకు రారు. ఆ స్థాయిలో వేతనాలు ఇచ్చేందుకు ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు సిద్ధంగా లేవు. ఈ తరుణంలో సదరు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కొత్త ఆలోచనకు తెరతీశాయి. ఎంటెక్, ఎంఫార్మసీ పూర్తి చేసిన వారినే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించుకుంటున్నారు. ఎందుకంటే వారికి అరకొర వేతనం ఇచ్చినా పనిచేస్తారు. వారికి రూ.10 వేలకు ఎక్కువ.. రూ.20 వేలకు తక్కువ అన్న కోణంలో యాజమాన్యాలు వేతనాలు చెల్లిస్తున్నాయి.

ఆదాయ, వ్యయాల సమర్పణలో సమస్యలు

ఇంతవరకు బాగానే ఉంది. కానీ ప్రభుత్వానికి కాలేజీ ఆదాయ, వ్యయాలను సమర్పించే విషయంలో యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో సిండికేట్‌గా మారిన కాలేజీ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు నయా దోపిడీకి తెర లేపాయి. నగరంలోని కొన్ని ప్రైవేటు బ్యాంకులతో కాలేజీల్లో పనిచేసే ఉద్యోగులకు సాలరీ అకౌంట్(జీరో అకౌంట్) ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. సదరు బ్యాంకులు ఆయా కాలేజీల్లోని ఉద్యోగులకు సంబంధించిన ఏటీఎం కార్డులను నేరుగా యాజమాన్యాల చేతిలో పెట్టాయి. ఇక అక్కడి నుంచి యాజమన్యాలు బ్లాక్‌మెయిల్ గేమ్ ఆడడం మొదలుపెట్టాయి. వేతనాలను భారీగా పెంచుతున్నామని చెబుతూ.. పెంచిన మొత్తాన్ని తిరిగివ్వాలని ఆదేశించాయి. ఈ నిబంధనకు అంగీకరించిన వారు మాత్రమే ఉద్యోగంలో కొనసాగుతారని, మిగతావారు వేరే ఉద్యోగం వెతుక్కోవచ్చని స్పష్టం చేశాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగం దొరకడమే గగనం.. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగాన్ని పోగొట్టుకుంటే బతికేదెలా అంటూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు యాజమాన్యాలకు తలొగ్గారు. కాగా, ప్రైవేటు కాలేజీల నయా దోపిడీని అధికారికంగా నియంత్రించే పరిస్థితి లేదు. రికార్డుల్లో ఉన్న లెక్కల ప్రకారం.. ఉద్యోగులకు వేతనాలను సక్రమంగానే వారి బ్యాంక్ అకౌంట్లలో వేస్తున్నారు. ఎవరు డ్రా చేసుకుంటున్నారనే విషయం బహిరంగ రహస్యమే. ఈ సమస్య నాలుగైదు సంవత్సరాలుగా నగరంలో జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చంద్రబాబుకు పరీక్షా కాలం



కొత్త ఏడాదిలో ఏపీ సీఎంకు అగ్నిపరీక్షలు..
తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల వేడి

- వెంటాడుతున్న గత ఎన్నికల హామీలు
- పోలవరం నిర్మాణం.. అనుమానమే
- అమరావతి భవనాలన్నీ కాగితాలమీదే
- ఆదుకోవాల్సిన కేంద్రం.. ఆడుకుంటోంది
- పోలవరం ప్రాజెక్టుకు అన్నీ కొర్రీలే
- నిధుల విడుదలలోనూ వెనకడుగు
- హామీలపై సొంతపార్టీలోనే అసంతృప్తి
- ఎన్నికల్లో జనం ముందుకు వెళ్లేదెలా
- ఏపీ సీఎం చంద్రబాబు అంతర్మథనం

అమరావతి, జనవరి 14 (మనం ప్రతినిధి): కొత్త క్యాలెండర్ అలా వచ్చిందో లేదో.. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్నికల వేడి మొదలైపోయింది. ఈ సంవత్సరం చివరిలో గానీ, వచ్చే సంవత్సరం ప్రథమార్థంలో గానీ సార్వత్రిక ఎన్నికలు ఉండటం ఖాయం కావడంతో నాయకులంతా ఇప్పటినుంచే సరంజామా అంతా సర్దుకుంటున్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత పూర్తిగా కొత్త వనరులతో మొదలైన నవ్యాంధ్రలోనూ ఈ ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడుకు 2018 సంవత్సరం అత్యంత కీలకంగా మారింది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి మిగిలి ఉన్నది అతితక్కువ సమయం కావడంతో అందుకు సర్వశక్తులు ఒడ్డాల్సి ఉంది. ఆర్థికవనరులు అంతంతమాత్రంగానే అందుబాటులో ఉండటం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అంతగా అందకపోవడం లాంటి ప్రతికూల పరిస్థితులు ఆయనకు ఎదురుగా కనిపిస్తున్నాయి. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన ప్రధాన హామీలలో కొన్ని ఇంకా నెరవేరలేదన్న అసంతృప్తి ప్రజలలో కనిపించడంతో.. ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీకి ఇది ఎన్నికల అస్త్రంగా ఉపయోగపడుతోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర చేస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల హామీలపై సకల అస్త్రశస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అంశాలు ప్రధానంగా రెండు. అవి ఒకటి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి దాని నుంచి నీళ్లివ్వడం, రెండు రాజధాని అమరావతి నిర్మాణం. ఈ రెండూ మినహా మిగిలిన హామీలను చాలావరకు అమలుచేసినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

కానీ.. సార్వత్రిక ఎన్నికలలోపు ఈ రెండు హామీలను నెరవేర్చడం ఆషామాషీ వ్యవహారం ఏమీ కాదు. రాజధానిలో చిన్న ఇటుక కూడా పేర్చలేదని ప్రతిపక్షపార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్‌తో పాటు, కాంగ్రెస్‌పార్టీ కూడా పెద్దపెట్టున విమర్శలు గుప్పిస్తూనే ఉన్నాయి. దాంతో ఈ ఏడాది అమరావతి నిర్మాణానికి సంబంధించిన అంశంపై ముఖ్యమంత్రి ప్రత్యేకదృష్టి పెటాల్సిందే. కొత్త రాష్ట్రం ఏర్పడి ఇప్పటికే నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకూ రాజధాని నిర్మాణాల ప్రారంభం కూడా జరగకపోవడం కాస్త ఇబ్బందికరంగానే ఉంది. డిజైన్ల పరిశీలన.. కాంట్రాక్టు పనుల అప్పగింతకు ఒప్పందాలు కుదుర్చుకోవడంతోనే సమయం వృథా అయిందని, రైతుల నుంచి సేకరించిన 33 వేల ఎకరాల భూమిలో ఇన్నాళ్ల పాటు తాత్కాలికంగానైనా వారికి సాగుచేసుకునే అవకాశం ఇస్తే మూడు పంటల ఆదాయం లభించినట్లు ఉండేదని విమర్శలున్నాయి.

రాజకీయంగా కీలకమైన 'పోలవరం ప్రాజెక్టు' ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న చందాన తయారైంది. ఇటీవలి కాలంలో పోలవరం పనులు జోరందుకున్నా, కేంద్రం ప్రతీసారి ఏదో ఒక కారణంతో కొర్రీలు వేయడంతో పనులు నిలిచిపోతున్నాయి. మొదట కాంట్రాక్టర్ విషయంలో కేంద్రం జోక్యం చేసుకొని పనులు నిలిపివేయగా, తాజాగా కాఫర్‌డ్యామ్ విషయంలో రోజుకో మాట మాట్లాడుతూ మరింత గందరగోళ పరిస్థితికి దారితీస్తోంది. ఒకసారి కాఫర్‌డ్యామ్ కావాలని, మరోసారి వద్దని, ఇంకోసారి కాఫర్‌డ్యామ్ పాటు స్పిల్‌వే సమాంతరంగా నిర్మించాలని కేంద్రం ఇరకాటంలో పడేస్తోంది. ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి వచ్చి పోలవరం పనులు పరిశీలిస్తానన్న కేంద్ర జలవనరుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ.. ఇప్పటి వరకూ అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. ఇప్పుడు పోలవరం ప్రధాన కాంట్రాక్టర్‌కు బ్యాంకు నోటీసులు ఇవ్వడంతో కాంట్రాక్టరును మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై కేంద్రం ఇంకా ఏమీ చెప్పలేదు. దీనికితోడు నిధుల విడుదల విషయంలోనూ మరింత జాప్యాన్ని చేయడం గమనార్హం. దీంతో కొత్త ఏడాదిలో పోలవరంపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో.. అన్న దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంజినీరింగ్ నిపుణులతో సమాలోచనలు జరుపుతున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు ఇప్పుడు పూర్తికాకపోతే ఇంకెప్పటికీ పూర్తికాదన్న బలమైన విశ్వాసంతో ముఖ్యమంత్రి ఉన్నారు. కేంద్రం రాష్ట్రానికి సహకరించి నిధులు విడుదల చేస్తేనే... ఈ కొత్త ఏడాదిలో పోలవరానికి ఓ రూపు వస్తుంది. ఇక రాజధాని అమరావతి నిర్మాణం కూడా కాగితాలకే పరిమితమైందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రతిపక్షాలే కాకుండా సొంతపార్టీలోనూ దీనిపై తర్జనభర్జనలు పడుతున్నట్లు సమాచారం. ఇప్పటివరకూ డిజైన్ల పేరుతో కాలం గడిపారని, ఇప్పటికైనా కొన్ని నిర్మాణాలనైనా పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సొంతపార్టీకి చెందిన సీనియర్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. రాజధాని నిర్మాణానికి నిధులు లేకపోవడం వల్లే ఆ పనుల్లో జాప్యం జరుగుతోందని, ప్రపంచబ్యాంక్ నుంచి విడుదల కావాల్సిన నిధులు తగిన సమయంలో విడుదలైతే.. కొన్ని భవనాలను ఆరు నెలల్లో పూర్తిచేస్తామని మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని దాదాపుగా పూర్తిచేశామని, కొన్ని భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశామని, మరో ఆరు నెలల్లో రాజధానికి ఒక రూపు వస్తుందని కూడా అంటున్నారు.

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణం.. ఈ రెండూ కొత్త సంవత్సరంలో ఓ కొలిక్కి వస్తేనే ముఖ్యమంత్రి ఎన్నికలను ఎదుర్కోడానికి కొంతవరకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. లేకపోతే తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందనే అంటున్నారు. ఇక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా రాబోయే ఎన్నికల్లో తాము తీసుకోబోయే నిర్ణయాన్ని బట్టే ఏపీ ప్రభుత్వానికి ఎంతవరకు సహకరించాలో తేల్చుకునేలా కనిపిస్తోంది. వీటన్నింటినీ అధిగమించి ముందుకు వెళ్లగలిగితేనే 2019 ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ సిద్ధం అవుతుంది.

సిటీలోనూ కొక్కొరోకో..కో!

(మొదటి పేజీ తరువాయి)



వినిపిస్తున్నాయి. పందేలు ఎంతవరకు వేస్తున్నారన్న విషయం కచ్చితంగా తెలియడం లేదు గానీ.. రహస్యంగా కొన్ని ప్రాంతాల్లో చిన్న చిన్న బరులు గీసుకుని అక్కడ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పందేలు వేయడంతో పాటు.. ఇక్కడ పందెం కోళ్ల అమ్మకాలు కూడా జోరుగానే సాగుతున్నాయి.

ఎర్రగడ్డ మార్కెట్‌లో సందడి

ప్రధానంగా ఎర్రగడ్డ మార్కెట్ మొత్తం ఈ పందెం కోడి పుంజుల అమ్మకాలతో సందడిగా మారింది. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు మొదలైన పుంజుల అమ్మకాలు.. దాదాపు మూడు నాలుగు గంటల పాటు కొనసాగాయి. ఎర్రగడ్డ కార్మిక బస్తీలోని బస్తి వాసులు కొంత మంది ఈ కోళ్లను కొద్దీ రోజులుగా పెంచి వాటిని అమ్మకానికి పెట్టారు. ఒక్కో పందెం కోడిని 2,000 నుండి 3,000 వరకు అమ్మారు. అదే గోదావరి జిల్లాల్లో అయితే వీటిని మరింత జాగ్రత్తగా పెంచి.. ఒక్కోటి రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు కూడా విక్రయిస్తారని చెబుతున్నారు. ఇక్కడివి వాటితో పోటీ పడేంత స్థాయి లేకపోయినా.. ఇవి కూడా పౌరుషంగానే ఉంటాయని.. బరిలోకి దిగితే అవతలిదాన్ని కొట్టేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాయని బస్తీవాసులు చెబుతున్నారు. ఆదివారం ఒక్కరోజే ఒక్క ఎర్రగడ్డ మార్కెట్‌లోనే 1500కు పైగా పుంజులను అమ్మినట్లు తెలుస్తోంది. కోళ్లను కొన్న వ్యక్తులు వాటిని.. రంధ్రాలున్న బియ్యం సంచుల్లో వేసుకుని వాళ్ల వాళ్ల ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. నగర శివార్లలోని కొన్ని ప్రాంతాల్లో జనసంచారం అంతగా లేనిచోట మాత్రం ఈ రెండు మూడు రోజుల పాటు కోడిపందేలు నిర్వహించడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. కాళ్లకు కత్తులు లేకుండా సరదా కోసం ఈ తరహా పందేలు నిర్వహించుకోడానికి అనుమతులిస్తే.. ఇక్కడి నుంచి భీమవ రం లాంటి సుదూర ప్రాంతాలకు కోడిపందేలు చూడటానికి వెళ్లాల్సిన అవసరం ఉండకపోవచ్చని అంటున్నారు.

గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ జిల్లాల నుంచి పలువురు రాజకీయ ప్రముఖులు, ఇతరులు పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు తదితర ప్రాంతాలకు వెళ్లి అక్కడ జరిగే కోడిపందేలు చూసి, వాటిలో పాల్గొని వస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఓ ప్రముఖుడు కూడా అంతకుముందు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గోదావరి జిల్లాల్లో కోడిపందేలు చూస్తూ అక్కడి ఫొటోలకు చిక్కారు.

పల్లె నిండుగా.. సంక్రాంతి పండుగ

- సొంత గూటికి నగరవాసులు
- కొత్త అల్లుళ్లతో ఇళ్లలో సంబరాలు
- భోగిమంటలు, పతంగులతో సందడి

అమరావతి, జనవరి 14 (మనం ప్రతినిధి):

పల్లె కళకళలాడుతోంది. ఉద్యోగాల కోసం నగరాల్లో జీవనం సాగిస్తున్న వారంతా సొంత ఊరికి చేరడంతో సంక్రాంతి సందడి వచ్చేంది.పెద్ద పండగ సంక్రాంతికి అందరూ పల్లె బాట పట్టడంతో పలచగా కనిపించే గ్రామాలు నిండుగా కనిపిస్తున్నాయి. పల్లెల్లోని ప్రతి లోగిలి పచ్చని తోరణాలతో సంక్రాంతికి స్వాగతం పలుకుతోంది. ప్రతి ఇంటా పిండి వంటల ఘుమఘుమలాడుతున్నాయి. గంగిరెద్దుల విన్యాసాలు అబ్బురపరుస్తుండగా, హరిదాసులు రామనామ సంకీర్తనలు వీనులవిందు చేస్తున్నారు. తెలుగింటి ఆడపడుచుల ఇళ్ల ముంగిట వేసిన సంక్రాంతి ముగ్గులతో లోగిళ్లు కళకళలాడుతున్నాయి. పడుచు పిల్లలు ముగ్గుల పోటీకి పట్టు పరికిణీల్లో పరుగులు పెడుతున్నారు. ఇక కుర్రాళ్లు ఊరిలో సంప్రదాయ జరిగే ఆటల పోటీల్లో హుషారుగా పాల్గొంటున్నారు. కబడ్డీ, ఖోఖో వంటి ఆటలతో రోజంతా హాయిగా గడిపేస్తున్నారు. పతంగులు ఎగురవేస్తూ పిల్లలు సందడి చేస్తున్నారు. కొత్త అల్లుళ్లు.. బంధుమిత్రుల రాకతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. ఇంటిళ్ల పాదీ ఆటపాటలతో సంబరంలో మునిగిపోతున్నారు. ఆప్యాయతానురాగాల నడుమ పలకరింపులు.. కేరింతలతో పట్నం నుంచి యూత్ పల్లెల్లో ఎంజాయ్ చేస్తున్నారు. కోడిపందాలతో గోదావరి, కృష్ణా జిల్లాలు కళకళలాడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పశుప్రదర్శనలు, ఎద్దుల బండ లాగుడు పోటీలతో రైతులు ఆనందోత్సాహాలతో ఉన్నారు. నిత్యం నగరాల్లో పొద్దెక్కే వరకూ పడుకుని సూర్యుడినే చూడని ఎందరో యువత ఆదివారం భోగి నాడు తెల్లవారు జామునే ఇంటి ముంగిళ్లలోకి చేరారు. చిన్నా పెద్దా అంతా కలిసి భోగి మంటలు వేశారు.

పులకరిస్తున్న పల్లెలు

కరువులతో కూలీల వలసలు.. ఉద్యోగాల రీత్యా చదువుకున్నోళ్ల నగర జీవనంతో ఎప్పుడూ బోసిగా కనిసించే పల్లెలు పెద్ద పండుగ రాకతో పులకరిస్తున్నాయి. ఏడాది పొడవునా నగరం నీడలో గడుపుతూ, పల్లెటూరు మట్టివాసన మర్చిపోయిన నేటి తరం వాళ్లను మాత్రం పల్లెలు ఈ మూడు రోజులు అక్కున చేర్చుకుంటాయి. సంక్రాంతి కోసం అంతా సొంత ఊరికి చేరడంతో పల్లెలు కొత్త రూపు సంతరించుకున్నాయి. గ్రామాలకు వచ్చిన యువత వారి పంట పొలాలకు వెళ్లి తిరిగి రావడానికి ఇష్టపడుతున్నారు. చిన్ననాడు చదివిన స్కూళ్లు, ఎలిమెంటరీ, హైస్కూళ్లో చదివిన మిత్రులతో సరదాగా చెరువ గట్టుకు చేరి పొద్దుపోయే వరకు సరదాగా గడుపుతున్నారు. ఏడాది అంతా పడిన కష్టాన్ని, తాను పుట్టి పెరిగిన ఊరికి రాగానే మర్చిపోతున్నారు.

ధనిక ఢిల్లీ.. బీద బిహార్

పంజాబ్‌లోనూ ధనికుల సంఖ్య ఎక్కువే

న్యూఢిల్లీ, జనవరి 14:





మన దేశంలో ధనికులు బాగా ఎక్కువగా ఉండే రాష్ట్రాలు ఏవో తెలుసా.. ఢిల్లీ, పంజాబ్. అదే పేదవాళ్లు ఎక్కువగా ఉండేది చూస్తే.. బిహార్. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఉండేవారిలో 60% కుటుంబాల వాళ్లు బాగా డబ్బున్నవాళ్లు కాగా.. బిహార్‌లో సగానికి పైగా కుటుంబాలు దారిద్ర్యరేఖకు దగ్గరలో గానీ, దిగువన గానీ ఉన్నాయి. దేశవ్యాప్తంగా 6 లక్షల కుటుంబాలతో చేసిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో ఈ విషయాలు తెలిశాయి. ఇక మతాల వారీగా చూస్తే.. దేశంలో ఉన్న అన్ని మతాల వారి కంటే జైనులలో ఎక్కువమంది ధనికులున్నారు. సాధారణంగా వాళ్ల జనాభా తక్కువే అయినా.. అందులో 70 శాతం మంది ధనికులని తెలిసింది. వారి తర్వాత సిక్కులలో 59.6 శాతం మంది ధనికులు ఉన్నారు. హిందూ, ముస్లిం కుటుంబాలలో 19.3, 18.2 శాతం చొప్పున మాత్రమే ధనిక కుటుంబాలున్నాయి. అలాగే.. దేశవ్యాప్తంగా సంపద పంపిణీలో హిందూ – ముస్లింల మధ్య పెద్దగా అంతరం ఏమీ లేదు. దాదాపు సమానంగానే ఉన్నారు. సహజంగానే ఇతర కులాల కంటే అగ్రకులాల వారిలో సంపద ఎక్కువ కనిపిస్తుండగా, షెడ్యూల్డు తెగలవారు చాలా అధమ స్థాయిలో ఉన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య కూడా సంపద విషయంలో అంతరాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో 29% మంది పేదరికంలో మగ్గుతుండగా పట్టణ ప్రాంతాల్లో మాత్రం కేవలం 3.3% మంది మాత్రమే పేదరికాన్ని అనుభవిస్తున్నారు. వివిధ కుటుంబాలలో టీవీలు, సైకిళ్లు, మోటారుసైకిళ్లు, కార్లు ఎలా ఉన్నాయో.. అలాగే వారికి శుభ్రమైన తాగు నీరు అందుతోందా లేదా.. ఇలాంటి పలు అంశాల ఆధారంగా ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులను ఐదు స్థాయిలలో అంచనా వేశారు. నిరుపేదలు, పేదలు, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి, ఉన్నత తరగతి కుటుంబాలుగా వర్గీకరించారు. ఒక్కో రాష్ట్రంలో ఏ వర్గంలో ఎంత శాతం మంది ఉన్నారో శాతాల వారీగా చెప్పారు. వాటిలో తెలుగు రాష్ట్రాల పరిస్థితులు కూడా వెల్లడించారు. తెలంగాణలో నిరుపేదలు 7.9%, పేదలు 18.1%, మధ్యతరగతి వారు 26%, ఎగువ మధ్యతరగతి వారు 25.8%, ఉన్నత తరగతుల వారు 22.3% చొప్పున ఉన్నారు. అదే ఆంధ్రప్రదేశ్‌లో అయితే నిరుపేదలు 5.9%, పేదలు 16.5%, మధ్యతరగతి వారు 31.8%, ఎగువ మధ్యతరగతి వారు 28.8%, ఉన్నత తరగతుల వారు 17% చొప్పున ఉన్నారు. బిహార్‌లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. అక్కడ నిరుపేదలు 52%, పేదలు 22.3%, మధ్యతరగతి వారు 12.9%, ఎగువ మధ్యతరగతి వారు 8.5%, ఉన్నత తరగతుల వారు 3.3% చొప్పున ఉన్నారు. దేశంలో ఆదాయ అసమానతలు చాలా తీవ్రంగా ఉన్నాయని సర్వే మొత్తమ్మీద తెలిసింది. కొంతమంది వద్ద చాలా ఎక్కువ సంపద కేంద్రీకృతం అయి ఉండగా, మరికొందరి పరిస్థితి అత్యంత దారుణంగా ఉందన్నారు.

ఫొటో కోసం ఎంపీ, ఎమ్మెల్యే ఘర్షణ

యూపీలో పేదలకు దుప్పట్ల పంపిణీలో ఘటన

లఖ్‌నవ్, జనవరి 14: పేదలకు దుప్పట్ల పంపిణీ సందర్భంగా ఫొటోకు ఫోజిచ్చే విషయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ఘర్షణ పడ్డారు. తీవ్ర విమర్శలకు దారితీసిన ఈ ఘటన సీతాపూర్ జిల్లాలో చోటు చేసుకుంది. విపరీతమైన చలితో పలువురు రోడ్డుపక్కన ఉండేవారు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో వారికి దుప్పట్ల పంపిణీకి ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. అయితే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక ఎంపీ రేఖా వర్మ, మహిళా ఎమ్మెల్యే మధ్య ఫొటో విషయంలో గొడవ మొదలైంది. తానంటే తాను ముందు ఫొటో దిగాలంటూ ఘర్షణ పడ్డారు. అందరూ చూస్తున్నారనే ఇంగితం లేకుండా.. ఒకరినొకరు తోసుకున్నారు. ఎంపీ రేఖా వర్మ ఓ వ్యక్తిపై చేయి చేసుకోగా మరో మహిళా ఎమ్మెల్యే తన చెప్పు తీసుకొని ఎంపీ మద్దతుదారుపై దాడి చేసింది. ఇలా ఆ కార్యక్రమం రచ్చరచ్చయింది. చివరకు అక్కడికి జిల్లా మేజిస్ట్రేట్, ఎస్పీ చేరుకొని గొడవ సద్దుమణిగేలా చేశారు. అయితే, ఈ వీడియో మాత్రం బాగా హల్‌చల్ చేస్తోంది.







మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఆదివారం అలహాబాద్ త్రివేణి సంగమం, గంగాసాగర్ వద్ద పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మా శక్తిని పరీక్షించుకోండి!

- సత్తా ఏమిటో తెలుస్తుంది
- రావత్ వ్యాఖ్యలు అణు యుద్ధానికి దారి
- పాక్ విదేశాంగశాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్



న్యూఢిల్లీ, జనవరి 14: పాకిస్థాన్ అణ్వాయుధాలపై భారత ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ చేసిన వ్యాఖ్యలపై ఆ దేశం తీవ్రంగా మండిపడింది. రావత్ వ్యాఖ్యలు అణు యుద్ధానికి దారితీసేలా ఉన్నాయని హెచ్చరించింది. ''భారత్ మా శక్తిని పరీక్షించాలనుకుంటోంది. ప్రయత్నించి చూడండి. మా సత్తా ఏంటో మీకే తెలుస్తుంది. తూర్పు ప్రాంతాల నుంచి వచ్చే బెదిరింపులను ఎదుర్కోవడానికి మా వద్ద అణ్వాయుధాలు ఉన్నాయి. రావత్ వ్యాఖ్యలు అణు యుద్ధానికి దారి తీసేలా ఉన్నాయి'' అని పాకిస్థాన్ విదేశాగశాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ''ఇండియన్ ఆర్మీ చీఫ్ చాలా బాధ్యతారహితమైన ప్రకటన చేశారు. ఆ వ్యాఖ్యలు ఆయన పదవికి తగినది కాదు. ఇది అణు ప్రతిఘటన కోసం ఆహ్వానించడమే అవుతుంది. వాళ్ళు (భారతదేశం) కోరుకుంటున్నది అదే అయితే, మా దృఢ సంకల్పాన్ని పరీక్షించేందుకు వారికి స్వాగతం. ఇన్‌షా అల్లా, జనరల్ (రావత్) సందేహాలు క్షణాల్లో పటాపంచలవుతాయి'' అని ట్వీట్ చేశారు. పాక్ విదేశాంగ మంత్రి అసిఫ్ ట్వీట్ అనంతరం ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి డాక్టర్ మహమ్మద్ ఫైజల్ కూడా మరో ట్వీట్ చేశారు. ''ఇండియన్ ఆర్మీ చీఫ్ చేసిన బెదిరింపు, బాధ్యతారహిత ప్రకటన భారతదేశానికి ఉన్న కుటిల మనస్తత్వానికి నిదర్శనం. తప్పుడు అంచనాల ఆధారంగా ఎటువంటి దుస్సాహసం జరగడానికి వీల్లేదు. తనను తాను రక్షించుకోగలిగే సంపూర్ణ సామర్థ్యం పాకిస్థాన్‌కు ఉంది'' అని పేర్కొన్నారు. కాగా, శనివారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో రావత్ మాట్లాడుతూ.. '' అణ్వాయుధాలు ఉన్నాయని పాకిస్థాన్ బుకాయిస్తోంది. పాకిస్థానీయులను ఎదుర్కొనడానికి మాకు ఒక అవకాశమిస్తే వారికి సరైన సమాధానమిస్తాం. పాక్ అణు బూటకాన్ని బయటపెట్టేందుకు భారత సైన్యం సర్వ సన్నద్ధంగా ఉంది'' అని పేర్కొన్నారు. ప్రభుత్వం కోరితే సరిహద్దులను దాటి వెళ్ళి ఎలాంటి ఆపరేషన్‌ను నిర్వహించేందుకు అయినా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

వలస కార్మికులపై వివక్ష

- ద్వితీయ శ్రేణి పౌరులుగా చిన్నచూపు
- కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ, జనవరి 14: కేంద్రంలోని బీజేపీ సర్కార్ భారత వలస కార్మికులను ద్వితీయ శ్రేణి పౌరులుగా చిన్నచూపు చూస్తోందని, ఇది ఆమోదయోగ్యం కాదని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. పాస్‌పోర్టు చివరి పేజీలో సంబంధిత వ్యక్తి చిరునామా ముద్రించరాదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్ణయించడం, దీనిఫలితంగా ఇకమీదట ప్రయాణ పత్రాన్ని ప్రామాణికమైన చిరునామా రుజువుగా ఇచ్చే అవకాశాలు లేకపోవడంపై రాహుల్ స్పందించారు. ఈ నిర్ణయం బీజేపీ పక్షపాత వైఖరిని సూచిస్తోందని ట్వీట్ చేశారు.

ఇక స్కూటర్ ఎక్కను

- **ప్రమాదం జరుగుతుందని భయం: పారికర్**



పనాజీ, జనవరి 14: రక్షణ శాఖ మాజీ మంత్రి, గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ చాలా నిరాడంబరంగా ఉంటారు. సీఎం హోదాలో ఉన్నా సాధారణ పౌరుడిలా పనాజీలో స్కూటర్‌పై చక్కర్లు కొడతారు. మార్కెట్‌కు స్కూటర్‌పై వెళ్లి స్వయంగా వస్తువులు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్తారు. కాగా ఇకమీదట స్కూటర్ డ్రైవ్ చేయబోనని పారికర్ చెబుతున్నారు. యాక్సిడెంట్ జరుగుతుందేమోననే భయంతో స్కూటర్ రైడింగ్‌కు స్వస్తి పలకనున్నట్టు తెలిపారు. ''స్కూటర్‌పై వెళ్లినపుడు ప్రజలు నన్ను ఏవో అడుగుతుంటారు. మళ్లీ స్కూటర్ ఎక్కనని చెబుతుంటాను. పనికి సంబంధించిన ఆలోచనలతో నా మెదడు నిండిపోయింది. నేను స్కూటర్‌పై వెళ్లినా నా మనసు ఎక్కడో ఉంటుంది. దీంతో ప్రమాదం జరిగి అవకాశం ఉంది. అందుకే భద్రతను దృష్టిలో ఉంచుకుని స్కూటర్ డ్రైవ్ చేయడం, దానిపై ప్రయాణించడం వద్దనుకున్నాను'' అని బీజేపీ కార్యకర్తల సమావేశంలో పారికర్ చెప్పారు. గోవాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి, ప్రాణ నష్టం నివారించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

భారత్ ప్రపంచ శక్తి

చతుర్విధ రంగాల్లో దిగ్గజ దేశం.. ద్వైపాక్షిక సహకార విస్తరణే లక్ష్యం



- **ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు**
- **స్వయంగా స్వాగతం పలికిన మోదీ**
- **ఎయిర్‌పోర్టులో ఆప్యాయ ఆలింగనం**



న్యూఢిల్లీ/జెరూసలెం, జనవరి 14: ''భారత్ ఒక ప్రముఖ అంతర్జాతీయ శక్తి. ఆర్థిక, రక్షణ, సాంకేతిక, పర్యాటక రంగాలపరంగా ప్రపంచంలో ఓ దిగ్గజ దేశం. అలాంటి శక్తిమంతమైన దేశంతో ద్వైపాక్షిక సహకార విస్తరణకు నా పర్యటన ఓ అవకాశం కల్పిస్తుంది'' అని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. భారత్‌లో ఆరు రోజుల పర్యటన కోసం ఆదివారం జెరూసలెం నుంచి బయల్దేరే ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. అటుపైన నెతన్యాహు ఢిల్లీ చేరుకోగానే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. అధికార సంప్రదాయాలను పక్కనబెట్టి నేరుగా విమానాశ్రయానికి వెళ్లిన మోదీ... ఆప్యాయ ఆలింగనంతో సాదరంగా నెతన్యాహూను ఆహ్వానించారు. ''మిత్రమా! మా దేశంలోకి నీకిదే స్వాగతం... భారత్‌లో మీ పర్యటన ఎంతో ప్రత్యేకం... చరిత్రాత్మకం. రెండు దేశాలమధ్య స్నేహాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుంది'' అని ట్విట్టర్‌లో ఆంగ్ల, హిబ్రూ భాషల్లో మోదీ స్వాగతించారు. ఏరియల్ షరాన్ 2003లో భారత పర్యటనకు వచ్చిన తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని ఒకరు మళ్లీ మన దేశాన్ని సందర్శించడం ఇదే తొలిసారి. స్వాగత లాంఛనాల తర్వాత ప్రధానులిద్దరూ తీన్‌మూర్తి భవన్ చేరుకుని అక్కడ వీర సైనికుల స్మారకంవద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించారు. దాదాపు 400 ఏళ్లపాటు హైఫా నగరాన్ని ఉక్కు పిడికిట్లో ఉంచుకున్న టర్కీ పాలకుల ఉక్కు పిడికిలి నుంచి భారత సైనికులు విముక్తం చేశారు. అప్పట్లో భారత్‌లోని హైదరాబాద్, జోధ్‌పూర్, మైసూర్‌లకు చెందిన అశ్వికదళం ఈ భీకర పోరాటంలో పాల్గొని 1918 సెప్టెంబరు 23న విజయం సాధించింది. ఆనాటి భీకర పోరాటంలో సుమారు 900 మంది వీరసైనికులు అమరులు కాగా, ఇజ్రాయెల్‌లోనే వారికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ విజయానికి గుర్తుగా ఢిల్లీలో తీన్‌మూర్తి స్మారకాన్ని నిర్మించారు. నెతన్యాహు పర్యటన నేపథ్యంలో ఈ ప్రాంతంలోని కూడలికి ''తీన్‌మూర్తి హైఫా చౌక్''గా నామకరణం చేశారు. ప్రధానులిద్దరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కీలక ఒప్పందాలకు రంగం సిద్ధం

భారత్-ఇజ్రాయెల్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తవుతుండటంతో నెతన్యాహూ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆయన ఆరు రోజుల సుదీర్ఘ సందర్శనలో భాగంగా పలు రంగాల్లో రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు ఖరారు కానున్నాయి. నెతన్యాహు వెంట 130 మంది సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి వాణిజ్య బృందం వచ్చింది. దీంతో రక్షణ, వాణిజ్య, చమురు, సహజవాయు, పునరుత్పాదక ఇంధనం, సైబర్ భద్రత తదితర రంగాల్లో అవగాహన ఒప్పందాలద్వారా స్నేహ సంబంధాలు మరింత దృఢం కాగలవని భావిస్తున్నారు. తదనుగుణంగా ప్రధానులిద్దరి మధ్య సమగ్ర చర్చలు సాగుతాయి. అలాగే మోదీ, నెతన్యాహు బుధవారం గుజరాత్ రాష్ట్ర సందర్శనకు వెళ్లనుండగా అక్కడ సంయుక్తంగా రోడ్ షో నిర్వహిస్తారు. ఇక ఢిల్లీలో ప్రధాని మోదీతోపాటు విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌తోనూ నెతన్యాహు సమావేశమవుతారు. సోమవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో భేటీ అవుతారు. మంగళవారం తాజ్‌మహల్‌ను సందర్శించి, అటుపైన రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే వార్షిక 'రాజకీయ-భౌగోళిక సదస్సులో పాల్గొంటారు. అనంతరం 18న ముంబైలో ప్రముఖ బాలీవుడ్ నటీనటులను కలుసుకుంటారు.


నెతన్యాహు వెంట మోషే!

ముంబైలో 26/11 ఉగ్రదాడి బీభత్సం గుర్తుంది కదూ! నాటి పాక్ ముష్కరుల దాడిలో వారి కరకు తుపాకులకు తల్లిదండ్రులిద్దరూ బలైపోయేనాటికి మోషే రెండేళ్ల పసివాడు. ముంబైలోని నారిమన్ హౌజ్‌లో చొరబడిన ఉగ్రవాదులు విచక్షణరహితంగా గుళ్ల వర్షం కురిపించగా మోషే అమ్మానాన్నలు రబ్బీ గవ్రీల్ హోల్ట్జ్‌బర్గ్, రివికా నేలకొరిగారు. ఆ సమయంలో అక్కడున్న సంరక్షకురాలు శాండ్రా శామ్యూల్స్ ఎంతో సాహసంతో మోషేను కాపాడింది. ప్రస్తుతం మోషే వయసు 11 సంవత్సరాలు. ప్రధాని మోదీ జూలైలో ఇజ్రాయెల్‌లో పర్యటించిన సందర్భంగా మోషే ఆయనను కలుసుకున్నాడు. భారత్ రావాలని ఉంద ని, పెద్దయ్యాక ముంబైలో నివసించడం తన ఆకాంక్ష అని వెల్లడించాడు. దీంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు రావ చ్చునని మోదీ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో భారత పర్యటనకు బయల్దేరిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతోపాటు మోషే కూడా వచ్చాడు. మంగళవారం తన తాత, బామ్మ, సంరక్షకురాలు శాండ్రాతో కలసి ముంబై వెళ్లి తన తల్లిదండ్రులు నివసించిన నారిమన్ హౌజ్‌ను సందర్శించనున్నాడు.

ఇలా చేస్తే బాగుంటుంది

- సీజేఐకి నలుగురు రిటైర్డ్ జడ్జిల బహిరంగ లేఖ
- కేసుల కేటాయింపు ఏకపక్షం కారాదని సూచన





న్యూఢిల్లీ, జనవరి 14: న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థాయి న్యాయమూర్తుల మధ్య అగాధం బట్టబయలైన నేపథ్యంలో నలుగురు రిటైర్డ్ జడ్జిలు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దీపక్ మిశ్రాకు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ''కేసుల కేటాయింపులో హేతుబద్ధ, నిష్పక్షపాత, పారదర్శక ప్రక్రియను అనుసరించాల''ని అందులో కోరారు. ముఖ్యమైన, సున్నితమైన కేసులలో ''వాంఛిత ఫలితం'' రాబట్టడం కోసం ''అధికార దుర్వినియోగం '' జరగడంలేదన్న నమ్మకం ప్రజలకు కలగాలంటే ఈ పద్ధతి పాటించడమే ఉత్తమమని వారు సూచించడం గమనార్హం. ఈ లేఖ రాసిన విశ్రాంత న్యాయమూర్తులలో పి.బి.సావంత్ (సుప్రీం కోర్టు), ఎ.పి.షా, కె.చంద్రు, హెచ్.సురేష్ (హైకోర్టు) ఉన్నారు. ''కేసుల కేటాయింపు ఏకపక్షంగా ఉండకూడదు. సున్నితమైన, ప్రధానమైన కేసులను చీఫ్ జస్టిస్ తాను 'ఎంపిక చేసుకున్న' జూనియర్ జడ్జిల ధర్మాసనాలకు పంపడం తగదు'' అని బహిరంగ లేఖలో స్పష్టం చేశారు. కేసుల కేటాయింపుపై 'స్పష్టమైన నియమ-నిబంధనలు' రూపొందించేదాకా పెండింగ్‌లో ఉన్నవిసహా ముఖ్యమైన, సున్నితమైన కేసులన్నిటినీ బహిరంగ తిరుగుబాటు చేసిన నేపథ్యంలో విశ్రాంత న్యాయ మూర్తులు ఈ లేఖ రాయడం గమనార్హం. ఐదుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారించాలని వారు సూచించారు. సుప్రీం కోర్టులో నలుగురు సీనియర్ జడ్జి లు శుక్రవారం నాడు చీఫ్ జస్టిస్ మిశ్రాపై

కాగా, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ శనివారం అత్యవ సరంగా సమావేశమై ఇదే విధంగా తీర్మానించింది. పెండింగ్ కేసులు, ప్రజాహిత వ్యాజ్యాలు వంటివి ఐదుగురు అత్యంత సీనియర్ జడ్జిల నేతృత్వంలోని ధర్మాసనాల పరిధికన్నా దిగువస్థాయికి వెళ్లరాదని అభిప్రాయపడింది. ఇందుకు అనుగుణంగా ఒక వ్యవస్థను రూపొందించాలని సూచించింది.

సంక్షోభం సమసిపోతుంది

- సీజేఐసహా సుప్రీం జడ్జిలు హామీ ఇచ్చారు
- బీసీఐ బృందంతో సౌహార్ద భేటీ: మానన్

న్యూఢిల్లీ, జనవరి 14: సర్వోన్నత న్యాయస్థానంలో తలెత్తిన సంక్షోభం త్వరలోనే సమసిపోతుందని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాసహా న్యాయమూర్తులందరూ హామీ ఇచ్చారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సప్తసభ్య బృందంతో ఆదివారం నాటి సమావేశంలో వారు భరోసా ఇచ్చినట్లు బీసీఐ చైర్మన్ మానన్ కుమార్ మిశ్రా తెలిపారు. ''చీఫ్ జస్టిస్‌తో మా సమావేశం 50 నిమిషాలపాటు పూర్తి సౌహార్ద వాతావరణంలో సాగింది. త్వరలోనే సంక్షోభానికి తెరపడుతుంది. ఇవాళ మేం కలుసుకున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తులందరూ ఇదేవిధంగా హామీ ఇచ్చారు'' అని ఆయన విలేకరులకు వివరించారు. మరోవైపు సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్ కూడా సీజేఐతో భేటీ అయ్యారు. నలుగురు సీనియర్ జడ్జిలతో ఆయనకు అగాధంపై ఎస్సీబీఏ చేసిన తీర్మానాల ప్రతిని ఆయనకు అందజేసినట్లు ఆయన తెలిపారు. వీలైనంత త్వరగా వివాదానికి ముగింపు పలికి, సర్వోన్నత న్యాయస్థానంలో స్నేహపూర్వక వాతావరణం నెలకొనే విధంగా చూస్తామని ఆయన వాగ్దానం చేశారని వివరించారు. అంతకుముందు జడ్జిల తిరుగుబాటు సంక్షోభ పరిష్కారంపై కొందరు న్యాయమూర్తుల మధ్య ముమ్మర చర్చలు సాగాయి. ఇందులో భాగంగా చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాపై తిరుగుబాటుకు నేతృత్వం వహించిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌ను ఆయన అధికార నివాసంలో జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే, జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు కలుసుకున్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సప్తసభ్య బృందం జస్టిస్ చలమేశ్వర్‌తో సమావేశమైన అనంతరం ఈ ఇద్దరు న్యాయమూర్తులు ఆయనతో భేటీ అయ్యారు. మరోవైపు బీసీఐ బృందం జస్టిస్ చలమేశ్వర్‌తోపాటు న్యాయమూర్తులు ఆర్.కె.అగర్వాల్, ఎ.ఎం.ఖన్విల్కర్, అరుణ్ మిశ్రాలతో సమావేశమైంది.

రక్తరహిత భారతం

- **చండీగఢ్ పిల్లలు.. మహిళల్లో రక్తహీనత**
- **'సిటీ బ్యూటిఫుల్'లో తీవ్రంగా సమస్య**
- **కేంద్రపాలిత ప్రాంతాలన్నింటిలో ఇంతే**
- **పౌష్టికాహార లోపమే ప్రధాన కారణం**
- **జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో వెల్లడి**

న్యూఢిల్లీ, జనవరి 14: ఉత్తరాదిలో అన్ని రాష్ట్రాల కంటే పంజాబ్, హరియాణా రాష్ట్రాల ఉమ్మడి రాజధాని అయిన చండీగఢ్‌లో 6 నెలల నుంచి 5 ఏళ్ల వయసు లోపున్న పిల్లల్లో రక్తహీనత చాలా ఎక్కువగా ఉంది. ఈ విషయం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో తేలింది. సిటీ బ్యూటిఫుల్‌గా చెప్పుకొనే చండీగఢ్‌లో మహిళల్లో కూడా రక్తహీనత ఏకంగా 76 శాతం మందిలో ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ చేయించిన ఈ సర్వేలో తెలిసింది. రక్తంలో హెమోగ్లోబిన్ స్థాయి త గ్గడాన్నే రక్తహీనత అంటారు. దేశవ్యాప్తంగా 6 నెలల నుంచి 5 ఏళ్ల వయసు లోపున్న పిల్లల్లో 58.4 శాతం మందికి రక్తహీనత ఉండగా, చండీగఢ్‌లో మాత్రం 73% మందికి ఉంది. ఢిల్లీలో 59.7%, హరియాణాలో 71.7% చొప్పున ఈ సమస్య ఉంది. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో మాత్రం మరీ అంత ఎక్కువగా ఈ సమస్య లేదు. దాద్రా నగర్ హవేలీలో 80%, చండీగఢ్‌లో 76%, అండమాన్ నికోబార్ దీవుల్లో 66% చొప్పున మహిళల్లో చాలా ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతున్నారు. చాలావరకు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఐదేళ్లలోపు వయసున్న పిల్లలు కూడా ఎక్కువగానే రక్తహీనత






బారిన పడ్డారని సర్వేలో తేలింది. ఇందుకు కచ్చితంగా కారణం ఏంటన్నది తెలియలేదు గానీ, ఐరన్ తక్కువగా తీసుకోవడం వల్లే ఇలా జరుగుతుండొచ్చని చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్‌లో గైనకాలజీ డిపార్టుమెంటుకు చెందిన డాక్టర్ రశ్మీ బగ్గా అభిప్రాయపడ్డారు. తగిన ఆహారం తీసుకోకపోవడం, చిన్నతనంలో అనారోగ్యం, పౌష్టికాహార లోపం, డయేరియా, కడుపులో నులిపురుగులు.. ఇలాంటివన్నీ కూడా రక్తహీనతకు కారణం అవుతున్నాయి. దేశవ్యాప్తంగా 99.6% కుటుంబాలకు విద్యుత్ సదుపాయం, 99.5% కుటుంబాలకు తగినంత తాగునీటి సరఫరా, 99.7% కుటుంబాలకు టాయిలెట్లు ఉండగా.. 1.6% కుటుంబాలు ఇంకా వంట కోసం కట్టెలు, బొగ్గు లాంటివాటిని వాడుతున్నాయి.

నోయిడా పరిగెడుతోంది!

- **ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టే నగరాల్లో టాప్**



న్యూఢిల్లీ, జనవరి 14: మెట్రో నగరాల్లో ప్రజలు నిద్ర లేచింది మొదలు ఉరుకులు పరుగుల పెట్టాల్సిందే! క్షణం తీరిక ఉండని జీవన శైలి అది! ఇంత బిజీ జీవితంలో ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పదు. ఇలా ఫిట్‌నెస్‌పై పక్కాగా దృష్టి పెట్టే నగరాల్లో నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్ వంటి నగరాలు ముందంజలో ఉన్నాయి. ఇక్కడ ప్రజలు నిత్యం కనీసం 340 కేలరీలు కరిగిస్తున్నారు. నెలలో 10 రోజుల వరకు తప్పక కసరత్తులు చేస్తున్నారు. హెల్తిఫైమీ అనే ఫిట్‌నెస్, హెల్త్ యాప్ అధ్యయనం ఈ వివరాలను వెల్లడించింది. భారత్‌లోని 220 నగరాల్లో 36 లక్షల మంది నుంచి వారి వ్యాయామ, ఆహారపు అలవాట్లపై హెల్తిఫైమీ సర్వే చేసింది. గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్ నగరాల్లోని 45 శాతం ప్రజలు నిత్యం ఉదయాన్నే పరుగు పెడతారని తెలిపింది. రోజులో 4700 మెట్లు ఎక్కి దిగుతారని పేర్కొంది. కానీ లఖ్‌నవ్, కోల్‌కతా, అహ్మదాబాద్ ప్రజలు 'బద్ధకస్తులు'గా ఉంటున్నారని సర్వే వెల్లడించింది. ఈ నగరాల్లోని వారు నెలలో 4 రోజులకు మించి కసరత్తులు చేయడం లేదని తెలిపింది. మొత్తంగా దేశవ్యాప్తంగా మహిళల కన్నా పురుషులు ఎక్కువగా వ్యాయామం చేస్తున్నారని హెల్తిఫైమీ పేర్కొంది. మగవారు సగటున నెలకు 14 రోజులు కసరత్తులు చేస్తుంటే ఆడవారు 11 రోజులు చేస్తున్నారు. అయితే ఈ మూడు నగరాల్లో మాత్రం వనితలే ఫిట్‌నెస్‌పై బాగా దృష్టి పెడుతున్నారట. దేశవ్యాప్త సగటు కన్నా ఇక్కడి పురుషులు 35 శాతం తక్కువగా కేలరీలు కరిగిస్తున్నారని తేలింది.

చిరంజీవి ముఖ్య అతిథిగా 'ఛలో'

నాగశౌర్య హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'ఛలో'. వెంకి కుడుముల దర్శకుడు. శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఐరా క్రియేషన్స్ పతాకంపై ఉషా ముల్పూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 2న ఈ చిత్రం విడుదల కానుంది. కాగా, ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను జనవరి 25న జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ హీరో చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ''ఇప్పటివరకు రిలీజ్ చేసిన ఛలో ఫస్ట్ లుక్, టీజర్, సాంగ్స్‌ను ఇంతగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఈనెల 25న ఛలో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో వినూత్నంగా ప్లాన్ చేశాం. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవిగారు చీఫ్ గెస్ట్‌గా రానున్నారు. ఎంతో బిజీగా ఉన్నప్పటికీ మా ఫంక్షన్‌కి ఆయన వస్తున్నందుఉ చాలా హ్యాపీగా ఉన్నాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఫిబ్రవరి 2న మీ ముందుకు రాబోతున్నాం. ఈ చిత్రంలో నాగశౌర్య పెర్‌ఫార్మెన్స్ చాలా కొత్తగా, ఎనర్జిటిక్‌గా ఉంటుంది. తన కెరీర్లో ఇది పర్‌ఫెక్ట్ కమర్షియల్ మూవీగా నిలుస్తుందని మా నమ్మకం'' అన్నారు. రష్మిక మండన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నరేష్, పోసాని, రఘుబాబు, వెన్నెల కిషోర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, సినిమాటోగ్రఫీ: సాయి శ్రీరామ్.



• చిరంజీవి, నాగశౌర్య

మాస్ కృష్ణుడు

నాని..వరుస విజయాలతో తనకంటూ ఓ ఇమేజ్‌ను సంపాదించుకుంటున్న యువ కథానాయకుడు. ప్రస్తుతం నాని హీరోగా నటిస్తున్న చిత్రం 'కష్ణార్జున యుద్ధం'. సినిమా టైటిల్ పోస్టర్ విడుదలైనప్పటి నుండి సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. విభిన్నమైన క్యారెక్టరైజేషన్స్‌తో ఆకట్టుకుంటున్న నాని ఈ సినిమాలో రెండు పాత్రలు చేస్తుండటం విశేషం. మరి ఇందులో నాని లుక్స్ ఎలా ఉంటాయోనని క్యూరియాసిటీ క్రియేట్ అయ్యింది. అయితే సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రంలోని కృష్ణ పాత్రలో నాని ఎలా ఉండబోతున్నారనే దానికి సంబంధించిన లుక్ విడుదలైంది. కత్తులను తలపిస్తున్న కోరమీసాలు..పదునైన చూపులతో పక్కా మాస్ యాంగిల్‌లో నాని లుక్ ఉంది. వెంకట్ బోయనపల్లి సమర్పణలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకుడు. ఈ సినిమాకు సంబంధించిన ఫైనల్ షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌తో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. పోస్ట్ ప్రొడక్షన్ సహా అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి సినిమాను ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 12న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రానికి హిప్ హాప్ తమిళ సంగీతాన్ని అందిస్తుండగా, కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. నాని ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, రుక్సర్ మీర్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.



• నాని



• కళ్యాణ్‌రామ్

సమ్మర్‌లో సందడి చేయనున్న ఎం.ఎల్.ఎ.

నందమూరి కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్ జంటగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఎం.ఎల్.ఎ.'(మంచి లక్షణాలు ఉన్న అబ్బాయ్). టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్‌ఎల్‌పి, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎల్‌ఎల్‌పి పతాకాలపై సి.భరత్ చౌదరి, ఎం.వి.కిరణ్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తయింది. ఫిబ్రవరిలో జరిగే ఫారిన్ షెడ్యూల్‌లో పాటలను చిత్రీకరిస్తారు. దీంతో షూటిగ్ పూర్తవుతుంది. నిర్మాతలు ఈ చిత్రం గురించి మాట్లాడుతూ ''ఆద్యంతం వినోదభరితంగా సాగే ఈ చిత్రం హీరో కల్యాణ్‌రామ్ కెరీర్‌లో ఒక మంచి చిత్రమవుతుంది. మార్చిలో సమ్మర్ స్పెషల్‌గా ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు. దర్శకుడు ఉపేంద్ర మాధవ్ మాట్లాడుతూ ''కల్యాణ్‌రామ్ ఈ సినిమాలో కొత్త లుక్‌తో స్టైలిష్‌గా కనిపిస్తారు. ఈ సినిమాకి దర్శకత్వం వహించే అవకాశం ఇచ్చిన కల్యాణ్‌రామ్‌గారికి, నిర్మాతలకు నా కృతజ్ఞతలు'' అన్నారు. రవికిషన్, పోసాని, జయప్రకాశ్ రెడ్డి, అజయ్, వెన్నెల కిశోర్, పృథ్వీ, శివాజీ రాజా తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణి శర్మ, సినిమాటోగ్రఫీ: ప్రసాద్ మూరెళ్ళ, ఎడిటింగ్: తమ్మిరాజు.



• రెజీనా

నెగెటివ్ పాత్రలో రెజీనా

చెన్నై సొగసరి రెజీనా కసంద్ర ఇప్పుడు తెలుగులో 'అ!' సినిమాలో విభిన్నమైన పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాలో రెజీనా లుక్ విడుదలైనప్పుడు అందరూ చాలా ఆశ్చర్యపోయారు. ఒళ్లంతా టాటులతో రెజీనా చాలా కొత్తగా కనపడింది. కానీ ఆమె చేస్తున్న పాత్ర గురించి మాత్రం ఎక్కడా రివీల్ కాలేదు. సమాచారం ప్రకారం 'అ!' చిత్రంలో రెజీనా డ్రగ్స్‌కు బానిసైన అమ్మాయిగా కనపడుతుంది. ఈ పాత్రలో నెగటివ్ టచ్ కూడా ఉంటుంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను హీరో నాని నిర్మించారు. ఫిబ్రవరి 9న విడుదలవుతుంది. రెజీనాతో పాటు నిత్యామీనన్, కాజల్ అగర్వాల్, ఈషారెబ్బా, అవసరాల శ్రీనివాస్, మురళీశర్మ తదితరులు నటిస్తుండగా నాని, రవితేజ వాయిస్ ఓవర్ అందిస్తున్నారు.

అడివి శేష్ 'గూఢచారి' ఫస్ట్ లుక్

అడివి శేష్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'గూఢచారి' ఫస్ట్ లుక్‌ను సంక్రాంతి పండుగ సందర్భంగా ఈరోజు విడుదల చేశారు. 'క్షణం', 'అమీ తుమీ' వంటి సినిమాలతో అందర్నీ ఆకట్టుకున్న అడివి శేష్ స్పై థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. శశికిరణ్ తిక్క ఈ చిత్రానికి దర్శకుడు. ఓ మంచి కాన్సెప్ట్ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అడివి శేష్ గూఢచారిగా కనిపిస్తారు. అడివి శేష్ సరసన శోభిత ధూళిపాళ హీరోయిన్‌గా నటిస్తోంది. అభిషేక్ పిక్చర్స్, విస్టా డ్రీమ్ మిర్చంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వేసవిలో సమ్మర్ స్పెషల్‌గా ఈ చిత్రం విడుదలవుతుంది. ఈ చిత్రానికి కథ: అడివి శేష్, మాటలు: అబ్బూరి రవి, సంగీతం: శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: షానియల్ డియో.



• అడివి శేష్

సమంత మంచి మనసు

మూగ జీవాలను ఆపద సమయంలో ఆదుకునేందుకు అక్కినేని అమల స్థాపించిన బ్లూ క్రాస్ గత కొన్ని సంవత్సరాలుగా సేవలందిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా వివిధ కార్యక్రమాల ద్వారా అక్కినేని కుటుంబం సేవలందిస్తుంటారు. ఇప్పుడు వారి బాటలోనే కొత్త కోడలు సమంత కూడా నడుస్తోంది. పెళ్ళికి ముందే పలు సంస్థల సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న సమంతకు ఒక కొత్త ఆలోచన వచ్చింది. అదేమిటంటే.. తమ పెళ్ళికి వచ్చిన బహుమతులను వేలం వేయాలని. తద్వారా వచ్చే డబ్బుతో పేదలను, అనాథలను ఆదుకోవాలన్నది ఆమె ఆలోచన. ఈ విషయాన్ని భర్త నాగచైతన్య, అమల, నాగార్జునలకు చెప్పింది. సమంత తీసుకున్న నిర్ణయానికి వారంతా ఆనందాన్ని వ్యక్తం చేశారు. నాగచైతన్య, సమంత పెళ్ళికి వచ్చిన బహుమతుల్లో కొన్నింటిని వేలం వేయాలని నిర్ణయించుకున్నారు. దీనికి సంబంధించిన ప్రకటన త్వరలోనే వెలువడుతుందని తెలుస్తోంది.



• సమంత



• కైరా దత్

డార్క్ కామెడీ 'మిఠాయి'

డార్క్ కామెడీ నేపథ్యంలో రూపొందుతున్న కొత్త చిత్రం 'మిఠాయి'. రెడ్ యాంట్స్ బ్యానర్‌పై ప్రశాంత్ కుమార్ దర్శక నిర్మాణంలో సినిమా తెరకెక్కనుంది. ఆదివారం ఈ సినిమా హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా, క్రాంతిమాధవ్‌లు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలి సన్నివేశానికి విజయ్ దేవరకొండ క్లాప్ కొట్టారు. సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ ''ఈ సినిమా ద్వారా దర్శక నిర్మాతగా పరిచయమవుతున్న ప్రశాంత్ నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్. తెలుగులో డార్క్ కామెడీ నేపథ్యంలో చాలా గ్యాప్ తర్వాత చేస్తున్న సినిమా ఇది'' అని తెలిపారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ ''ఈ సినిమాకు పనిచేస్తున్న యూనిట్‌లో అందరూ నాకు 'పెళ్ళిచూపులు' నుండి పరిచయమే. ముఖ్యంగా ప్రశాంత్ నాకు మంచి ఫ్రెండ్. డార్క్ కామెడీ సినిమా అనగానే చాలా క్యూరియస్‌గా వెయిట్ చేస్తున్నాను'' అన్నారు. దర్శకుడు ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ – ''డార్క్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో తెలుగులో తక్కువ సినిమాలే వచ్చాయి. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుంది. మంచి టీంతో చేస్తున్న సినిమా'' అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శి, భూషణ్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆ ఛాన్స్ ఎవరూ ఇవ్వలేదు!

బూచాడే బూచాడే అంటూ అల్లు అర్జున్‌తో స్టెప్పులేసింది.. నందమూరి బాలకృష్ణతో పైసా వసూల్ అంటూ చిందులేసింది. ఇప్పుడు 'ఇగో' చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్‌లో కనువిందు చేయబోతోంది. ఆ ముద్దుగుమ్మ ఎవరో కాదు కైరా దత్. బాలీవుడ్‌లో కొన్ని క్యారెక్టర్స్ చేసినా రాని గుర్తింపు టాలీవుడ్‌లో తను చేసిన ఐటమ్ సాంగ్స్‌తో వచ్చిందని సంతోషంగా చెప్తోంది. తన డాన్స్ వల్లే అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి అంటోంది. టాలీవుడ్ హీరోల గురించి చెప్తూ.. అల్లు అర్జున్‌తో సమానంగా డాన్స్ చేయడం చాలా కష్టం అనిపించింది. బాలకృష్ణగారు ఆ వయసులో కూడా అంత హుషారుగా స్టెప్స్ వెయ్యడం చూస్తే ఆశ్చర్యం కలుగుతుందంటోందీ భామ. నటన తర్వాత తనకిష్టమైన వ్యాపకం సంగీతం అని చెప్తున్న కైరా పాటలు కూడా రాస్తుందట. అలాగే పాటలు కూడా పాడుతుందట. తన గొంతు వినిపించాలని తెగ ఉబలాటపడుతున్న ఈ అమ్మడికి ఆ ఛాన్స్ ఎవరూ ఇవ్వడం లేదని వాపోతోంది.



• రాఘవ లారెన్స్




• విజయేంద్ర ప్రసాద్

లారెన్స్ హీరోగా ద్విభాషా చిత్రం

డాన్స్ మాస్టర్, నటుడు, నిర్మాత, దర్శకుడైన రాఘవ లారెన్స్ త్వరలోనే ఓ ద్విభాషా చిత్రంలో నటించబోతున్నారు. వివరాల్లోకెళ్తే.. 'బాహుబలి' వంటి భారీ చిత్రానికి కథను అందించిన రచయిత విజయేంద్ర ప్రసాద్. ఈయన రాజమౌళి సినిమాలకే కాకుండా..బయటి దర్శకుల చిత్రాలకు కూడా కథను అందిస్తుంటారు. ఇప్పుడు మరోసారి విజయేంద్రప్రసాద్ బయటి బ్యానర్‌లో ఓ సినిమాకు కథను అందిస్తున్నారు. ఈ చిత్రానికి మహదేవ్ దర్శకుడు. కేమియో ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సినిమా నిర్మితమవుతుంది. తమిళంలో ఈ సినిమాకు మదన్ కర్కే మాటలను అందిస్తారు. ఏప్రిల్ నుండి సినిమా సెట్స్ పైకి వెళుతుంది. ఇటీవల విజయ్ హీరోగా నటించిన 'మెర్సల్' (తెలుగులో 'అదిరింది') సినిమాకు కూడా విజయేంద్ర ప్రసాద్ కథను అందించారు మరి.


నెల్లూరు జిల్లా వెంకటాచలంలో భోగి మంటల వేడుకల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


విజయవాడ కృష్ణలంకలో 1.25 లక్షల ఆవు పిడకలతో భోగి మంటలు వేస్తున్న మంత్రి మాణిక్యాలరావు


విజయవాడ దుర్గగుడి సంక్రాంతి సంబరాల్లో గంగిరెద్దుల విన్యాసం



'దుర్గగుడి' ప్రక్షాళన షురూ

- **ఇన్‌చార్జి ఈవో అనూరాధ కీలక నిర్ణయాలు**

విజయవాడ (ఇంద్రకీలాద్రి), జనవరి 14 (మనం న్యూస్): విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రక్షాళన ప్రారంభమైంది. దుర్గగుడి ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ శాఖ కమిషనర్ వై.అనూరాధ బాధ్యతలు చేపట్టాక కీలక నిర్ణయాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధాన అర్చకులను ఆమె బదిలీ చేశారు. దుర్గగుడి ప్రధాన అర్చకుడిగా సుందరశర్మను నియమించారు. దుర్గగుడిలో తాంత్రిక పూజలు చేశారని దుమారం రేగడం, ఇందులో పాత ఈవో సూర్యకుమారి పాత్రపై ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. కాగా ఏం జరిగిందన్నది ఇంకా తెలియక పోయినా పాత ఈవోకు సలహా మండలిగా ఉన్న కనకదుర్గ ధర్మ ప్రచార పరిషత్‌ను అనూరాధ రద్దు చేశారు. ఈ ధర్మ ప్రచార పరిషత్ ఏడాది క్రితం ఏర్పాటైంది. దీనికి ప్రధాన సలహాదారుగా ఉన్న వేదాంతం రాజగోపాల చక్రవర్తి వైష్ణవులు పనిచేశారు. ఆగమనానికి ఏమాత్రం సంబంధం లేకపోయినా రాజకీయ పెద్దల ఒత్తిడితో ఆయన నేతృత్వంలో ఈ ప్రచార పరిషత్ ఏర్పడింది. ప్రభుత్వమే దీన్ని ఏర్పాటు చేయడంతో అప్పటి ఈవో సూర్యకుమారి అడ్డు చెప్పలేదు. పైగా ఆయన సలహాలే ఆమె పాటిస్తూ వచ్చారని ఆలయ వర్గాలు భావించాయి. ఆగమం తెలియనివారి సలహాలనే ఆమె పాటించేవారని, రాజగోపాల చక్రవర్తి సలహాతోనే గుడికి వెళ్లే ఘాట్‌రోడ్ గోశాలలో దుర్గాపూజ విధానానికి సంబంధం లేని పూజలు జరిగాయని విమర్శలు వచ్చాయి. ఇక కొన్ని విషయాల్లో సూర్యకుమారికి, దేవాలయ అర్చక సంఘాలకు మధ్య అగాధం ఏర్పడింది. గతంలో వచ్చిన విమర్శలు, ఆరోపణలపై ఇన్‌చార్జి ఈవో దృష్టిసారిస్తున్నారు. ప్రక్షాళన దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు.

ఏపీ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లు

విజయవాడ (రైల్వేస్టేషన్), జనవరి 14 (మనం న్యూస్): సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎం.ఉమాశంకర్ కుమార్ తెలిపారు. కాకినాడ-సికింద్రాబాద్ (సువిధ స్పెషల్), నరసాపూర్-హైదరాబాద్(ప్రత్యేక రైలు) సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు.

కాకినాడ- సికింద్రాబాద్ సువిధ స్పెషల్

ఈ నెల 17వ తేదీ రాత్రి 10:30 గంటలకు కాకినాడలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9:45 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్ల మీదుగా సికింద్రాబాద్ చేరుతుంది.

నరసాపూర్-హైదరాబాద్ ప్రత్యేక రైలు

ఈ నెల 16వ తేదీ రాత్రి 7:30 గంటలకు నరసాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9:45 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. పాలకొల్లు, భీమవరం, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, పిడుగురాళ్ల, మిరియాలగూడ, నల్గొండ స్టేషన్ల మీదుగా హైదరాబాద్ చేరుతుంది.

మత్స్యకారుల ఉద్యమం ఉధృతం

- **ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్**
- **ఉత్తరాంధ్రలో నెలరోజులుగా ఆందోళన**

విశాఖపట్నం, జనవరి 14 (మనం న్యూస్ బ్యూరో): మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలన్న డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్రలో ప్రారంభమైన ఉద్యమం రోజురోజుకూ ఉధృతమవుతోంది. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో మత్స్యకారులు నెల రోజులుగా ధర్నాలు చేస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మత్స్యకారులు తమ డిమాండ్‌ను లేవనెత్తారు. బోయల మాదిరిగా తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నిత్యం సముద్రంపై జీవించే తమనూ ఎస్టీలుగా గుర్తించాలంటూ మత్స్యకార ఎస్టీ సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమిస్తున్నారు. జన్మభూమి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇటీవల ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును మత్స్యకార ప్రతినిధులు స్వయంగా కలసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. తమను ఎస్టీ జాబితాలో చేర్చి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కాగా ముఖ్యమంత్రి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు ఎక్కి ఆందోళనలు చేస్తే తాను ఏ సమస్యనూ పరిష్కరించనని, ఏ సమస్య ఎప్పుడు పరిష్కరించాలో తనకు తెలుసని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తుంటే ముఖ్యమంత్రి బెదిరించడమేమిటని మత్స్యకారులు మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి బెదిరింపులతో ఒక్కసారిగా వారిలో పట్టుదల మరింత పెరిగింది. మత్స్యకార సంఘాలన్నీ సమావేశమై ఈ సమస్యపై దీర్ఘకాలిక ఉద్యమానికి సిద్ధం కావాలని నిర్ణయించాయి. దీంతో శ్రీకాకుళం, విశాఖపట్నంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. వీరి ఉద్యమానికి మొదటి నుంచి వైసీపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మద్దతునిస్తూ వచ్చాయి. ఇప్పుడు వైసీపీ కీలకమైన పాత్ర తీసుకొని ఉద్యమాన్ని కొనసాగిస్తోంది. వివిధ జిల్లాలకు చెందిన మత్స్యకార నేతలను దీక్షల శిబిరాలకు రప్పిస్తున్నారు. దీక్షలకు మద్దతుగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు కూడా మొదట్లో ఈ ఉద్యమానికి మద్దతు తెలిపి దీక్షల్లో పాల్గొన్నా.. ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేసిన తర్వాత కాస్త వెనక్కి తగ్గారు.

ఆహ్లాదం కాదు.. అవినీతిమయం!

అక్రమ దందాల అడ్డాగా ఏపీటీడీసీ.. కీలక విభాగాల్లో కన్సల్టెంట్ల రాజ్యం

- **సంస్థకు గండి.. స్వలాభానికి పెద్దపీట**
- **మామూళ్ల మత్తులో విజిలెన్స్ విభాగం**
- **రాష్ట్ర విభజన తర్వాత కానరాని ఆడిట్**
- **'పాత' అధికారులకూ సంస్థ సేవలు**
- **నష్టాల దిశగా పర్యాటక సంస్థ**
- **సర్కార్ ఆశలు అడియాసలు!**

అమరావతి, జనవరి 14 (మనం ప్రతినిధి): అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర పర్యాటకాన్ని తీర్చిదిద్దాలన్నది సర్కారు సంకల్పం.. కానీ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారులు మాత్రం ఆ లక్ష్యానికి నీళ్లు వదిలేస్తున్నారు. స్వలాభం కోసం సంస్థకు గండికొడుతూ.. సర్కారు ఆశలను అడియాసలు చేస్తున్నారు. ఆహ్లాదాన్ని పంచాల్సిన సంస్థలో అన్ని విభాగాలు అవినీతిమయమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏపీటీడీసీ ఆర్థిక విభాగం మొదలు అన్ని కీలక విధుల్లో కన్సల్టెంట్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఉన్నారు. దీంతో వారు సంస్థ లాభాల కన్నా తమ జేబులు నింపుకోవడంపైనే ఎక్కువ దృష్టిపెడుతున్నారు. అధికారుల చేతివాటంతో ఏపీటీడీసీ నష్టాల దిశగా పయనిస్తోంది. హరిత హోటల్స్, బోట్లు, బస్సుల ద్వారా అధిక ఆదాయం వస్తుండగా.. అందులో చాలా వరకు పక్కదారి పడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులకు భారీగా ముడుపులు అందుతుంటే.. సంస్థలోని అవినీతిపై ఓ కన్ను వేసే అంతర్గత విజిలెన్స్ విభాగం చోద్యం చూస్తోంది. ఈ విభాగంలోనూ కాంట్రాక్టు అధికారులే ఎక్కువగా ఉండటంతో అక్రమార్కులు తేలికగా మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

'హరిత' హోటల్స్‌లో అవినీతి

కొత్త రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని విస్తృతం చేయడానికి ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోంది. దీన్ని ఏపీటీడీసీ అధికారులు సాకుగా తీసుకుంటున్నారు. పర్యాటక సంస్థ రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి చేసిన హరిత హోటళ్లలో అడుగడుగునా.. అవినీతి రాజ్యమేలుతోంది. హోటల్స్‌లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో కింది స్థాయిలోని అధికారులుఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. హోటళ్లలో దినసరి వేతనాలపై పనిచేసే ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని అందించే ఏజెన్సీలతో లింకులు పెట్టుకుని అధికారులు ప్రతినెలా లక్షల రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని సమాచారం. వాస్తవానికి హోటల్స్‌లో డిమాండ్ లేని రోజుల్లో (అన్‌సీజన్‌లో) ఇద్దరు, ముగ్గురు సిబ్బందితో సరిపెట్టేయవచ్చు. కానీ ఏజెన్సీలతో కుమ్మక్కై అన్‌సీజన్‌లో కూడా ఉద్యోగుల సంఖ్యను పెంచుతున్నారు. ఇక హోటళ్లలో ఆహార వస్తువుల క్రయవిక్రయాలు, కాయగూరల కొనుగోళ్లలో కూడా భారీ ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో కొన్ని చోట్ల రిసార్ట్స్‌లో నైట్ పార్టీలు జరుగుతుంటాయి. వసతి కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే విధానాన్ని మరుగున పడేసిన సిబ్బంది.. నేరుగా అక్కడికి వచ్చేవారితో బేరాలకు దిగుతున్నారు. ''మీరు పార్టీ చేసుకోవాలంటే ఫుడ్, సర్వీస్ కలిపి రూ.25వేలు అవుతుంది. అదే మీకు బిల్లు వద్దు అనుకుంటే రూ. 20 వేలు అవుతుంది. మా సార్ బాగా స్ట్రిక్ట్. కానీ మీ కోసం నేను మాట్లాడతా'' అని అక్కడ ఉన్న దినసరి వేతన సిబ్బంది డీల్ మాట్లాడతారు. ఒకవేళ ఏదైనా వ్యవహారం బెడిసి కొడితే సిబ్బందిపై నెట్టేసి అధికారులు తప్పుకొంటున్నారని వినికిడి.

నకిలీ బిల్లులతో దోపిడీ

ఏపీ టూరిజం బస్సుల రిపేర్ల పేరిట, డీజిల్ వినియోగంలోనూ అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో తక్కువ డీజిల్‌ను నింపి రికార్డుల్లో మాత్రం ఎక్కువ నింపినట్లు నమోదు చేస్తున్నట్లు కొంత మంది డ్రైవర్లు ఫిర్యాదు చేస్తున్నారు. పొదుపుగా డీజిల్‌ను(కేఎంపీఎల్ పెంపు) వినియోగించడం లేదని డ్రైవర్ల వేతనాలపై కోతలు విధిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులకు కారును, డ్రైవరును సమకూర్చినా అదనపు చార్జీల పేరిట ప్రతి నెలా లక్షలాది రూపాయిల బిల్లులు సమర్పించినట్లు తెలిసింది. ఏళ్ల తరబడి బదిలీలు లేకుండా ఒకే ప్రాంతంలో పాతుకుపోయిన కిందస్థాయి అధికారులు, ఉన్నతాధికారులను మెప్పించి ఇష్టం వచ్చినట్లు నకిలీ బిల్లులను సృష్టించి రూ.లక్షల్లో సంస్థ సొమ్ము కాజేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు సంస్థలో పనిచేసి ఇతర శాఖలకు బదిలీ అయిన అధికారులకూ ఏపీటీడీసీ సేవలు అందిస్తూనే ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ పర్యాటక సంస్థలో కీలక పదవులు అనుభవించిన పాత అధికారులందరికీ సంస్థ తనకు చేతనైనంత సాయం చేస్తోంది. వారికి ఒక్కొక్కరికీ కారు, డీజిల్, ఇద్దరు డ్రైవర్లు, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్, వాళ్ల ఇళ్లలో పని మనుషులను కార్పొరేషన్ సరఫరా చేస్తోంది. వారందరికీ నెలానెలా జీతాలు చెల్లిస్తోంది. వారి ఇళ్ల అద్దెలు, డీజిల్ కూడా కార్పొరేషనే అందిస్తోంది.

విజిలెన్స్ విభాగం ఏదీ?

ఏపీ టూరిజంలో భారీగా నిధులు దుర్వినియోగం అవుతున్నా ఆర్థిక లావాదేవీలు ఏ రోజుకారోజు పరిశీలించాల్సిన అధికారులు బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉంటే ఏపీటీడీసీకి మంచి ఆదాయం వస్తుంది. ఏపీటీడీసీలో గతంలో పనిచేసి ఇప్పుడు సంస్థలో ఒకటి కన్నా ఎక్కువ పదవులు అనుభవిస్తున్న అధికారులే విజిలెన్స్ విభాగాన్ని బలహీనంగా మార్చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. విజిలెన్స్‌లో ఇద్దరు ఉద్యోగులు మాత్రమే పని చేస్తుండగా.. వారూ కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన వారే. తనిఖీల విషయంలో స్వంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం కూడా వీరికి లేదు. ఎలాంటి నిర్ణయం తీసుకున్నా 'ఈడీ'కి సమాచారం అందించిన తర్వాత.. ఆయన సూచనలకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. మెరుపుదాడులు చేసే పరిస్థితి కూడా లేదు. దీంతో ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు సంస్థను పూర్తిగా వినియోగించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక ఏపీటీడీసీలో కీలకమైన ఫైనాన్స్ విభాగం కూడా కన్సల్టెంట్లతో కాలం గడుపుతోంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఏపీటీడీసీకి సుమారు 75 యూనిట్లు ఉండగా.. వాటి మేనేజర్ నుంచి కింది స్థాయి సిబ్బంది సహా అంతా ఎక్కువ భాగం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఉన్నాయి. దీంతో వారంతా సంస్థ అభివృద్ధి మాట గాలికొదిలేసి.. స్వలాభానికే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వీరందరినీ గాడిలో పెట్టాల్సిన విజిలెన్స్ విభాగం అధికారులూ మామూళ్ల మత్తులో జోగుతున్నారు. రాష్ట్ర విభజన జరిగి తెలంగాణ నుంచి ఏపీటీడీసీ విడిపోయినప్పటి నుంచి ఒక్కసారి కూడా ఆడిట్ జరగలేదంటే.. కార్పొరేషన్ పరిస్థితి ఏమిటో అర్థమవుతోంది. దీనితో ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడంతో అధికారులకు నచ్చిన వారిని, బంధువులను సరైన డిగ్రీలు లేకుండానే తీసుకొచ్చి కీలకమైన పోస్టుల్లో కూర్చొబెట్టుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దాదాపు వెయ్యి కోట్ల రూపాయిల విలువైన హోటళ్లు, రిసార్ట్స్ ఉన్న కార్పొరేషన్ దోచుకునేవారికి కల్పవృక్షంగా మారిందని పలువురు విమర్శిసున్నారు.

Andhra Pradesh
TOURISM
everything's possible!
aptdc

ఉద్దేశపూర్వకంగానే బలహీనం

లాభాల బాటలో నడుస్తున్న పర్యాటక సంస్థ క్యాంటీన్‌లో భాగస్వామ్య ప్రాతిపదికన నడుస్తున్న కౌంటర్లను మూసేసి, కమీషన్ల కోసం సంస్థకు సంబంధించిన ఒక ఉన్నతాధికారి, వేరే వాళ్లకు కట్టబెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సొంత ఆదాయం సమకూర్చుకోవటానికి కావాలనే లాభాల బాటలో నడుస్తున్న క్యాంటీన్లను నష్టాల బాట పట్టించేందుకు కంకణం కట్టుకున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి.

అలంకారప్రాయంగా టూరిజం బోర్డు

పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్న ఆకాంక్షతో సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండున్నరేళ్లు ఆ శాఖను తన వద్దే ఉంచుకున్నారు. ఆయన ప్రత్యేక దృష్టితో చూస్తున్న పర్యాటక సంస్థ బోర్డు చైర్మన్ పోస్టు దక్కింకోవటానికి చాలా మంది విశ్రాంత ఐఏఎస్ అధికారులు, అవిశ్రాతంగా ప్రయత్నించారు. తనకు చిరకాల మిత్రుడు, నమ్మకస్తుడు, పార్టీకి ఏన్నో ఏళ్లుగా సేవలందించిన ప్రొపెసర్ జయరామిరెడ్డికి ఆ బాధ్యతను సీఎం అప్పజెప్పారు. బోర్డు చైర్మన్‌తో పాటు ఆయా రంగాల్లో నిష్ణాతులను బోర్డు సభ్యులుగా నియమించారు. కానీ టూరిజం బోర్డు అలంకార ప్రాయంగా మారిందన్న విమర్శలు ఎక్కువయ్యాయి. సంస్థలో కళ్లముందే అవతవకలు జరుగుతున్నా, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో బోర్డు ఉన్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే బోర్డు కన్నా.. సంస్థలో ఎండీ(ఐఏఎస్) అధికారి తీసుకునే నిర్ణయమే అంతిమం. దాన్ని కాదని బోర్డు ఏమీ చేయలని పరిస్థితి నెలకొంది. దీనితో సంస్థకు ఏదైనా చేయాలని ఉన్నా..తమ స్థాయిలో ఏమీ చేయలేమని బోర్డు సభ్యులు సర్దుకుపోతున్నారు. పర్యాటక శాఖలో ప్రస్తుతం జరుగు తున్న అక్రమాలపై ఇక సీఎం కల్పించుకుంటేనే కానీ అడ్డుకట్ట పడదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

చంద్రగిరిలో జగన్ పాదయాత్ర

- **62వ రోజు ప్రజా సంకల్పయాత్ర**



చిత్తూరు, జనవరి 14: చిత్తూరు జిల్లాలో వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్ర కొనసాగుతోంది. యాత్రలో 62వ రోజు ఆదివారం చంద్రగిరి నియోజకవర్గంలోని నెన్నూరు నుంచి జగన్ పాదయాత్ర ప్రారంభించారు. నన్నేరు, శెట్టివారిపల్లి క్రాస్, కట్టకింద వెంకటాపురం చేరుకుని పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వెంకటాపురం క్రాస్, చల్లావారిపల్లి మీదుగా సొరకాయలపాలెం క్రాస్, మతురుపల్లి, పులిగుంట్ల, కమ్మలపల్లి క్రాస్ చేరుకున్నారు. అక్కడి నుంచి దేసురివారి కండ్రిగ, రావిళ్లవారిపల్లి మీదుగా పరకల్వ క్రాస్ వరకు పాదయాత్ర కొనసాగించారు. దారిపొడవునా జగన్ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు.

పండుగ రోజు విషాదం

- **లారీని ఇన్నోవా ఢీకొని నలుగురి మృతి**
- **నెల్లూరు జాతీయ రహదారిపై ప్రమాదం**



నెల్లూరు (క్రైం), జనవరి 14 (మనం న్యూస్): నెల్లూరు జిల్లాలో భోగి రోజు విషాదం చోటు చేసుకుంది. ఆదివారం నెల్లూరు జాతీయ రహదారిపై ఆగిన ఉన్న లారీని ఇన్నోవా వాహనం ఢీకొనడంతో నలుగురు మరణించారు. ప్రమాదానికి పొగమంచు కారణమని భావిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. తోటపల్లి గూడూరు వెంకన్నపాళెంకు చెందిన ఆరుగురు ఇన్నోవాలో నాగపట్నం బయల్దేరారు. నెల్లూరు ఎన్టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఇన్నోవా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రుడిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

జోరుగా జల్లికట్టు!



- **తమిళనాట సాహసక్రీడ**
- **అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు**

చెన్నై, జనవరి 14: తమిళనాట పొంగల్ సంబరాల్లో యువత హుషారుగా పాల్గొంటోంది. ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే సాహస క్రీడ జల్లికట్టులో తమ సాహసాన్ని చాటేందుకు యువకులు ముందుకు దూకుతున్నారు. వేగంగా దూసుకువచ్చే ఎద్దుల నిలువరించి లొంగదీసుకునేందుకు తమ భుజబలాన్ని చాటుకుంటున్నారు. మధురైలోని అవనియపురంలో జల్లికట్టు వేడుకల్లో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోటాపోటీగా యువకులు తమ సాహసాన్ని ప్రదర్శిస్తూ ఎద్దులను లొంగదీస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ జల్లికట్టు ఉత్సవంలా జరుగుతోంది. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ముందుగా రిజిస్టర్ చేసుకున్న వారిని మాత్రమే బరిలోకి అనుమతిస్తున్నారు.

పోరాడి సాధించుకున్న యువత

ఈ సాహస క్రీడను జంతు హక్కుల పరిరక్షణ కార్యకర్తలు ఏళ్లుగా వ్యతిరేకిస్తున్నారు. జంతువులపై క్రూరంగా దాడి చేస్తున్నారని, ఈ క్రీడలో ఎద్దులతోపాటు యువకులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన లు చేశారు. కోర్టుల్లో పోరాడి 2015లో జల్లికట్టు క్రీడపై నిషేధం విధించేలా చేశారు. అయితే జల్లికట్టు క్రీడ సంప్రదాయంగా వస్తోందని, దీన్ని ఎవరూ అడ్డుకోలేరం టూ తమిళ యువత భారీ ఉద్యమానికి తెరతీసింది. సామాజిక మాధ్యమాలే సంధానకర్తలుగా యువత ఏకమై నిరసనలకు దిగడంతో 2017 2017 జనవరి 23న తమిళనాడు అసెంబ్లీలో జల్లికట్టుకు అనుకూలంగా తీర్మానం చేసింది. దీంతో ఈ ఏడాది జల్లికట్టు నిర్వహణను పర్యవేక్షించేందుకు ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 20 మార్గదర్శకాలను సూచిస్తూ అందుకు లోబడి జల్లికట్టు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దీని ప్రకారం ఎద్దులు పోటీలో దిగే ముందు వాటికి సామర్థ్య పరీక్షలు చేస్తారు. అలాగే జల్లికట్టు జరిగే రోజుకు వాటికి తప్పనిసరిగా బీమా చేయించాలని కమిటీ పేర్కొంది. ఈ నిబంధనలను అనుసరించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జల్లికట్టు జరిగేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

విమానాశ్రయాల అభివృద్ధికి జాతీయ వ్యూహం

భారతీయ విమానపత్తన ప్రాధికరణ
AIRPORTS AUTHORITY OF INDIA

న్యూఢిల్లీ: దేశంలో పలు విమానాశ్రయాల అభివృద్ధికి, విస్తరణకు జాతీయ వ్యూహాన్ని రూపొందించాలని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) భావిస్తోంది. ఈ సంస్థ ఛైర్మన్ గురుప్రసాద్ మొహాపాత్రా ఈ సంగతి చెబుతూ, 2018-19లో విమాన ప్రయాణికుల సంఖ్య 32.20 కోట్లు దాటే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని, విమానాశ్రయాల అభివృద్ధికి, విస్తరణకు, వసతుల మెరుగుదలకు, మోడల్ రాయితీల ఒప్పందాలకు జాతీయ వ్యూహాన్ని రూపొందించాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది 14 ప్రాంతాల్లో 14 భారీ టెర్మినల్ భవనాల నిర్మాణానికి మెగా ప్రాజెక్టులు రూపొందించామని, వీటితో పాటే భారీగా విస్తరణ కూడా చేపట్టబోతున్నామని ఆయన తెలిపారు. ఈ విషయంలో ఏఏఐ ఇప్పటికే ఓ స్ట్రాటెజీ కన్సల్టెంట్ కోసం ప్రయత్నాలు సాగిస్తోంది. ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరిగిపోతుండడం, వసతులను విస్తరించాల్సి ఉండడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని అందుకు తగ్గట్టుగా ఆదాయ వనరులను పెంచుకోవడానికి ఏఏఐ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుడు ప్రయాణికుల సంఖ్య 17 కోట్లు దాటగా అంతకు ముందు సంవత్సరం అది సుమారు 15 కోట్ల వరకూ ఉందని మొహాపాత్రా వివరించారు.

ఏఏఐ ఈ ఏడాది చేపట్టబోతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలియజేస్తూ ఆయన, దేశంలో ఐదు ప్రాంతాలలో విమానాశ్రయాలు, టెర్మినల్ భవనాలు సిద్ధం కాబోతున్నట్టు చెప్పారు. అవి: ఒడిశాలోని జార్సుగూడ, అరుణాచల్ ప్రదేశ్‌లోని తేజూ, కేరళలోని కాలికట్, ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, సిక్కింలోని పాక్యాంగ్. కాగా, కొత్త టెర్మినల్ భవనాల నిర్మాణానికి సంబంధించిన మెగా ప్రాజెక్టులు గువాహటి, లే, పాట్నా, విజయవాడ, జబల్‌పూర్, అహ్మదాబాద్, చెన్నై, శ్రీనగర్, పుణే, లక్నో, మంగళూరు, డెహ్రాడూన్, జైపూర్‌లలో ప్రారంభం కాబోతున్నాయని ఆయన తెలిపారు. వివిధ నగరాలు, పట్టణాల్లో కొత్తగా విమానాశ్రయాలు, విమానాల రాకపోకలు ప్రారంభించడం మీద కూడా ఈ ఏడాది ప్రత్యేక దృష్టి పెట్టబోతున్నామని, రీజియనల్ కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యం ఇవ్వబోతున్నామని ఆయన తెలియజేశారు.

బిట్ కాయిన్‌కు పోటీగా జియో కాయిన్!



ముంబై: దేశీయ టెలికామ్ రంగం లో అత్యంత చవకైన ప్లాన్లతో దిగ్గజాలను మట్టికరిపించిన రిలయన్స్ జియో భారీ కొండనే ఢీకొట్ట బోతుందనే వార్తలు ఇప్పుడు సోషల్ మీడియాలో షికార్లు చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపిన బిట్ కాయిన్ తరహాలో ముఖేష్ అంబానీ జియో కాయిన్ పేరిట తన సొంత క్రిప్టోకరెన్సీని సృష్టించే దిశగా అడుగులు వేస్తున్నారని సోషల్ మీడియాలో కథనాలు వినిపిస్తున్నాయి. అయితే దీన్ని జియో అధికారికంగా ధృవీకరించనప్పటికీ భవిష్యత్‌లో ఇది జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

లైవ్‌మింట్ రిపోర్టు ప్రకారం, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ జియో కాయిన్ పేరిట మార్కెట్లోకి తన సొంత క్రిప్టోకరెన్సీని సృష్టించేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నట్లుగా తెలుస్తోంది. దీనికి ముఖేష్ పెద్ద కొడుకు ఆకాశ్ అంబానీ సారథ్యం వహిస్తున్నట్లుగా ఆ రిపోర్టు తెలిపింది. మొత్తం 50 మంది యువకులతో కూడిన టీమ్ జియో కాయిన్ మీద కసరత్తులు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. వీరంతా క్రిప్టోకరెన్సీ రూపకల్పన, దాని విక్రయం వంటి అన్ని అంశాలను పరిశీలిస్తూ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వైపు శరవేగంగా అడుగులు వేసేం దుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారనే తెలుస్తోంది. కాగా వీటిల్లో పెట్టుబడులకు పెట్టుబడిదారులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తుండడంతో ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ కూడా ఈ వ్యాపారంపై కన్నేసినట్టు లైవ్‌మింట్ పేర్కొంది. అయితే, క్రిప్టోకరెన్సీలో పెట్టబడుల కు కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అనుమతి ఇవ్వలేదు. ఇది చట్టవిరుద్ధమైన కరెన్సీగా ఇప్పటికే స్పష్టం చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఇందులో పెట్టుబడులు పెట్టరాదని పెట్టుబడిదారులను హెచ్చరించా రు. బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీల్లో పెట్టుబడుల కు గ్యారెంటీ ఉండదని స్పష్టం చేశారు. వీటిల్లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని, దీనికి చట్టబద్ధత లేదని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ఈ జియో కాయిన్ విషయంపై రిలయన్స్ నుంచి ఇప్పటిదాకా ఎటువంటి అధికారిక సమాచారం వెలువడలేదు. కేవలం లైవ్‌మింట్ మాత్రమే దీనిని రిపోర్ట్ చేసింది. మరి ఇందులో నిజమెంత అన్నది జియో స్వయంగా ప్రకటించేవరకు తెలియదు.

అమెజాన్‌లో 6,500 ఉద్యోగాలు!

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం ఈ నెల ఆఖరు వారంలో జరగబోయే తన భారీ అమ్మకాల కోసం 6,500 ఉద్యోగాలను సృష్టించబోతోంది. ఈ నెల 20 నుంచి 24 వరకూ అది భారీ అమ్మకాల కార్యక్రమం చేపడుతోంది. ఇందులో 5,500కు పైగా ఉద్యోగాలు ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్స్, సార్టేషన్ సెంటర్స్, డెలివరీ కేంద్రాలలో ఏర్పడబోతున్నాయి. అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్



అఖిల్ సక్సేనా ఈ సంగతి చెప్పారు. ఈ అమ్మకాల సమయంలో భారీ విక్రయాలను అంచనా వేసి ఉన్నత స్థాయి కస్టమర్ల కోసం తన కస్టమర్ సర్వీస్ కేంద్రాలలో మరో వెయ్యి ఉద్యోగాలను సృష్టించబోతున్నట్టు కూడా ఆయన చెప్పారు. ఈ కొత్త ఉద్యోగులు మా విక్రయాలు పెరగడానికి, కస్టమర్లకు సకాలంలో సరైన సేవలు అందించడానికి సహాయం చేస్తారని ఆయన తెలిపారు. బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో భారీగా ఉద్యోగుల నియామకాలు జరపబోతున్నట్టు కూడా ఆయన తెలియజేశారు.



'శత్రు' ఆస్తుల అమ్మకానికి సిద్ధం!



న్యూఢిల్లీ: శత్రువులకు చెందిన 9,400 ఆస్తుల అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హోం మంత్రిత్వ శాఖ ఈ ఆస్తులను గుర్తించే పనిలో పూర్తిగా నిమగ్నం అయింది. ఈ ఆస్తుల విలువ లక్ష కోట్ల రూపాయలకు పైగా ఉండొచ్చని అంచనా. పాకిస్థాన్, చైనాలలో పౌరసత్వం తీసుకుని ఆ దేశాలకు వెళ్లిపోయినవారి ఆస్తులివి. దేశ విభజన, ఆ తరువాత పాకిస్థాన్, చైనాలకు వెళ్లిపోయినవారు భారతదేశంలో వదిలిన ఆస్తుల మీద వారి కి ఎటువంటి హక్కులూ వర్తించకుండా 49 ఏళ్ల శత్రు ఆస్తుల (సవరణ, మదింపు) చట్టంలో ప్రభుత్వం సవరణ తీసుకు వచ్చిన తర్వాత ప్రభుత్వానికి ఈ ఆస్తులను స్వాధీనం చే సుకోవడానికి వీలైంది. సు మారు 6,289 ఆస్తులపై సర్వే పూర్తయిందని, కొందరి సంరక్షణ లో ఉన్న మి గిలిన 2,991 ఆస్తులపై కూ డా త్వరలో సర్వే పూర్తవుతుందని ఇటీవల ఓ సమావేశం లో హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు అధికారులు తెలియజేశారు.



ఈ ఆస్తులను విక్రయిస్తే ప్రభుత్వానికి సుమారు లక్ష కోట్ల రూపాయల మేరకు జమ అవుతుందని అధికారులు వివరించారు. పాకిస్థాన్‌లో ఉన్న భారతీయుల ఆస్తులను కూడా ఆ దేశం ఇదే విధంగా విక్రయించి ప్రభుత్వ ఖజానాలో జమ చేసింది. భారతదేశ ంలో ఉన్న పాకిస్థానీల ఆస్తులను గుర్తించి, విలువ మదింపు చేయడానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాయి. పాకిస్థాన్ దేశస్థులు సుమారు 9280 ఆస్తులను ఇక్కడ వదిలిపెట్టి వెళ్లారు. అందులో 4991 ఆస్తులు ఉత్తర ప్రదేశ్‌లోనే ఉన్నాయి. మిగిలిన 2735 ఆస్తులు (ఎస్టేట్లు) పశ్చిమ బెంగాల్‌లో ఉన్నట్టు ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. చైనీయులు మాత్రం 126 ఆస్తులను వదిలివెళ్లారు. ఇవన్నీ ఈశాన్య రాష్ట్రాలలో ఉన్నాయి. 1965లో భారత, పాకిస్థాన్ యుద్ధం తర్వాత 1968లో ఈ చట్టాన్ని సవరించారు. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఉన్న తన ఆస్తులను నిర్వహించుకోవడానికి, విక్రయించుకోవడానికి తనకు హక్కులు కల్పించాలని కోరుతూ రాజా మొహమ్మద్ అమీర్ మొహమ్మద్ ఖాన్ అనే వ్యక్తి కోర్టుకెక్కినప్పుడు ప్రభుత్వం ఈ శత్రు ఆస్తుల చట్టాన్ని సవరించింది.

మొదటిసారి రోడ్డెక్కిన 2018 మారుతి స్విఫ్ట్



న్యూఢిల్లీ: మారుతి సుజుకి మూడవ తరానికి చెందిన స్విఫ్ట్ హ్యాచ్‌బ్యాక్ కారును లాంచ్ చేయడానికి ఏర్పాట్లు సిద్ధం చేసుకుంది. డిజైన్, టెక్నాలజీ పరంగా 2018 మారుతి స్విఫ్ట్‌లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి.

ఫిబ్రవరిలో ఢిల్లీ వేదికగా జరగనున్న 2018 ఇండియన్ ఆటో ఎక్స్-పో వేదిక మీద మారుతి సుజుకి తమ కొత్త తరం స్విఫ్ట్ హ్యాచ్‌బ్యాక్ కారును ఆవిష్కరించి, ఆ తరువాత పూర్తి స్థాయిలో విపణిలోకి ప్రవేశపెట్టనుంది. ఈ తరుణంలో, ఎరుపు రంగు బాడీ పెయింట్ స్కీమ్‌లో 2018 స్విఫ్ట్ దిగ్గజం ఆటో మీడియా కంటబడింది. ఇప్పటి వరకు రహస్యంగా ఎన్నో దఫాలు మారుతి తమ నూతన స్విఫ్ట్‌ను పరీక్షించింది. అయితే, తాజాగా పట్టుబడిన మారుతి స్విఫ్ట్ ఫోటోలు చాలా స్పష్టంగా ఉన్నాయి. ఫ్రంట్ డిజైన్, సైడ్, రియర్ డిజైన్ అంశాలను స్పష్టంగా గమనించవచ్చు. 2018 స్విఫ్ట్ సైడ్ ప్రొఫైల్‌లో స్విఫ్ట్ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అదే రూపాన్ని కలిగి ఉంది. అయితే, ఆల్ న్యూ పిల్లర్స్, బ్లాక్ అవుట్ రియర్ పిల్లర్, స్లోపింగ్ రూఫ్ డిజైన్, రియర్ డోర్ హ్యాండిల్‌ను డోర్ ఫ్రేమ్‌లో కలిపేసింది. స్విఫ్ట్ రియర్ డిజైన్ విషయానికి వస్తే, కొత్తగా డిజైన్ చేసిన ఎల్ఇడి టెయిల్ ల్యాంప్స్, కొద్దిగా రీడిజైన్ చేసిన టెయిల్‌గేట్, బంపర్ ఉన్నాయి. అదే విధంగా ప్రస్తుత స్విఫ్ట్ తరహా కాకుండా నెక్సా స్టైల్ బ్యాడ్జింగ్ అందించింది.

మారుతి సుజుకి భారీ అంచనాలతో తీసుకొస్తున్న స్విఫ్ట్ హ్యాచ్‌బ్యాక్‌ను హార్టెక్ ఫ్లాట్‌ఫామ్ మీద నిర్మించింది. ఇదే ఫ్లాట్‌ఫామ్ ఆధారంగా బాలెనో, డిజైర్ కార్లను అభివృద్ధి చేసి రూపొందించింది. అధిక దృఢత్వం గల స్టీల్ ఉపయోగించి తేలిక బరువు ఉండేలా నిర్మించడం ఈ ఫ్లాట్‌ఫామ్ ప్రత్యేకత.

మారుతి సుజుకి స్విఫ్ట్ ఇంటీరియర్‌ను ప్రపంచ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని స్పోర్టివ్ శైలిలో అధునాతన ఫీచర్లను అందించి రూపొందించడం జరిగింది. మారుతి గత ఏడాది లాంచ్ డిజైర్ కాంపాక్ట్ సెడాన్ ఇంటీరియర్ నుండి సేకరించిన ఎన్నో అంశాలను ఇందులో పరిచయం చేస్తోంది. అందులో ఫ్లాట్‌బాటమ్ స్టీరింగ్ వీల్, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ట్విన్-పోడ్ ఇంస్ట్రుమెంట్ క్లస్టర్ వంటివి రానున్నాయి.

వాయిదాల చెల్లింపులతో జాగ్రత్త!

న్యూఢిల్లీ: గృహ రుణం, వాహన రుణం, విద్యా రుణం. సొంత అవసరాలకు వ్యక్తిగత రుణం.. లక్ష్యం ఏదైనా అప్పు దొరకడం ఇప్పుడు తేలికైన పనే. బ్యాంకుల ద్వారా అప్పులు తీసుకోవడం తేలికే గానీ, తిరిగి వాయిదా చెల్లింపుల విషయంలో చాలామంది కష్టంగా భావిస్తుంటారు. కొత్త రుణాలు రావాలంటే పాత అప్పులను మొత్తం చెల్లించాలి. అలా తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదాలు సకాలంలో చెల్లిస్తున్నారా, లేదా, వాటిని కట్టకుండా తప్పించుకుంటున్నారా అనే దానిపైనే భవిష్యత్తు రుణాలు ఆధారపడి ఉంటాయి.

అప్పులు తీసుకోవాలన్నా, క్రెడిట్ కార్డులు కావాలన్నా సిబిల్ ట్రాన్స్ యూనియన్ స్కోరు బాగుండాలి. రుణ చరిత్రలో ఎలాంటి ఇబ్బందికరమైన పరిస్థితులూ ఉండకూడదు. కొన్ని సర్వేల ప్రకారం చూస్తే, క్రెడిట్ స్కోరు 750 అంతకన్నా ఎక్కువ ఉన్నవారికే 79 శాతం వరకూ రుణాలు సులభంగా లభిస్తున్నాయి. అందుకే, కొత్తగా రుణం తీసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా మంచి క్రెడిట్ స్కోరు సాధించేందుకు ప్రయత్నించాలి.

మంచి క్రెడిట్ స్కోరు ఎలా?

ముందుగా సిబిల్ నివేదికలో ఉండే ప్రధానమైన అంశాల గురించి తెలుసుకోవాలి. ఇందులో ముఖ్యంగా 'అకౌంట్స్' విభాగం గురించి. ఇందులో ఇప్పటికే తీసుకున్న రుణాలు, క్రెడిట్ కార్డులు, రుణ సంస్థల వివరాలు ఉంటాయి. ఇంటి రుణమా, వాహన రుణమా, వ్యక్తిగత రుణమా, ఓవర్‌డ్రాఫ్టా ఇలా ఏ తరహా రుణం తీసుకున్నారన్న అంశాలూ ఉంటాయి. ఖాతాల సంఖ్య, రుణం ఎంత? ఎప్పుడు ఎంత తీసుకున్నారు? చివరిసారిగా వాయిదాలు ఎప్పుడు చెల్లించారు? ఇంకా ఎంత చెల్లించాలి..? అనే వివరాలు ఉంటాయి. నెలవారీ చెల్లింపులకు సంబంధించి దాదాపు మూడేళ్ల వరకూ పేర్కొంటారు. ప్రతి రుణ ఖాతాకు ఎదురుగా 'స్టేటస్' అనే అంశమూ ఉంటుంది. మీ రుణ చెల్లింపులు సరిగా ఉన్నాయా లేదా తెలిపేది ఈ అంశమే.

తీసుకున్న అప్పును రూపాయితో సహా తీర్చేస్తే స్టేటస్ కాలమ్‌లో పూర్తిగా అప్పు తీర్చేశారని పేర్కొంటూ 'క్లోజ్డ్' అని ఉంటుంది. అంటే బ్యాంకు పూర్తిగా ఆ ఖాతాను రద్దు చేసిందని అర్థం. సిబిల్ వంటి రుణ నివేదికల్లో ఇలా ఉండటమే మంచిది. రుణం తీసుకొని, దానిని పూర్తిగా చెల్లించిన తర్వాత బ్యాంకు నుంచి ఎలాంటి బాకీలు లేవని ఒక ధ్రువీకరణ పత్రాన్ని (నో డ్యూస్ సర్టిఫికెట్ లేదా నో అబ్జెక్షన్ సర్టిఫికేట్) తీసుకోవడం మర్చిపోవద్దు. దీనిని తీసుకోవడం వల్ల భవిష్యత్తులో ఏమైనా అనుకోని నోటీసులు వచ్చినప్పుడు ఇబ్బందులు లేకుండా ఉంటుంది. సిబిల్ నివేదికలోనూ 'క్లోజ్డ్' అని నమోదయిందో లేదో చూసుకోవాలి.



కొంతమంది వ్యక్తిగత కారణాలవల్ల తీసుకున్న రుణం, క్రెడిట్ కార్డు బిల్లులను పూర్తిగా చెల్లించలేని పరిస్థితుల్లో ఉంటారు. ఇలాంటివారు బ్యాంకులను సంప్రదించి ఎంతో కొంత మొత్తానికి ఒప్పందం కుదుర్చుకొని ఖాతాలను రద్దు చేసుకుంటారు. ఇలాంటప్పుడు బ్యాంకులు రుణ స్థితి ముందు 'సెటిల్డ్' అని నమోదు చేస్తాయి. ఇది కొత్త రుణాల లభ్యతపై కొంత ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. 'సెటిల్డ్' అని ఉండటం వల్ల క్రెడిట్ స్కోరుపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చు. రుణ చరిత్ర నివేదికలోనే ఈ విషయం పేర్కొంటారు. కాబట్టి, కొత్తగా అప్పు ఇవ్వబోయే బ్యాంకు రుణ చరిత్ర నివేదికను సునిశితంగా పరిశీలించినప్పుడు ఈ విషయం తెలుస్తుంది.

చెల్లింపులు జరపకపోతే....!

రుణ వాయిదాలనూ, క్రెడిట్ కార్డు బిల్లులనూ 180 రోజులపాటు ఎలాంటి చెల్లింపులు చేయకపోతే బ్యాంకులు ఆ వ్యక్తులను ఎగవేతదారుల జాబితాలో చేరుస్తాయి. వారి రుణ స్థితి ముందు 'రైట్ ఆఫ్' అని నమోదు చేస్తాయి. అదే సిబిల్ నివేదికలో 'రిటెన్ ఆఫ్' అని నమోదు అవుతుంది. ఇది ఇబ్బందికరమైన పరిణామమే. కొత్త రుణాలు, కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు బ్యాంకులు ఈ విషయాన్ని పరిగణనలోనికి తీసుకొని, ఆ దరఖాస్తును తిరస్కరించే అవకాశం ఉంది. బ్యాంకు దృష్టిలో అలాంటి వ్యక్తులు అంత నమ్మదగ్గ ఖాతాదారు కాదని అర్థం. అందుకే, ఇప్పటికే రుణం, క్రెడిట్ కార్డు ఉన్నవారు, కొత్తగా అప్పు లేదా క్రెడిట్ కార్డు తీసుకోబోయే ముందు తమ రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరు ఎలా ఉందని పరిశీలించుకోవడం మంచిది.


హెచ్‌టీసీ నుంచి యు11ఐ





ముంబై: ప్రముఖ మొబైల్ దిగ్గజం హెచ్‌టీసీ 2018వ సంవత్సరాన్ని సరికొత్తగా ఆరంభించబోతోంది. ఈ ఏడాదిలో తన తొలి స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్లోకి తీసు కురానుందనే వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా వస్తున్న వదంతుల ప్రకారం ఐ సీరిస్‌లో సరికొత్త స్మార్ట్‌ఫోన్ హెచ్‌టీసీ యు11ఐను జనవరి 15న విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ డివైస్ ను అమెరికా మార్కెట్‌తో పాటు ఇతర మార్కెట్లలో కూడా ఒకేసారి ప్రవేశపెడుతుం దా, లేదా అనేదానికి కంపెనీ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. భారీ స్క్రీన్, డ్యూయల్ సెల్ఫీ కెమె రాలతో లాంచ్ కానున్న ఈ డివైస్‌ను మిడ్ సెగ్మెంట్ బడ్జెట్ ధరలోనే కస్టమర్లకు అందుబాటులో ఉంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోం ది. దీని ధరను రూ. 32 వేలుగా నిర్ణయించనున్నట్లు సమాచారం. బ్లాక్, రెడ్, సిల్వర్ రంగుల్లో ఈ స్మార్ట్‌ఫోన్ లభ్యం కానుంది.

హెచ్‌టీసీ యు11ఐ ఫీచర్లు...

6 అంగుళాల ఫుల్‌హెచ్‌డీ డిస్‌ప్లే, సూపర్ ఎల్‌సీడీ3 1080 - 2160 పిక్సెల్ రిజల్యూషన్ స్నాప్ డ్రాగన్ 652 ప్రాసెసర్ ఆండ్రాయిడ్ నౌగట్ 4జీబీ ర్యామ్, 64 జీబీ స్టోరేజ్ డ్యూయల్ సెల్ఫీ కెమెరా 3,930ఎంఏహెచ్ బ్యాటరీ.









చాంపియన్ హైదరాబాద్ హంటర్స్

- ఫైనల్లో బెంగళూరు బ్లాస్టర్స్‌పై విజయం
- ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో హైదరాబాద్ హంటర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారమిక్కడ జరిగిన ఫైనల్లో హైదరాబాద్ హంటర్స్ 4-3తో బెంగళూరు బ్లాస్టర్స్‌ను చిత్తు చేసింది. తొలుత జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో హైదరాబాద్ హంటర్స్‌కు చెందిన మార్కిస్ కిడో, యు యియాన్ సియాంగ్ జోడీ 0-2 (9-15, 10-15)తో బెంగళూరు బ్లాస్టర్స్‌కు చెందిన మటియాస్ బోయె, కిమ్ స రాంగ్ జంట చేతిలో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్ ద్వయం ఆద్యంతం తికమక పడింది. ఇద్దరి మధ్య అవగాహన లోపం స్పష్టంగా కనిపించింది. ప్రత్యర్థి కొట్టిన షాట్లను అందుకోవడంలో ఇద్దరూ విఫలమయ్యారు. తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్‌ను హైదరాబాద్ హంటర్స్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్‌కు చెందిన లీ హ్యూన్ ఇల్ 2-0తో (15-7, 15-13) బెంగళూరు బ్లాస్టర్స్‌కు చెందిన శుభాంకర్ డేపై గెలిచాడు. తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్‌ను బెంగళూరు బ్లాస్టర్స్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్‌కు చెందిన బి. సాయి ప్రణీత్ 0-2తో (8-15, 10-15) బెంగళూరు బ్లాస్టర్స్‌కు చెందిన విక్టర్ యాక్సెల్‌సెన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. తర్వాత జరిగిన మహిళల సింగిల్స్‌లో కరోలినా మారిన్ 2-0 (15-8, 15-14)తో బెంగళూరు బ్లాస్టర్స్‌కు చెందిన క్రిస్టీ గిల్మోర్‌ను చిత్తు చేసింది. చివరిగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో హైదరాబాద్ హంటర్స్‌కు చెందిన బెర్నాడెత్, రాంకీరెడ్డి జంట 2-0(15-11, 15-12)తో బెంగళూరు బ్లాస్టర్స్‌కు చెందిన కిమ్ స రాంగ్, ఎన్. సిక్కి రెడ్డి ద్వయాన్ని ఓడించడంతో హైదరాబాద్ హంటర్స్ జట్టు విజేతగా నిలిచింది.



సౌతాఫ్రికాతో ఇక్కడ జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఎదురీదుతున్నాడు. ఒక ఎండ్‌లో కోహ్లీ ఆచి తూచి ఆడుతున్నా మరో ఎండ్ ఉన్న వాళ్లు తమ వికెట్లను కాపాడుకోలేకపోతున్నారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. ఓపెనర్ మురళీ విజయ్ రాణించినప్పటికీ కేఎల్ రాహుల్, చెటేశ్వర్ పుజారా, రోహిత్ శర్మ తమ వికెట్లను తక్కువ పరుగులకే కోల్పోయారు. దీంతో కోహ్లీ ఒంటరి పోరు కనసాగిస్తున్నాడు. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు టీమిండియా ఇంకా 152 పరుగులు వెనకబడివుంది. అంతకుముందు సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 335 పరుగులకు ఆలౌటైంది.

– సెంచూరియన్



కోహ్లీ ఎదురీత

సౌతాఫ్రికా ఆలౌట్

లంచ్ విరామ సమయానికి కొద్ది సేపటి ముందు సౌతాఫ్రికా జట్టు ఆలౌటైంది. 6 వికెట్ల నష్టానికి 269 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా మరో 66 పరుగులు జోడించి మిగిలిన 4 వికెట్లు కోల్పోయింది. లంచ్ విరామ సమయానికి టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 4 పరుగులు చేసింది. 24 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో ఆదివారం బ్యాటింగ్ కొనసాగించిన కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్‌కు మరో ఎండ్ నుంచి మద్దతు లభించపోయినప్పటికీ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. ఆచి తూచి ఆడుతూ భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. పేస్ బౌలర్ మహ్మద్ షమీ ఆరంభంలోనే ఓవర్ నైట్ బ్యాట్స్‌మన్ కేశవ్ మహరాజ్ (18)ను అవుట్ చేశాడు. మహరాజ్ కీపర్ పార్థీవ్ పటేల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఇషాంత్ శర్మ వేసిన షార్ట్ పిచ్ బంతిని హుక్ షాట్ ఆడిన కగిసొ రబాడ డీప్ స్క్వేయర్ లెగ్‌లో ఉన్న హార్దిక్ పాండ్యా చేతికి చిక్కాడు. కానీ అప్పటికే సౌతాఫ్రికా జట్టు 8 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. తర్వాత ఇషాంత్ వేసిన బంతిని డు ప్లెసిస్ మిస్ టైమింగ్‌తో ఆడి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో ఆతిథ్య జట్టు తొమ్మిదో వికెట్ కోల్పోయింది. తర్వాత ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వేసిన ఫుల్‌టాస్ బంతిని మోర్నే మోర్కెల్ భారీ షాట్ కొట్టబోయి డీప్ కవర్‌లో ఉన్న మురళీ విజయ్ చేతికి చిక్కడంతో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ ముగిసింది. తర్వాత టీమిండియా తొలి ఇన్నింగ్స్‌కు దిగి ఒక ఓవర్ మాత్రమే ఆడింది.

ఇన్నింగ్స్ చక్కదిద్దిన విజయ్, కోహ్లీ

మురళీ విజయ్, విరాట్ కోహ్లీ అజేయ 52 పరుగుల భాగస్వామ్యంతో టీమిండియా కష్టాల నుంచి తేరుకుంది. టీ విరామ సమయానికి టీమిండియా 28 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. విజయ్ (31), కోహ్లీ (39) క్రీజులో ఉన్నారు. టీమిండియా ఇంకా 255 పరుగులు వెనకబడింది. భోజన విరామం తర్వాత రాహుల్, విజయ్ ఆశావహంగా ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. ఇద్దరూ క్రీజులో నిలదొక్కుకున్నారని భావిస్తున్న సమయంలో తొమ్మిదో ఓవర్లో రాహుల్ అవుటయ్యాడు. మోర్కెల్ వేసిన బంతికి అతనికే క్యాచ్ ఇచ్చి రాహుల్ వెనుదిరిగాడు. అప్పుడే వచ్చిన చెటేశ్వర్ పుజారా తర్వాత బంతికే రనౌటయ్యాడు. లుంగిసని ఎంగిడి వేసిన బంతిని మిడాన్ మీదుగా ఆడిన పుజారా సింగిల్ తీయబోయాడు. అయితే సింగిల్ తీయడంలో మరో ఎండ్‌లో ఉన్న విజయ్‌తో తికమిక పడ్డాడు. ఈలోగా షార్ట్ మిడాన్‌లో ఉన్న రబాడా బంతిని నేరుగా వికెట్లకేసి కొట్టడంతో పుజారా వెనుదిరిగక తప్పలేదు. నాలుగో నంబర్ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆరంభం నుంచే ఉత్సాహంగా ఆడాడు. టైమ్ వేస్ట్ చేయకుండా సౌతాఫ్రికా బౌలర్లపై ఎదురు దాడికి దిగాడు. ఒక ఎండ్‌లో కోహ్లీ తన సహజ సిద్ధమైన ఆటను ఆడుతుంటే.. మరో ఎండ్‌లో విజయ్ మద్దతుగా నిలిచాడు. ఎడమ చేతి స్పిన్నర్ కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లోనూ ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆడారు. టీ విరామ సమయం వరకు మరో వికెట్ పడకుండా స్కోర్ బోర్డును ముందుకు కదిలించారు.

అండగా నిలిచిన కోహ్లీ

టీ విరామం తర్వాత టీమిండియా ఇన్నింగ్స్‌లో తీవ్ర నష్టం జరిగింది. కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో విజయ్ అవుట్ కావడంతో 79 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన రోహిత్ శర్మ మరోసారి తక్కువ పరుగులకే అవుటయ్యాడు. రబాడ బౌలింగ్‌లో ఎల్‌బిడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఫీల్డ్ అంపైర్ నిర్ణయంపై అనుమానం వచ్చిన రోహిత్ రివ్యూ కోరినా ఫలితం దక్కలేదు. తర్వాత నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన అక్షర్ పటేల్ కూడా తన వికెట్‌ను కాపాడుకోలేకపోయాడు. ఎంగిడి వేసిన బంతికి డికాక్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారిపట్టాడు. దీంతో సౌతాఫ్రికా మళ్లీ మ్యాచ్‌పై పట్టు సాధిస్తున్నట్టు అనిపించింది. కానీ తర్వాత వచ్చిన హార్దిక్ పాండ్యా వికెట్‌ను జాగ్రత్తగా కాపాడుకున్నాడు. చివరి వరకు కెప్టెన్‌కు అండగా నిలిచాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి కోహ్లీ (84), పాండ్యా (11) క్రీజులో ఉన్నారు.

స్కోరుబోర్డు

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ (ఓవర్‌నైట్ స్కోరు 269/6): ప్లెసిస్ (బి) ఇషాంత్ 63, మహరాజ్ (సి) పటేల్ (బి) షమీ 18, రబాడ (సి) పాండ్యా (బి) ఇషాంత్ 11, మోర్కెల్ (సి) విజయ్ (బి) అశ్విన్ 6, ఎంగిడి నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం 113.5 ఓవర్లలో 335 ఆలౌట్; వికెట్ల పతనం: 7-282, 8-324, 9-333, 10-335; బౌలింగ్: బుమ్రా: 22-6-60-0, షమీ: 15-2-58-1, ఇషాంత్: 22-4-46-3, పాండ్యా: 16-4-50-0, అశ్విన్: 38.5-10-113-4.

ఇండియా తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డికాక్ (బి) మహరాజ్ 46, రాహుల్ (సి) అండ్ (బి) మోర్కెల్ 10, పుజారా రనౌట్ 0, కోహ్లీ నాటౌట్ 85, రోహిత్ ఎల్‌బిడబ్ల్యూ (బి) రబాడ 10, అక్షర్ పటేల్ (సి) డికాక్ (బి) ఎంగిడి 19, పాండ్యా నాటౌట్ 11; ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం 61 ఓవర్లలో 183/5; వికెట్ల పతనం: 1-28, 2-28, 3-107, 4-132, 5-164; బౌలింగ్: మహరాజ్: 16-1-53-1, మోర్కెల్: 15-3-47-1, ఫిలాండర్: 9-3-23-1, రబాడ: 12-0-33-1, ఎంగిడి: 9-2-26-1.



రిషబ్ పంత్ రికార్డు

- టీ20 చరిత్రలో రెండో ఫాస్టెస్ట్ సెంచరీ

న్యూఢిల్లీ: ఢిల్లీకి చెందిన వికెట్‌కీపర్/ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ టీ20ల్లో రికార్డు సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా జరుగుతున్న నార్త్‌జోన్ టీ20 లీగ్‌లో హిమాచల్ జట్టుపై పంత్ 38 బంతుల్లోనే అజేయ 116 పరుగులు సాధించాడు. దీంతో టీ20 ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా పంత్ నిలిచాడు. రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌కు పంత్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. పంత్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఢిల్లీ జట్టు 10 వికెట్లతో గెలిచింది. హిమాచల్ నిర్దేశించిన 144 పరుగుల గెలుపు లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పంత్ 32 బంతుల్లో మూడంకెల స్కోరు సాధించింది. మరో ఎండ్‌లో ఉన్న గౌతమ్ గంభీర్ 33 బంతుల్లో 30 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ లక్ష్యాన్ని ఢిల్లీ జట్టు 11.4 ఓవర్లలోనే ఛేదించింది. టీ20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ ఇంకా వెస్టిండీస్ బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ పేరు మీదనే ఉంది. 2013 ఐపీఎల్‌లో అతను 30 బంతుల్లో 100 పరుగులు చేశాడు. అయితే పంత్ ఈ మ్యాచ్‌లో 12 సిక్సర్లు 8 ఫోర్లు బాదాడు.

పృథ్వీ సేన శుభారంభం



తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై గెలుపు - ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్

మౌంట్ మాంగనుయ్: పృథ్వీ షా కెప్టెన్ ఇన్నింగ్స్, మనోజ్ కల్రా, శుభ్‌మన్ అర్ధ సెంచరీలు చేయడంతో ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. ఆదివారమిక్కడ జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 100 పరుగులతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసింది. తర్వాత ఆస్ట్రేలియా 42.5 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. పృథ్వీ షా 94, మనోజ్ కల్రా, 86, శుభ్‌మన్ 63 పరుగుల చేశాడు. షా, కల్రా ఇండియాకు శుభారంభాన్నిచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 180 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. దీంతో 2006 అండర్-19 వరల్డ్ కప్‌లో రాబిన్ ఊతప్ప, శిఖర్ ధావన్ తొలి వికెట్‌కు నెలకొల్పిన 173 అత్యుత్తమ భాగస్వామ్యాన్ని అధిగమించారు. తర్వాత అభిషేక్ శర్మ 8 బంతుల్లో 23 పరుగులు చేయడంతో టీమిండియా భారీ స్కోరును సాధించింది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే షాకు ఒక లైఫ్ లభించింది. విల్ సూదర్లాండ్ వేసిన బంతి షా బ్యాట్ అంచును తాకి వికెట్ కీపర్ చేతిలోకి వెళ్లింది. కానీ అది నోబాల్ అయింది. ఆ తర్వాత ముంబై బ్యాట్స్‌మన్ షా మరింత రెచ్చిపోయాడు. జేవియర్ బార్లెట్ ఓవర్లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్ బాదాడు. తర్వాత ఎడమ చేతి బ్యాట్స్‌మన్ కల్రా కూడా రెండు ఫోర్లను తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో పదో ఓవర్లోనే ఇండియా 50 పరుగుల మార్క్‌ను దాటింది. 18వ ఓవర్లో 100 పరుగుల మార్క్‌ను చేరుకుంది. లాయిడ్ పోప్ వేసి ఓవర్లో కల్రా మరో రెండు బౌండరీలు బాదాడు. తొలుత షా 55 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. కాగా కల్రా 60 బంతులకు 50 పరుగులు సాధించాడు. షా, కల్రా సరైన రన్‌రేట్‌ను కొనసాగిస్తూ మిడిలార్డర్‌కు ఒక మంచి ప్లాట్‌ఫామ్‌ను అందించారు. అయితే సెంచరీకి దగ్గరగా వచ్చిన షా.. సుదర్లాండ్ వేసిన బంతిని బ్యాక్‌ఫుట్‌లో కట్ షాట్ ఆడబోయి కీపర్ చేతికి చిక్కాడు. తర్వాత కాసేపటికే కల్రా కూడా పెవిలియన్ చేరుకున్నాడు. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా అర్ధ సెంచరీ చేయడంతో ఇండియా 300 పరుగుల మార్క్‌ను దాటింది. చివరి పది ఓవర్లలో ఇండియా 5 వికెట్లు కోల్పోయినప్పటికీ 105 పరుగులు చేయగలిగింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టులో ఓపెనర్ జాక్ ఎడ్వర్డ్స్ 73 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కాగా వికెట్‌కీపర్/ బ్యాట్స్‌మన్ జె హోల్ట్ 30 బంతుల్లో 39 పరుగులు సాధించాడు. మెర్లో 32 బంతుల్లో 38, బ్రియాంట్ 48 బంతుల్లో 29 పరుగులు చేశారు. మిగిలినవాళ్లంతా తక్కువ పరుగులకే వెనుదిరిగారు. భారత బౌలింగ్‌లో శివం మవి, నగర్‌కోటి మూడేసి వికెట్లు తీసుకున్నారు. అభిషేక్ శర్మ, రాయ్ చెరో వికెట్ పడగొట్టారు. ఇతర మ్యాచ్‌ల్లో శ్రీలంక 7 వికెట్లతో ఐర్లాండ్‌పై గెలిచింది. తొలుత ఐర్లాండ్ 48 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేయగా.. తర్వాత శ్రీలంక 37.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 208 పరుగులు సాధించింది. మరో మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టు 169 పరుగులతో కెన్యాను ఓడించింది. తొలుత సౌతాఫ్రికా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 341 పరుగులు చేయగా.. తర్వాత కెన్యా 7 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేయగలిగింది.




ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు గాయాల బెడద

నేటి నుంచి తొలి గ్రాండ్ శ్లామ్

మెల్‌బోర్న్: ఈ ఏడాది తొలి గ్రాండ్ శ్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు గాయాల బెడద పట్టుకుంది. చాలా మంది స్టార్ ప్లేయర్స్ వైరల్ ఫీవర్‌తో గాయాలతో బాధపడుతున్నారు. ఇప్పటికే సెరెనా విలియమ్స్, ఆండీ ముర్రే ఈ టోర్నీకి దూరమయ్యారు. గతేడాది జులైలో జరిగిన వింబుల్డన్‌లో సెర్బియా స్టార్ నోవక్ జొకోవిచ్ కుడి మోచేయి గాయానికి గురయ్యాడు. ఇప్పటికీ తాను పూర్తి ఫిట్‌నెస్‌తో లేనని అంటున్నాడు. స్పెయిన్‌కు చెందిన ప్రపంచ నంబర్ వన్ మోకాలి గాయం కారణంగా ఇటీవల జరిగిన బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ ప్రాక్టీస్ మ్యాచ్‌కు దూరమయ్యాడు. మెల్బోర్న్‌లో ప్రాక్టీస్ సెషన్ అనంతరం తాను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నట్టు చెప్పాడు. మోకాలికి రెండుసార్లు ఆపరేషన్ చేయించుకున్న 2014 చాంపియన్ స్టాన్సిలా వావ్రింకా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడేందుకు సిద్ధమయ్యాడు. ప్రస్తుతం తన మోకాలు బాగానే ఉన్నప్పటికీ అప్పుడప్పుడు నొప్పి పెడుతోందని అంటున్నాడు. దీంతో ఇతను టోర్నీని పూర్తి చేస్తాడా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇంకా చాలా మంది స్టార్ ప్లేయర్స్ ఇలా ఏదో ఒక అస్వస్థతతో బాధపడుతున్నారు.

మెయిన్ డ్రాకు యుకీ భాంబ్రీ అర్హత

భారత టెన్నిస్ స్టార్ యుకీ భాంబ్రీ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. ఇక్కడ జరిగిన ఫైనల్ క్వాలిఫయింగ్ రౌండ్ మ్యాచ్‌లో భాంబ్రీ 1-6, 6-3, 6-3తో కెనెడాకు చెందిన పీటర్ పోలన్‌స్కీపై పోరాడి గెలిచాడు. తొలి సెట్‌ను ఓడిపోయినప్పటికీ భాంబ్రీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా తర్వాతి రెండు సెట్లలో గెలిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సింగిల్స్ మెయిన్ డ్రాకు భాంబ్రీ అర్హత సాధించడం ఇది మూడోసారి. 2015, 2016లలో మెయిన్ డ్రాకు అర్హత సాధించిన భాంబ్రీ ఆండీ ముర్రే, థామస్ బెర్డిచ్ చేతుల్లో ఓటమిపాలయ్యాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రా తొలి రౌండ్ మ్యాచ్‌లో సైప్రస్‌కు చెందిన మార్కోస్ బాగ్దాటిస్‌తో భాంబ్రీ తలపడనున్నాడు. కాగా మరో ఆటగాడు రామ్‌కుమార్ రామ్‌నాథ్ మెయిన్ డ్రాకు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. మూడో రౌండ్ మ్యాచ్‌లో రామ్‌కుమార్ 6-4, 4-6, 4-6తో కెనెడాకే చెందిన వసెక్ పోస్పిసిల్ చేతిలో ఓటమిపాలయ్యాడు.



100 వికెట్ల క్లబ్‌లో షమీ


సెంచూరియన్: భారత ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ టెస్టుల్లో 100 వికెట్లు పూర్తి చేశాడు. సౌతాఫ్రికాతో ఇక్కడ జరుగుతున్న రెండో టెస్టులో శనివారం తొలి రోజు ఆటలో కేశవ్ మహరాజ్‌ను అవుట్ చేయడంతో షమీ 100 వికెట్ల క్లబ్‌లో చేరాడు. 27 ఏళ్ల షమీ 97వ, 98వ, 99వ వికెట్లను కేప్‌టౌన్‌లో పడగొట్టాడు. ఈ ఘనత సాధించిన భారత ఏడో పేస్ బౌలర్‌గా షమీ నిలిచాడు. కపిల్ దేవ్, జహీర్ ఖాన్, జవగళ్ శ్రీనాథ్, ఇషాంత్ శర్మ, కర్సన్ గవ్రీ, ఇర్ఫాన్ పఠాన్ ఇంతకుముందు ఈ క్లబ్‌లో ఉన్నారు. 29వ టెస్టులో షమీ ఈ ఘనత సాధించాడు. కాగా ఇంతకుముందు రవిచంద్రన్ అశ్విన్ అత్యంత వేగంగా టెస్టుల్లో 100 వికెట్లు పూర్తి చేశాడు. 18వ మ్యాచ్‌లోనే ఈ మైలురాయిని చేరుకున్నాడు. గతంలో ఎరాపల్లి ప్రసన్న 20 మ్యాచ్‌ల్లో, అనిల్ కుంబ్లే 21, శుభాష్ గప్టే, బీఎస్ చంద్రశేఖర్, ప్రగ్యాన్ ఓఝా 22, వినోద్ మన్కడ్ 23, కపిల్ దేవ్, హర్భజన్ సింగ్ 25 మ్యాచ్‌ల్లో 100 వికెట్లు పూర్తి చేశారు. 2013 నవంబర్‌లో ఈడెన్ గార్డెన్‌లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో షమీ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు.




రిషబ్ పంత్ రికార్డు

టీ20 చరిత్రలో
రెండో ఫాస్టెస్ట్ సెంచరీ

క్రీడా వార్తలు 11లో











Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.